
జ్ఞాన సిద్ధాంతం
రూ॥200/-
పేజీలు:210
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

సంపుటి 09, సంచిక: 85 | సోమవారం | 23-02-2026 | ఖమ్మం

Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar

పేజీలు: 12+8 | వెల రూ. 5.00


ఆఫ్ఘాన్ ఉగ్రవాద స్థావరాలపై పాక్ దాడులు
17మంది మృతి

ఇరాన్‌లో మళ్లీ నిరసన ప్రదర్శనలు

02

## మావోయిస్టు జాతీయ కార్యదర్శి దేవ్ జీ లొంగుబాటు


దేవ్‌జీ


### కేంద్ర కమిటీ సభ్యుడు రాజిరెడ్డి కూడా సరెండర్

### మరో 16 మంది జనజీవన స్రవంతిలోకి

- దేవ్ జీ, రాజిరెడ్డిపై చెరి రూ.25లక్షల చొప్పున రివార్డు
- లొంగుబాటును ధృవీకరించిన ఛతీస్‌గఢ్ డిప్యూటీ సిఎం విజయ్ శర్మ

ప్రజాపక్షం /హైదరాబాద్

నిషేధిత మావోయిస్టు సంస్థ సిపిఐ (మావోయి స్టు) పార్టీ అత్యగనేత, జాతీయ కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ(58), కేంద్ర కమిటి సభ్యుడు మల్లా రాజిరెడ్డి (71) తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయారు. వీరిద్దరితో పాటు మొత్తం 16 మంది మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయాన్ని ఛతీస్‌గఢ్ డిప్యూటీ సిఎం విజయ్‌శర్మ ధృవీకరించారు. ఈ లొంగుబాటు హైదరాబాద్‌లోని తెలంగాణ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబి) కార్యాలయంలో జరిగినట్లు తెలిసింది. గత కొద్ది నెలలుగా దేవ్‌జీ, రాజిరెడ్డిని లక్ష్యంగా చేసుకుని భద్రతా దళాలు ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహిస్తున్నాయి. మార్చి 31 నాటికి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో ఈ పరిణామం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. దేవ్‌జీ, రాజిరెడ్డిలపై చెరో రూ. 25 లక్షల రివార్డు ఉంది.త్వరలో వీరందరిని మీడియా ముందు ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా వీరిద్దరు మావోయిస్టు పార్టీలో గెరిల్లా దళాల నిర్వహణ,క్యాడర్ నియామకం, శిక్షణ, భద్రతా దళాలపై దాడుల వ్యూహరచన,ఆయుధ సరఫరా సమన్వయం చూసుకునేవారని తెలిసింది. దేవ్‌జీపై పోలీసు వర్గాల సమాచారం ప్రకారం రాష్ట్రాల్లో అనేక కేసులు నమోదయ్యాయి.భద్రతా దళాలపై దాడులకు కుట్ర,పేలుడు ఘటనల తరువాయి 2లో


రాజిరెడ్డి

## రెండు, మూడేళ్లలో ప్రాజెక్టులన్నీ పూర్తి

సిఎం కుర్చీ అనేది ప్రతిసారి వారసత్వంగా దక్కదు. టిడిపి, కాంగ్రెస్, బిఆర్ఎస్‌కు వరుసగా రెండుసార్లు చొప్పున ప్రజలు అవకాశం ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా ప్రజలు మరో అవకాశం ఇస్తారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టులను గాలికి వదిలేయం. ప్రజల సొమ్ముతో కట్టిన ప్రాజెక్టులు వృథాగా వదిలేసేది లేదు. 'గోదావరి నదీ జలాలలకు సంబంధించిన ప్రాజెక్టులను మనం ఈ పదేళ్లలో పూర్తి చేసుకుని 967 టిఎంసిలను వినియోగం లోకి తెచ్చుకుని ఉంటే ఈనాడు వరద జలాల విషయంలో కూడా వాటాలు అడిగే పరిస్థితి ఉండేది.

– సిఎం

గోదావరి జలాల వివాదం కొన్నాళ్లుగా రాజకీయరంగు పులుముకుంది

గత ప్రభుత్వ హయాంలో కాళేశ్వరానికే రూ.1.10 లక్షల కోట్ల ఖర్చు

నేడు మిగతా ప్రాజెక్టులు, భూసేకరణకు నిధుల కొరత



- రూ. 6 వేల కోట్ల అంచనాలతో దేవాదుల మొదలు పెడితే... నేడు రూ. 18 వేల కోట్ల నిధులు అవసరమైన స్థితి
- ప్రాజెక్టు కోసం జూన్ 2 లోపు రూ.600 కోట్లు మంజూరు చేస్తాం
- ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలు చేద్దాం.. ప్రజలు, నీళ్ల విషయంలో కాదు
- పలు ఎన్నికల్లో తీర్పు చూసిన తర్వాతైనా బిఆర్ఎస్ నేతలు మారకపోవటం విచారకరం
- ఎపితో సమస్యను సామరస్యంగా పరిష్కరించుకుంటాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ములుగు జిల్లా తుపాకుల గూడెం వద్ద దేవాదుల ప్రాజెక్టు పరిశీలన

ప్రజాపక్షం/ములుగు

గోదావరి జలాల వివాదం కొన్నాళ్లుగా రాజకీయ రంగు పులుముకుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గడిచిన పదేళ్లలో ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ఇప్పుడు వివాదమే ఉండేది కాదని అభిప్రాయపడ్డారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద దేవాదుల ప్రాజెక్టును పరిశీలిం ముఖ్యమంత్రి పరిశీలించారు. అనంతరం పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్‌పై ఆయన పలు విమర్శలు గుప్పించారు. వచ్చే రెండు మూడేళ్లలో ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేయాలని కృత నిశ్చయంతో ఉన్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు మీదే రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేయడం వల్ల మిగతా వాటికి, భూ సేకరణకు తీవ్రంగా నిధుల కొరత ఉందని తెలిపారు. రూ.6వేల కోట్ల అంచనాతో మొదలుపెట్టిన దేవాదుల ప్రాజెక్టు నేడు రూ.18 వేలకోట్ల నిధులు అవసరమైన స్థితికి చేరుకుందన్నారు. దేవాదుల ప్రాజెక్టు భూసేకరణ కోసం జూన్ 2లోపు రూ.600 కోట్లు మంజూరు చేస్తామని సిఎం ప్రకటించారు. ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని అంచనాలను బడ్జెట్‌లో ప్రభుత్వం ముందుంచి ఆమోదం తీసుకోవాలని అధికారులకు సూచించారు. మార్చి నెలలో మంత్రి వర్గం సమావేశం ఏర్పాటు చేసి పెండింగ్ అంచనాలకు ఆమోదం తెలపాలని నిర్ణయించామన్నారు. దేవాదుల పంపులకు నెలరోజుల్లోపు మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో ఎమ్మెల్యేలు, అధికారులతో కమిటీ హాల్‌లో దేవాదుల ప్రాజెక్టుపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ కోసం ప్రత్యేక కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. భూ యజమానులకు పరిహారం చెల్లింపులు గ్రీన్ ఛానల్ ద్వారా వేగవంతంగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. భూసేకరణలో తరువాయి 2లో

## ఉగ్రకుట్ర భగ్నం



- తమిళనాడు, బెంగాల్‌లో కలిపి ఎనిమిది మంది అరెస్ట్
- 8 మొబైల్ ఫోన్లు, 16 సిమ్ కార్డులు స్వాధీనం
- పాక్ గూఢచర్య సంస్థ ఐఎస్ఐ, బంగ్లాదేశ్‌తో సంబంధాలు ఉన్నట్లు పోలీసుల వెల్లడి

**న్యూఢిల్లీ :** దేశంలో భారీ ఉగ్రదాడులకు ప్లాన్ చేస్తున్న ముఠాను ఢిల్లీ పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం ఎనిమిది మంది పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారికి పాకిస్థాన్ గూఢచర్య సంస్థ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ), బంగ్లాదేశ్‌కు చెందిన తీవ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. తదుపరి దర్యాప్తు కోసం వారిని ఢిల్లీకి తరలిస్తున్నారు. ఇటీవల ఢిల్లీ మెట్రో సహా దేశ రాజధానిలో పలు ప్రాంతాల్లో ప్రజలను రెచ్చగొట్టే విధంగా పోస్టర్లు అంటికించారు. ఆ పోస్టర్లలో కశ్మీర్‌కు సంబంధించిన ఉద్రిక్త తరువాయి 2లో



## అడుక్కుంటే కాదు పోరాడితేనే హక్కులు

- ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించకపోవడంతో అడ్డదారుల్లో యువత పయనం
- సిఆర్‌పి యూనియన్ రాష్ట్ర సదస్సులో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం / హైదరాబాద్

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చెప్పినట్టు 'అడుక్కుంటే కాదు, పోరాడితేనే హక్కులు సాధించవచ్చు' అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం ఎన్.సత్యనారాయణ రెడ్డి భవన్‌లో ఆదివారం జరిగిన సిఆర్‌పి యూనియన్ రాష్ట్ర సదస్సులో సిఆర్‌పి యూనియన్ తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా కూనంనేని సాంబశివరావు, ముఖ్య సలహాదారులుగా ఎస్. బాల్‌రాజ్, రాష్ట్ర అధ్యక్షులుగా పాడ్య నాగేశ్వరావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కడారి సునీల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిట్ట దేవేందర్, రాష్ట్ర కోశాధికారి రామ్ కుమార్, రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ పోలె రమేష్‌లను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సిఆర్‌పి యూనియన్ తెలంగాణ(సియుటి) ఇకపై ఎఐటియుసి అనుంధ సంస్థగా కొనసాగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ సిఆర్‌పిలు యూనియన్‌గా ఏర్పడి, హక్కుల సాధనకై ఎఐటియుసి నాయకత్వాన్ని ఎంచుకోవడం శుభపరిణామమన్నారు. తాను ఒక ఉపాధ్యాయుడినని, వారు పడే సాధకబాధకలు తెలుసుననీ చెప్పారు. ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించలేక అడ్డమైన తరువాయి 2లో

## 9 రాష్ట్రాలు, యుటిల్లో 1.70 కోట్ల ఓట్లు తొలగింపు

- గుజరాత్, పుదుచ్చేరి, లక్షద్వీప్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, అండమాన్ అండ్ నికోబార్ దీవులు, గోవా, కేరళలో తుది జాబితా ప్రకటించిన ఇసి




**న్యూఢిల్లీ :** ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)ను పలు రాష్ట్రల్లో కొనసాగిస్తుంది. అందులో భాగంగా తుది ఓటర్ల జాబితా ప్రచురించబడిన తర్వాత తొమ్మిది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో 1.70 కోట్లకు పైగా ఓటర్లను తొలగించింది. గత సంవత్సరం అక్టోబర్ 27న సర్ ప్రక్రియ ప్రారంభమయ్యే ముందు గుజరాత్, పుదుచ్చేరి, లక్షద్వీప్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, అండమాన్ అండ్ నికోబార్ దీవులు, గోవా, కేరళ రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు శనివారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఈ రాష్ట్రాల్లో తరువాయి 2లో

## మెడికో ఆత్మహత్య

- ప్రేమ పేరుతో వేధించటంతో బలవన్మరణం
- సిద్దిపేట సురభి మెడికల్ కళాశాలలో ఘటన
- త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసుమోదు

ప్రజాపక్షం/ సిద్దిపేట



మెడికో విద్యార్థి ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట సురభి వైద్య కళాశాల్లో ఆదివారం వెలుగు చూసింది. సిద్దిపేట త్రీ టౌన్ సిఐ లక్ష్మి బాబు, విద్యార్థులు తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా శ్రీరాంపూర్ మండలం మెడిపల్లి గ్రామానికి చెందిన ఈద శ్రీజ (20) తల్లిదండ్రులు మృతి చెందటంతో మేనమామ నంటబాపు గత 20 ఏండ్లుగా పెంచి పోషిస్తూ చదివిస్తున్నా రు.. 2024 ఎంసెట్ ఎంట్రన్స్ ద్వారా మిట్టపల్లి సురభి కళాశాలలో బిపిటి మొదటి సంవత్సరం పూర్తిచేసుకుంది. రోజు మాదిరిగానే విద్యార్థులతో కలసి ఉదయం లేచి టిఫిన్‌కు వెళ్లాల్సిన సమయంలో శ్రీజ తాను వస్తాను.. మీరు వెళ్లండని అంటూ తన తోటి తరువాయి 2లో

## జమ్ముకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

ముగ్గురు ఉగ్రవాదులు హతం

## ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంకులో భారీ మోసం

గోల్‌మాల్ వ్యవహారం విలువ రూ.590 కోట్లు

05



## ఇస్కఫ్ జాతీయ అధ్యక్షుడిగా అజీజ్ పాషా

### కోశాధికారిగా కడారు ప్రభాకర్ రావు ఎన్నిక

ప్రజాపక్షం/హైదరాబాద్

భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) జాతీయ అధ్యక్షులుగా మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా, జాతీయ కోశాధికారిగా హైకోర్టు న్యాయవాది కడారు ప్రభాకర్ రావు ఎన్నికయ్యారు. ఈనెల 19,20వ తేదీల్లో చెన్నైలో జరిగిన తరువాయి 2లో

## నాలుగేళ్లుగా యుద్ధం



- రష్యా–ఉక్రేన్‌లో 4.65 లక్షలమంది మృతి
- నష్టపోయిన 20 లక్షల సైనిక కుటుంబాలు
- సెంటర్ ఫర్ స్ట్రేటజిక్ ఇంటర్నేషనల్ స్టడీస్ అంచనా
- యుద్ధానికి రేపటితో నాలుగేళ్ళుపూర్తి

**కీవ్:** హంగరీ, స్లోవేకియా దేశాల తాజా హెచ్చరికలమధ్య,ఉక్రేన్‌లో రష్యా పూర్తిస్థాయి యుద్ధం ప్రారంభించి ఫిబ్రవరి 24వ తేదీ నాటికి నాలుగు సంవత్సరాలు పూర్తవుతున్నాయి. ఈ యుద్ధంలో ఇరువైపులా 4.65 లక్షలమంది మరణించారని, మొత్తంగా 20 లక్షల సైనిక కుటుంబాలు నష్టపోయాయని వాషింగ్టన్ కేంద్రంగా పనిచేస్తున్న సెంటర్ ఫర్ స్ట్రేటజిక్–ఇంటర్నేషనల్ స్టడీస్ (సిఎస్ఐఎస్) అంచనావేసింది. రెండు దేశాలమధ్యా 1200 కి.మీ సరిహద్దు ప్రాంతం ఉంది. అమెరికా అధ్యక్ష ఎన్నికల సందర్భంగా డోనాల్డ్ ట్రంప్ ప్రజల్లో ప్రచారం చేస్తూ అధికారంలోకి వస్తే ఒక్కరోజులోనే ఉక్రేన్–రష్యా యుద్ధం ఆపేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. కానీ ఆయన ప్రయత్నాలు ఏడాది గడచినాగానీ సఫలంకాలేదు. కాగా, డ్రుజ్బా పైపులైను ద్వారా స్లోవేకియాకు చమురు సరఫరా విధానాన్ని సోమవారంనాటికి పునరుద్ధరించకపోతే ఉక్రేన్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తరువాయి 12లో

## ఈ వెతలు తీరేదెన్నడో?



- 22 మాసాలుగా అందని పింఛన్ బకాయిలు
- మనోవేదనలో పింఛన్‌దారులు
- ఇప్పటికే ఖమ్మం జిల్లాలో ఆరుగురు మృతి

ప్రజాపక్షం/ ఖమ్మం

ప్రభుత్వ ఉద్యోగులకు అతి పెద్ద భరోసా పింఛన్. ఆర్థిక భరోసా పింఛన్ బకాయిల చెల్లింపు. సర్వీసులో ఉన్నప్పుడు కుటుంబ ఖర్చులు, ఇతరత్రా అవసరాలతో డబ్బు దాచుకున్నా, దాచుకోకపోయినా ఉద్యోగ విరమణ తర్వాత పింఛన్ తో పాటు ప్రభుత్వం చెల్లించే పింఛన్ బకాయిలు ఆసరాగా ఉంటాయన్న భావన ప్రతి ప్రభుత్వ ఉద్యోగిలోనూ ఉంటుంది. ఇప్పుడు పింఛన్‌దారుల ఆలోచనకు ప్రభుత్వం గండి కొట్టింది. 22 మాసాలుగా పింఛన్ బకాయిలు చెల్లించకపోవడంతో పింఛన్‌దారులు తీవ్ర మనో వ్యధకు గురవుతున్నారు. ఇప్పటికే ఒక ఖమ్మం జిల్లాలోనే ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. తమ ఉద్యోగ కాలంలో దాచుకున్న మొత్తాన్ని ఇవ్వడంలో ప్రస్తుత ప్రభుత్వం వైఫల్యం చెందింది. సాధారణంగా ఉద్యోగి ఉద్యోగ విరమణ చేసిన రెండు నెలల లోపు మొత్తం బకాయిలను ప్రభుత్వం చెల్లించేది. 2024 ఏప్రిల్ మాసం నుండి ఉద్యోగ విరమణ చేసిన వారికి బకాయిల చెల్లింపులు జరగడం లేదు. రాష్ట్ర తరువాయి 12లో

## ఇజ్రాయెల్‌కు ఎలాంటి హక్కులూ లేవు

హక్కబీ వ్యాఖ్యలకు అరబ్ దేశాల ఖండన



**టెల్అవీవ్:** పవిత్రగ్రంథం బైబిల్‌లో చెప్పిన ప్రకారం ఇజ్రాయెల్ దేశం పశ్చిమ ఆసియాలో ఉన్న విస్తారమైన ప్రాంతాలను తన స్వాధీనంలోకి తెచ్చుకోవడం తప్పుకాదని ఇజ్రాయెల్‌లో అమెరికా దౌత్యవేత్త హక్కబీ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను 14 అరబ్, ముస్లిం దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఆక్రమిత పాలస్తీనా భూభాగాలపైన, ఇతర అరబ్ రాజ్యాల భూభాగాలపైన ఇజ్రాయెల్‌కు ఎలాంటి హక్కులూ లేవని స్పష్టం చేశాయి. అమెరికాకు చెందిన మితవాద కామెంటేటర్ టక్కర్ కార్ల్‌సన్‌కు శుక్రవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో హక్కబీ ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రాంతాన్ని ఆక్రమించడానికి ఇజ్రాయెల్‌కు ఏమైనా హక్కులున్నాయా? అని కామెంటేటర్ ప్రశ్నించినప్పుడు, ఔను, ఉన్నాయి, బైబిల్‌లో చెప్పిన భవిష్య పురాణం ప్రకారం యావత్ పశ్చిమ ఆసియాలో ప్రాంతాలను ఆక్రమించడానికి ఇజ్రాయెల్‌కు హక్కులున్నాయని హక్కబీ సమర్థించారు. మొత్తం అంతా (భూమి) తీసుకుంటే బాగుంటుంది, కానీ ఇజ్రాయెల్ ఆ ప్రయత్నం చేయడంలేదు, ఇప్పుడు ఆక్రమించిన భూమిని కాపాడాలని ప్రజలను ఇజ్రాయెల్ కోరుతోంది'' అన్నారు. జోర్డాన్,ఈజిప్టు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సహా డజనుకుపైగా దేశాలు ఒక సంయుక్త ప్రకటనలో హక్కబీ వ్యాఖ్యలను ఖండించాయి. ఆయన వ్యాఖ్యలు అంత్యత ప్రమాదకరమైనవని, యుద్ధం ముగించేందుకు చేస్తున్న ప్రయత్నాలకు పెద్ద ప్రమాదకరంగా మారతాయని పేర్కొన్నాయి. ఆయన వ్యాఖ్యలు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని, గాజాలో ట్రంప్ ప్రతిపాదించిన ప్రణాళికకు భిన్నంగా ఉన్నాయని విమర్శించాయి.

## ఆఫ్ఘాన్ ఉగ్రవాదస్థావరాలపై పాక్ దాడులు

# 70 మంది మృతి



**కాబూల్:** సరిహద్దుల్లో ఉన్న అఫ్ఘానిస్థాన్ గ్రామంపై పాకిస్థాన్ సైనిక దళాలు గగనతల దాడులు చేశాయి. ఈ దాడుల్లో 70 మంది మరణించారు. దీంతో ఆఫ్ఘానిస్థాన్ ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నాన్‌గర్హర్, పక్తికా ప్రాంతాలలో ఉన్న ఇళ్ళు, నివాసిత ప్రాంతాలు, ప్రార్థనాలయాలు లక్ష్యంగా చేసిన ఈ దాడులకు తగిన ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరిక జారీ చేసింది. ప్రాదేశిక సమగ్రతను, అఫ్ఘానిస్థాన్ సార్వభౌమాధికారాన్ని పాకిస్థాన్ ఉల్లంఘించి రెండు దేశాలమధ్యా ఉద్రిక్తలను రెచ్చగొడుతోందని పేర్కొంది. పాకిస్థాన్ దౌత్యవేత్తను తమ వద్దకు రప్పించి తీవ్ర నిరసన తెలియజేసింది. ఈ దాడుల్లో అనేకమంది మహిళలు, పిల్లలు మరణించారని అఫ్ఘానిస్థాన్ ప్రభుత్వం ప్రకటించింది. ఐతే పాకిస్థాన్ ఒక ప్రకటన చేస్తూ సరిహద్దుల్లో ఏడు ఉగ్రవాద రహస్య స్థావరాలను ధ్వంసం చేసినట్లు పేర్కొంది. శనివారం ఖైబర్ పఖ్తూంక్వా రాష్ట్రంలోని బన్ను ప్రాంతంలో ఆత్మాహుతిదాడిలో ఒక సైనికుడు మరణించినట్లు పాకిస్థాన్ పేర్కొంది. గత ఏడాది అక్టోబరులో రెండు దేశాలమధ్యా సరిహద్దుల్లో స్వల్పయుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో 23మంది పాకిస్థాన్ సైనికులు మరణించారు. 200 మంది అఫ్ఘానిస్థాన్ తాలిబన్ సైనికులు మరణించారు. ఉగ్రవాదాన్ని అదుపు చేయడంలో అఫ్ఘానిస్థాన్ ప్రభుత్వం విఫలంకావడంతో రెండు దేశాలమధ్యా సంబంధాలు రోజురోజుకూ క్షీణిస్తున్నాయి.

ఉగ్రవాదులను లక్ష్యంగా చేసుకుని ఆదివారం తెల్లవారకముందే పాకిస్థాన్ సైన్యం గగనతల దాడులు చేసింది. దీంతో సహాయబృందాలు రంగంలోకి దిగి శిథిలాలను వెలికితీసే ప్రయత్నాలు చేస్తున్నారు. శిథిల్లాల్లో ఎవరైనా సజీవంగా ఉండి ఉంటారని వెదకుతున్నారు. ఇస్లామాబాద్‌లోని షియా మసీదుపై ఇటీవల ఉగ్రవాదులు ప్రాణాంతకమైన ఆత్మాహుతి బాంబుదాలకు పాల్పడ్డారు. ఈ దాడుల్లో 33మంది మరణించారు. ఐఎస్ఐఎస్ అనుబంధ ఐఎస్‌కెపి (ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఖొరాసన్ ప్రావిన్స్) ఒక ప్రకటన చేస్తూ ఈ దాడికి తామే బాధ్యులమని పేర్కొంది. ఈ సంస్థను ఫిత్నా–అల్–ఖవారిజ్‌గా పిలుస్తారు. ఆ తర్వాత వరుస ఆత్మాహుతి బాంబుదాడులు కొనసాగాయి. దీంతో ఖైబర్ ఫఖ్తూంఖ్వా సరిహద్దుల్లో పాకిస్థాన్ సైన్యం భారీ ఆపరేషన్ నిర్వహించి 200మంది పైగా ఉగ్రవాదులను హతమార్చింది. ఈ ఉగ్రవాదులంతా తెహ్రిక్–ఏ–తాలిబన్ పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థకు చెందినవారని, వీరిని భారతదేశం పెంచిపోషిస్తోందని పాకిస్థాన్ ఆరోపణ చేస్తోంది. వీరంతా అఫ్ఘానిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్నారన్నది పాకిస్థాన్ సైన్యం సందేహం. దీంతో సరిహద్దుల్లో ఉన్న ఉగ్రవాద శిబిరాలు, రహస్య స్థావరాలను ధ్వంసం చేసేందుకు ఆదివారం పాకిస్థాన్ సైన్యం గగనతల దాడులు పూర్తిచేసింది.



## ఇరాన్‌లో మళ్లీ నిరసన ప్రదర్శనలు

### ఇద్దరు సైకియాట్రిస్టులు అరెస్టు

**టెహ్రాన్:** ఇరాన్‌లో ప్రజాఉద్యమాన్ని అణచివేసిన నెలరోజులకు ఆ దేశంలోని విశ్వవిద్యాలయాలలో విద్యార్థులు తిరిగి ఆందోళన ప్రారంభించారు. శనివారం మొదలైన ఆందోళనలు ఆదివారం రెండో రోజు కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా మొదటిరోజు ప్రభుత్వ అనుకూల ప్రదర్శకులకు, ప్రభుత్వ వ్యతిరేక విద్యార్థులకు మధ్య ఘర్షణలు జరిగాయి. విద్యార్థులు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ పలు విశ్వవిద్యాలయాల్లో ప్రదర్శనలు జరిపారు. బెహ్నామ్ ఒహదీ, మహ్మద్ షారీ అనే టెహ్రాన్ నివాసితులు, మనస్తత్వశాస్త్రవేత్తలను ఇరాన్ పోలీసులు అరెస్టు చేసి అక్రమంగా జైలుకు తరలించారు. ఇటీవల నిరసనల అణచివేతవల్ల మరణించినవారికి టెహ్రాన్‌లోని బెహెష్ట్ జహ్రా శ్మశానవాటికలో 40వ రోజు సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరై వెళుతుండగా ఆ ఇద్దరినీ పోలీసులు అరెస్టు చేసి టెహ్రాన్ జైలుకు తరలించారు. వాస్తవానికి శనివారం ఉదయం టెహ్రాన్‌లోని షరీఫ్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీలో విద్యార్థుల నిరసన ప్రదర్శనలు ప్రారంభమైనట్లు పాశ్చాత్య మీడియా తెలియజేసింది. కాగా టెహ్రాన్‌లోనే మరో టెక్నలాజికల్ యూనివర్సిటీలోనే విద్యార్థులు గేటు వద్ద బైఠాయించి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో నిరసన ప్రదర్శన జరిపారు. జనవరిలో ప్రభుత్వ అణచివేత చర్యల్లో మరణించిన వేలాదిమంది ప్రదర్శకులకు వారు నివాళులు అర్పించారు.

ఇరాన్‌పై పరిమితస్థాయిలో ఇజ్రాయెల్ ద్వారా దాడులు చేసేందుకు అమెరికా యుద్ధ సన్నాహాలు,బెదిరింపులు చేస్తున్న తరుణంలో మళ్లీ విశ్వవిద్యాలయాల్లో ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. ఇరాన్ అణ్వాయుధాలు తయారుచేసేదిశగా ప్రయత్నాలు ముమ్మరం చేస్తోందని అమెరికా,యూరప్ దేశాలు సందేహిస్తున్న తరుణంలో ట్రంప్ ఒత్తిడితో రెండో విడత చర్చలు కూడా అమెరికా–ఇరాన్ మధ్య జరిగాయి. కానీ ఈ చర్చల్లో ప్రతిష్ఠంభన నెలకొనడంతో మళ్లీ ఉద్రిక్తలు కొనసాగుతున్నాయి.

**ఎన్ని సమస్యలు సృష్టించినా అమెరికాకు తల వంచం:పెజెష్కియన్**

ఒత్తిడి చేసినంతమాత్రాన భయపడి అమెరికాకు తల ఒగ్గే ప్రశ్నే తలెత్తబోదని ఇరాన్ దేశాధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ అన్నారు. అణ్వాయుధాలను తయారుచేసే ఉద్దేశం తమ దేశానికి లేదని, వారు తమ దేశానికి ఎన్ని సమస్యలు సృష్టించినాగానీ అగ్రదేశానికి తలవొగ్గే ప్రసక్తే లేదని అన్నారు. ఒకవేళ ఇరాన్‌పై అమెరికా దాడిచేస్తే ఎదురు దాడులు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వ టీవీలో ఆయన ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు.

## ఫ్రాన్స్‌లో వేలాదిమంది మితవాదుల ప్రదర్శన




**లియోన్:** దక్షిణ ఫ్రాన్స్ నగరం లియోన్‌లో జాతీయవాద యువకుడు మరణించిన ఘటనను వ్యతిరేకిస్తూ వేలాదిమంది నిరసన ప్రదర్శన జరిపారు. ఈనెలారంభంలో క్వెంటిన్ డెరాంక్ (23) అనే యువకుడు దాడుల్లో మరణించారు. ఈ ఘటనపై న్యాయం చేయాలని, అతడి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ మితవాదులు భారీ ప్రదర్శన చేశారు. ఐతే ఇప్పటికే ఈ కేసులో ఏడుగురిని అరెస్టు చేశారు. లియాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పొలిటికల్ స్టడీస్‌లో ఫిబ్రవరి 12వ తేదీన మితవాద విద్యార్థులు, అతివాద విద్యార్థుల మధ్య వివాదం చినుకు చినుకు గాలివానగా మారి ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో మితవాద యువకుడు డెరాంక్ తలకు గాయమై మరణించాడు. ఐతే అందరూ ప్రశాంతంగా ఉండాలని అధ్యక్షుడు మేక్రాన్ విజ్ఞప్తి చేశారు. 2027లో ఫ్రాన్స్‌లో అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల తరుణంలో మితవాదులకు, అతివాదులకు మధ్య ఘర్షణలు తిరిగి ప్రారంభమయ్యాయి.

## వెనిజులాలో 1,557 మంది ఖైదీల విడుదలకు రంగం సిద్ధం



**కారకస్:** వెనిజులాలో 1,557 మంది రాజకీయ ఖైదీల విడుదలకు రంగం సిద్ధమైంది. ఖైదీలను విడుదల చేసేందుకు అమ్నెస్టీ బిల్లును వెనిజులా చట్టసభలో ప్రవేశపెట్టారు. ఈ వారంలోనే ఈ బిల్లు చట్టరూపం దాల్చనున్నది. దీనివల్ల ప్రతిపక్షాలకు చెందిన రాజకీయ నాయకులు జైళ్ళనుండి విడుదలవుతారు. నికొలస్ మదురో అధ్యక్షుడుగా ఉండగా ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలదరూ జైలుకు వెళ్ళారు. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ జోక్యంతో ఆ దేశ తాత్కాలిక ప్రధానమంత్రి డెల్సీ రోడ్రిగ్జ్‌పై ట్రంప్ ప్రభుత్వం తీవ్ర ఒత్తిడి చేస్తున్నది. ఈ బిల్లు ఆమోదం పొందగానే రాజకీయ ఖైదీలు విడుదలవుతారు. అనేకమంది హక్కుల నాయకులు,జర్నలిస్టులు, ప్రతిపక్ష నాయకులు జైళ్లల్లో ఉన్నారని అమెరికా చెబుతున్నది. ఈరోజు వరకూ 1152 మంది కొత్తగా జైలు నుండి విడుదల చేయాలని కోరుతూ దరఖాస్తులు చేసుకున్నారని ప్రభుత్వ అధికారులు చెప్పారు. దీంతో మొత్తం ఇప్పటి వరకూ జైలు నుండి విడుదల కోరుతూ దరఖాస్తులు చేసుకున్నవారి సంఖ్య 1,557కు చేరింది.

## పోరాడితేనే హక్కులు

(మొదటి పేజీ తరువాయి)

దారుల్లో యువతను ఏదో రకంగా ప్రలోభపెట్టి వారి శ్రమను దోపిడీ చేస్తున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తాను ఎంఎల్‌ఏగా ఉన్న సమయంలో అసెంబ్లీలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్‌లను పర్మినెంట్ చేస్తామని హామీలు గుప్పించారు కాదా? అని అధికార ప్రభుత్వాన్ని ప్రశ్నించినప్పుడు, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసేందుకు వీలు పడదనీ సున్నితంగా తిరస్కరించారని గుర్తు చేశారు. సిఆర్‌పిలు విడివిడిగా పోరాడితే ఫలితం ఉండదనీ, ఒక సంఘంలా ఏర్పడి హామీలను నేరవేర్చుకోవాలని సూచించారు. సిఆర్‌పిల హక్కుల సాధనకై సిపిఐ తరపున అసెంబ్లీలో చర్చను లేవనెత్తుతామని చాడ వెంకట్‌రెడ్డి వారికి హామీ ఇచ్చారు. ఎఐటియుసి రాష్ట్ర జనరల్ సెక్రటరీ యస్.బాల్‌రాజ్ మాట్లాడుతూ సిఆర్‌పిల హక్కుల సాధనకై ఎఐటియుసి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పోరాటాలు, ఉద్యమాలు చేయకుండా సమస్యలు పరిష్కారం కావనే విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. ఉద్యోగ భద్రత కల్పించకుండా, కేవలం రూ.19,500 వేతనంతో ప్రభుత్వం సిఆర్‌పిల శ్రమను దోపిడీ చేస్తుందని ఆరోపించారు. ఎఐటియుసి 1920లో భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందు ఏర్పాటైన సంస్థ అని, అప్పటి నుంచి ఇప్పటి వరకు కార్మికుల హక్కులకై నిరంతరం ఉద్యమిస్తుందని కొనియాడారు. సిఆర్‌పి యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పాద్య నాగేశ్వరరావు మాట్లాడుతూ కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్(సిఆర్‌పి) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాజీవ్ విద్యా మిషన్‌లో భాగముగా(ఇప్పుడు సమగ్రశిక్ష) 2012వ సంవత్సరంలో డిఎస్సి తరహాలో రోస్టర్ కం రిజర్వేషన్ మెరిట్ ప్రకారం ఇంటర్వ్యూ ద్వారా తమని ఎంపిక చేశారన్నారు. చాలిచాలని జీతాలతో గత 13 సంవత్సరాల నుంచి కాంప్లెక్స్ పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తూ, హ్యాబిటేషన్ పరిధిలో బడి బయట పిల్లలను గుర్తిస్తూ, వారి తల్లిదండ్రులతో మాట్లాడుతూ మళ్లీ పాఠశాలలో చేర్పించి, వారి విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. కాబట్టి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు సిఆర్‌పిలను ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటించి, కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఆరోగ్య భీమా కింద రూ. 25 లక్షలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న పాఠశాలలో ఉపాధ్యాయ నియామకాలలో సిఆర్‌పిలకు 30శాతం వెయిటేజీని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రం నుంచి వివిధ జిల్లాలలో పనిచేస్తున్న సిఆర్‌పి టీచర్లు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## అజీజ్ పాషా

(మొదటి పేజీ తరువాయి)

ఇస్కఫ్ జాతీయ 24వ మహాసభల్లో 81 మందితో నూతన జాతీయ కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో తెలంగాణ రాష్ట్రం నుంచి పి.వి దుర్గాప్రసాద్ ఉపాధ్యక్షులుగా, ఆర్.గోపాల్ కార్యదర్శిగా, ప్రొఫెసర్ సారంగపాణి, అవ్వ విజయలక్ష్మి జాతీయ కార్యవర్గ సభ్యులుగా, మద్దినేని రమేష్ బాబు, కొండపర్తి శ్రీనివాసులు జాతీయ సమితి సభ్యులుగా ఎన్నికయ్యారు.

## ఓట్లు తొలగింపు

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం ఓటర్ల సంఖ్య 21.45 కోట్లకు పైగా ఉంది. అయితే ఈ వారం తుది ఓటర్ల జాబితా ప్రచురించబడిన తర్వాత ఆ సంఖ్య 19.75 కోట్లకు తగ్గింది. నికరంగా 1.70 కోట్లను తొలగించారు. ఇప్పటికే సర్ బిహార్‌లో పూర్తయింది. ప్రస్తుతం ప్రస్తుతం ఇది 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో దాదాపు 60 కోట్ల మంది ఓటర్లను కవర్ చేస్తోంది. ఇంకా 40 కోట్ల మంది ఓటర్లు 17 రాష్ట్రాలు, ఐదు కేంద్రపాలిత ప్రాంతాల్లో చేపట్ట వలసి ఉంది. అసోంలో సర్‌కు బదులుగా 'ప్రత్యేక సవరణ' ఈనెల 10న పూర్తయింది. వివిధ కారణాల వల్ల, తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాలలో సర్ షెడ్యూల్‌లలో తరచుగా మార్పులు చేయబడ్డాయి. బిహార్‌లో మాదిరిగానే, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో రాజకీయ పార్టీలు ఈ విధానాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి.

## రెండు, మూడేళ్లలో ప్రాజెక్టులన్నీ పూర్తి




(మొదటి పేజీ తరువాయి)

జాప్యం వలన ప్రాజెక్టు పనులు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రామప్ప చెరువు నుండి జంపన్న వాగుకు నీరు అందించే ప్రణాళికపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

**నీళ్ల విషయంలో రాజకీయాలొద్దు**

మేడిగడ్డ కుంగిన తర్వాత అక్కడి నుంచి నీరు ఎత్తిపోయలేదని రేవంత్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం నిరుపయోగమైనా అత్యధికంగా వరి దిగుబడి వస్తోందని వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో, తర్వాత తెలంగాణలో ఏం జరిగిందో చర్చించామని చెప్పారు. కెసిఆర్, హరీశ్‌రావు తప్పులు చేశారని ప్రజలు గ్రహించారని, తీర్పు ఇచ్చారని రేవంత్ రెడ్డి వివరించారు. పదేళ్లు వాళ్లేం చేశారో ఈ ప్రభుత్వం ఏ చేసిందో సభలో చర్చిస్తామన్నారు. ప్రతిపక్షం వారు సూచనలు చేస్తే మేం స్వీకరిస్తామన్న రేవంత్ రెడ్డి... జలాల విషయంలో ఎపికి సహకరిస్తున్నామనేది పూర్తిగా అసంబద్ధమని తెలిపారు. ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలు చేద్దామని ప్రజలు, నీళ్ల విషయంలో కాదని ఆయన హితవు పలికారు. పలు ఎన్నికల్లో తీర్పు చూసిన తర్వాతైనా బిఆర్ఎస్ నేతలు మారకపోవటం విచారకరమన్నారు. ఆ పార్టీని మళ్లీ గెలిపించకపోవడం ప్రజల తప్పనట్లుగా వారు వ్యవహరిస్తున్నారన్నారు. ఓటు వేసిన ప్రజలను బహిష్కరించినట్లు చేయటం సరికాదని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రజలను తప్పుపట్టడం మానేసి విజ్ఞతగా వ్యవహరించాలని హితవు పలికారు. 'గోదావరి నదీ జలాలలకు సంబంధించిన ప్రాజెక్టులను మనం ఈ పదేళ్లలో పూర్తి చేసుకుని 967 టిఎంసిలను వినియోగంలోకి తెచ్చుకుని ఉంటే ఈనాడు వరద జాలల విషయంలో కూడా వాటాలు అడిగే పరిస్థితి ఉండేది. కాళేశ్వరం ప్రాజెక్టుకే అధిక నిధులు కేటాయించడం వల్ల మిగిలిన వాటికి నిధులు ఇవ్వడానికి వెతుక్కునే పరిస్థితి వచ్చింది. రాబోవు రెండేళ్లలో ఈ ప్రాజెక్టులన్నింటిని పూర్తి చేయాలని చిత్తశుద్ధితో ఇక్కడకు వచ్చాం. అన్ని ప్రాజెక్టులపై పూర్తిస్థాయిలో సమీక్ష చేసి పూర్తిచేసేందుకు ప్రయత్నిస్తాం' అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**ఎపితో సమస్యను సామరస్యంగా పరిష్కరించుకుంటాం**

సిఎం కుర్చీ అనేది ప్రతిసారి వారసత్వంగా దక్కదని రేవంత్ రెడ్డి అన్నారు. టిడిపి, కాంగ్రెస్, బిఆర్ఎస్‌కు వరుసగా రెండుసార్లు చొప్పున ప్రజలు అవకాశం ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా ప్రజలు మరో అవకాశం ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టులను గాలికి వదిలేయమని పేర్కొన్నారు. ప్రజల సొమ్ముతో కట్టిన ప్రాజెక్టులను వృథాగా వదిలేసేది లేదని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. నిపుణుల సూచన ప్రకారం మరమ్మతులు చేసి వినియోగంలోకి తెస్తామని వెల్లడించారు. విపక్షం అసెంబ్లీకి వచ్చి గోదావరి జలాలపై సూచనలు చేస్తే స్వీకరిస్తామని చెప్పారు. ఎపితో సమస్యను సామరస్యంగా పరిష్కరించుకునే దిశలో ఉన్నామని వెల్లడించారు.

**సిఎంకు మంత్రుల స్వాగతం**

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాలకుగూడెం సమీపంలోని సమ్మక్క సాగర్ ప్రాజెక్టు వద్దకు ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హెలిక్యాప్టర్ ద్వారా చేరుకున్నారు. రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర రెవె న్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మం త్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, గండ్ర సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్‌పి సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఎ పిఓ చిత్ర మిశ్రా తదితరులు పుష్పగుచ్చాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి, మంత్రులు, ఉన్నతాధికారులు కలిసి దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు లిఫ్టింగ్ పాయింట్‌ను సందర్శించి ప్రగతిపై సమీక్ష నిర్వహించారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హార్వర్డ్ యూనివర్సిటీ ఆహ్వానం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అమెరికాలోని హార్వర్డ్ కెన్నెడీ స్కూ ల్ అరుదైన ఆహ్వానం అందింది. హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ తొలిసారిగా నిర్వహిస్తున్న 'ఏఐ పాలసీ సింపోజియం'లో ప్రసంగించేందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ఆహ్వానిస్తూ హార్వర్డ్ కెన్నెడీ నిర్వాహకులు ఆహ్వాన లేఖను పంపించారు. భారతదేశం నుంచి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కరినే సింపోజియం ఆహ్వానించడం విశేషం. ఈ ఏడాది మార్చి 27న హార్వర్డ్ స్కూల్ క్యాంపస్‌లో 'ఎఐ పాలసీ సింపోజియం' కార్యక్రమం జరుగనుంది. ఈ సింపోజియంలో 'మౌలిక వసతులుగా మారుతున్న కృతిమ మేదస్సు జీవన ప్రమాణాలు, ఉపాధిపై ప్రభావం' అనే ప్యానల్‌లో ప్రసంగించేందుకు సిఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. ఈ సెషన్‌లో డేటా సెంటర్లు, ఎనర్జీ సిస్టమ్స్, కంప్యూట్ కారిడార్స్ ప్రభావంపై ప్రధానంగా చర్చ జరగనుంది. ఎఐ ఎకో సిస్టమ్ అభివృద్ధి, ఎఐ సిటీ అభివృద్ధి లక్ష్యంతో తెలంగాణరాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, భూమి, విద్యుత్, నైపుణ్యాలు, నియంత్రణ, పెట్టుబడుల భాగస్వామ్యం వంటి అంశాలపై ప్రసంగించేందుకు సిఎంను ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఇటీవల అమెరికా పర్యటనలో భాగంగా హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ నిర్వాహకులు సిఎం రేవంత్ రెడ్డిని ప్రత్యేకంగా కలిసి సింపోజియం అంశంపైన చర్చించారు. ప్రభుత్వం, పరిశ్రమ, అకాడమీ, ఆయా రంగాల ప్రముఖులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి, ఎఐ పాలన, జియోపాలిటిక్స్, నాలెడ్జ్ ఎకానమీ, ఎనెబ్లింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అంశాలపైన చర్చించేందుకు సింపోజియం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఉగ్రకుట్ర భగ్నం

(మొదటి పేజీ తరువాయి)

అంశాలు ఉండటంతో భద్రతా సంస్థలు అప్రమత్తమయ్యాయి. ఆ పోస్టర్ల గురించి తెలుసుకునేందుకు దర్యాప్తు చేపట్టిన స్పెషల్ సెల్ తమిళనాడులో కార్యకలాపాలు సాగిస్తున్న ఈ నెట్‌వర్క్‌ను గుర్తించారు. ఆరుగురు వ్యక్తులు తిరుప్పూర్‌లోని వస్త్ర కర్మాగారాల్లో పని చేస్తున్నారని, నకిలీ ఆధార్ కార్డును కలిగి ఉన్నారని దర్యాప్తు అధికారులు కనుగొన్నారు. తిరుప్పూర్‌కు చేరిన స్పెషల్ సెల్, స్థానిక పోలీసుల సాయంతో ఆరుగురిని ఆరెస్ట్ చేశారు.

**బెంగాల్‌లోనూ మరో ఇద్దరు అరెస్ట్**

తిరుప్పూర్‌లోని ఉతుకులి నుంచి ఇద్దరు, పల్లడం నుంచి ముగ్గురు, తిరుమురుగన్‌పూండి ప్రాంతం నుంచి ఒకరు అరెస్టయ్యారు. వారు మిజానుర్ రెహమాన్, మహ్మద్ షబత్, ఉమర్, మహ్మద్ లితాన్, మహ్మద్ షాహిద్, మహ్మద్ ఉజ్జల్‌గా గుర్తించారు. అలాగే బంగాల్ నుంచి మరో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. అరెస్టయిన వారిలో కొందరు బంగ్లాదేశ్ పౌరులని, వారు తమ అసలు గుర్తింపును దాచేందుకు నకిలీ ఆధార్ కార్డులు వినియోగించినట్లు పోలీసులు తెలిపారు. అరెస్టైన వారిని తదుపరి విచారణ, చట్టపరమైన చర్యల కోసం రైలులో ఢిల్లీకి తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డుల స్వాధీనం**

విదేశీ హ్యాండ్లర్ల ఆదేశాల మేరకు భారత్‌లో పెద్ద ఎత్తున ఉగ్రదాడి చేయాలని వీరు ప్రణాళిక రచించినట్లు దర్యాప్తు అధికారులు తెలిపారు. వారితో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు చెప్పారు. ఇక ఆపరేషన్ సమయంలో ఎనిమిది మొబైల్ ఫోన్లు, 16 సిమ్ కార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డిజిటల్ ఆధారాలు, ఇతర వ్యక్తులతో ఉన్న సంబంధాలపై దర్యాప్తు కొనసాగుతోంది. బంగ్లాదేశ్‌కు చెందిన తంజీమ్ సంస్థలతో వీరి సంబంధాలపై మరింత విచారణ చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ఉగ్రముఠాతో సంబంధం ఉన్న మరికొందరి కోసం గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

**ఎఐ సమ్మిట్ సందర్భంగా కశ్మీర్ పోస్టర్లు**

ఈ ఎనిమిది మంది సోషల్ మీడియా ద్వారా పరస్పరం సంప్రదింపులు కొనసాగించిటన్లు పోలీసులు తెలిపారు. పాకిస్థాన్‌కు చెందిన ఉగ్ర సంస్థలకు మద్దతుగా పోస్టులు పెట్టినట్లు గుర్తించినట్లు చెప్పారు. ఈ ఎనిమిది మందిలో నలుగురు ఇటీవల జరిగిన ఎఐ సమ్మిట్ సందర్భంగా ఢిల్లీకి వచ్చి 'ఫ్రీ కశ్మీర్' వంటి ప్రేరేపణాత్మక పోస్టర్లు మెట్రోస్టేషన్‌లో అతికించినట్లు పోలీసుల తెలిపారు. ఆ తర్వాత తిరిగి తమిళనాడు, బంగాల్‌కు వెళ్లినట్లు వెల్లడించారు.

**ఉగ్రముప్పు హెచ్చరికతో ఢిల్లీలో హైఅలర్ట్**

దేశ రాజధాని ఢిల్లీలో ఉగ్ర దాడులు జరిగే అవకాశముందని నిఘా వర్గాలు హెచ్చరించడంతో శనివారం ఢిల్లీ హైఅలర్ట్ ప్రకటించారు. ఢిల్లీలోని ఎర్రకోట, చాందినీ చౌక్, ప్రముఖ ఆధ్యాత్మిక ప్రదేశాలను లక్ష్యంగా చేసుకుని దాడులకు కుట్ర పన్నినట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. అందుకోసం భార మొత్తంలో పేలుడు పదార్థాలను వినియోగించే అవకాశముందని తెలిపాయి. దీంతో అప్రమత్తమైన భద్రతా సంస్థలు ఢిల్లీలో హైఅలర్ట్ ప్రకటించి, బాంబ్ స్క్వాడ్‌తో బృందాలు రంగంలోకి దిగాయి. దేవాలయాలు, రద్దీగా ఉండే ప్రదేశాల్లో అదనపు సిబ్బందిని మోహరించాయి. ఫిబ్రవరి 6న పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో మసీదు పేలుడు ఘటనకు ప్రతీకారంగా భారత్‌లో భారీ ఉగ్రదాడి చేయాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం.

## మెడికో ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)

స్నేహితులకు చెప్పినట్లు సమాచారం. స్నేహితులు టిఫిన్ చేసి గదికి వచ్చి చూసేసరికి శ్రీజ ఫ్యా నుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. విద్యార్థులు ఈ విషయాన్ని కళాశాల యాజమాన్యానికి తెలుపగా వారు బంధువులకు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మధ్య కాలంలో ఇంస్టాగ్రామ్‌లో శ్రీధర్ అనే యువకుడితో పరిచయం పెంచుకోవటంతో సంబధిత యువకుడు శ్రీధర్ పెళ్లి చేసుకోవాలని విద్యార్థినీపై వత్తిడి తెచ్చారన్నారు. అలాగే గత మూడు రోజుల క్రితం పెద్దపల్లికి చెందిన శ్రీధర్ మృతురాలి మామకు ఫోన్ చేసి మీ కోడలును ప్రేమిస్తున్నారు. కాని ఆమే ఎవరితో మాట్లాడుతుందని, తాను పెళ్లి చేసుకుంటానని చెప్పినట్ల సమాచారం. దీంతో మా కోడలు ఏలా పరిచయం అయిందని నాకు ఇంస్ట్రాగ్రామ్‌లో పరిచయం అయిందని, పెళ్లి చేసుకుంటానని చెప్పారన్నారు. మృతురాలి మేనమేమ సిద్దిపేట త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ లక్ష్మి బాబు తెలిపారు.

## లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి)

రూపకల్పన,ఆయుధ దళాల నిర్వహణవసూళ్లు, బెదిరింపులు కేసులు ఉన్నాయి. వీరి లొంగుబాటుకు ప్రధాన కారణాలు భద్రతా దళాల నుంచి పెరుగుతున్న ఒత్తిడి,అడవుల్లో కఠిన నిఘా,సరఫరా మార్గాల మూసివేత,క్యాడర్‌లో అంతర్గత విభేదాలు అని అనుమానిస్తున్నారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం అంబేద్కర్‌నగర్‌కు చెందిన వెంకటనర్సయ్య కుమారుడు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ (58) మే 2025లో మరణించిన మావోయిస్టు ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు (బసవరాజు) తర్వాత కీలక నాయకత్వాన్ని చేపట్టినట్లు సమాచారం. ఆయన పీపుల్స్ లిబరేషన్ గురిల్లా ఆర్మీ (పిఎల్‌జిఎ) ఏర్పాటులో కీలక పాత్ర పోషించి, పార్టీ కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యుడిగా పనిచేశారు. ప్రస్తుతం కేంద్ర సైనిక కమిషన్ ఇన్‌చార్జ్‌గా ఉండి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని అడవుల్లో కార్యకలాపాలు నిర్వహించినట్లు తెలిసింది. పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఇగ్లాస్‌పూర్‌కు గ్రామానికి చెందిన మల్లా రాజి రెడ్డి అలియాస్ సంగ్రామ్ (71) కూడా విద్యార్థ దశ నుంచే మావోయిస్టు పార్టీ వైపు ఆకర్షితులై అజ్ఞాతంలోకి వెళ్లారు.

**విద్యార్థి దశలోనే ఉద్యమం వైపు**

కొరుట్ల లో ఇంటర్ చదువుతున్న సమయంలోనే దేవ్‌జీ ర్యాడికల్ స్టూడెంట్ యూనియన్ ప్రభావంతో ఉద్యమం వైపు మళ్లారు. అనంతరం 1983లో పీపుల్స్ వార్ గ్రూప్‌లో చేరి అండర్‌గ్రౌండ్‌కు వెళ్లారు. గడ్చిరోలిలో దళ సభ్యుడిగా పనిచేసి తర్వాత కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎదిగారు.

**డిజిపి పిలుపు మేరకే..**

తెలంగాణ డిజిపి బి.శివధర్ రెడ్డి ఇటీవల అండర్ గ్రౌండ్‌లో ఉన్న మావోయిస్టులు ఆయుధాలు వదిలి ప్రధాన ప్రవాహంలోకి రావాలని పిలుపునిచ్చారు. లొంగిన వారికి ప్రభుత్వ పునరావాస పథకం కింద సాయం అందిస్తామని తెలిపారు. గత రెండేళ్లలో 588 మంది మావోయిస్టులు సాధారణ జీవితంలోకి వచ్చారని పేర్కొన్నారు.

**కుటుంబంలో ఆనందం**

దశాబ్దాల తర్వాత దేవ్జీని చూసే అవకాశం వస్తోందని ఆయన సోదరుడు తిప్పిరి గంగాధర్ తెలిపారు. ఇంటి నుంచి వెళ్లిన తర్వాత మీడియా ఫోటోలు తప్ప కుటుంబానికి ఆయనతో ఎలాంటి సంబంధం లేకపోయిందన్నారు. దేవ్‌జీ భార్య మరణించగా, సోదరి ప్రస్తుతం హైదరాబాద్‌లో నివసిస్తున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. దేవ్‌జీ లొంగుబాటు మావోయిస్టు ఉద్యమానికి కీలక మలుపు కావచ్చని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి.

# ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవాలి

ప్రముఖ విద్యారంగ, సామాజిక విశ్లేషకుడు ప్రొఫెసర్ కాశీం





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవల్సిన బాధ్యత మనందరిపైనా ఉన్నదని ప్రముఖ విద్యారంగ, సామాజిక విశ్లేషకులు ప్రొఫెసర్ కాశీం అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే ఆలోచనను విరమించుకోవాలని, విద్యా విధానంలో సమూల మార్పులు తీసుకురావాలని కోరారు. 'స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (ఎస్‌టియు టిఎస్) ఆధ్వర్యంలో హైదరాబాద్, కాచిగూడలోని సంఘం భవనంలో రాష్ట్ర అధ్యక్షులు సదానందంగౌడ్ అధ్యక్షతన ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర ద్వితీయ కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యా సదస్సుకు ముఖ్యవక్తగా ప్రొఫెసర్ కాశీం, ముఖ్య అతిథిగా సిపిఐ సీనియర్ నాయకుడు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి హాజరయ్యారు. ప్రొఫెసర్ కాశీ మాట్లాడుతూ ఎస్‌టియు సంఘం స్వాతంత్ర్యానికి పూర్వం ఏర్పడిన తొలి ఉపాధ్యాయ సంఘం అని గుర్తుచేశారు. ప్రపంచంలో చిన్న చిన్న దేశాలు విద్యారంగంలో పోటీపడుతున్నాయని, తదనుగుణంగా రాష్ట్రంలో విద్యా విధానంలో సమూల మార్పులు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో మానవ వనరులతో పాటు, భౌతిక వనరులను కూడా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించరాదని, పాఠశాలలకు నాన్ టీచింగ్ పోస్టులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థులకు సృజనాత్మకతతో పాటు గుణాత్మక విద్య అందించడంలో ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.

**టెట్ నుంచి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను మినహాయించండి : చాడ వెంకట రెడ్డి**

ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణలో ఎస్‌టియు టిఎస్ బాధ్యతాయుతమైన పాత్రను పోషిస్తుందని, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారంలో ముందంజలో ఉందని అన్నారు. ఉపాధ్యాయులు ఉమ్మడి ఉద్యమాలకు సంసిద్ధం కావాలని ఆయన పిలుపు నిచ్చారు. ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జి. సదానందంగౌడ్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పిఆర్‌సి, డిఎలను సాధించుకునేందుకు త్వరలో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఉపాధ్యాయుల సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించి ఎంఇఒ, డిప్యూటీ ఇఒ, డైట్ లెక్చరర్ పదోన్నతులు కల్పించాలన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని, కెజిబివి, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సి.ఆర్.టి ఉపాధ్యాయులకు మినిమం టైమ్ స్కేల్‌ను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్, ఆర్థిక కార్యదర్శి సయ్యద్ సాబేర్ అలీ, సంఘ అధికార మాస పత్రిక ఎడిటర్ ప్రసాద్, సబ్ ఎడిటర్ శంకర్ మాతంగి,హెడ్ సెక్రెటరీ కరుణాకర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు ఎ.వి.సుధాకర్, శ్రీనివాసరెడ్డి, పోల్‌రెడ్డి, రవీంద్ర, రాధా జయలక్ష్మి ,శీతల్ చౌహాన్, నీరజ , శిరీష, అజర్ జహా, 33 జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, సంఘ కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెన్నం సోదరులను పరామర్శించిన సిఎం రేవంత్ రెడ్డి



వెన్నం రాఘవేందర్ రెడ్డి మృతి పట్ల సంతాపం

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెడ్యాల గ్రామానికి చెందిన వెన్నం రాఘవేందర్ రెడ్డి కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. ఇటీవల ఈనెల 11న వెన్నం రాఘవేందర్ రెడ్డి మృతి చెందడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి స్వయంగా రెడ్యాల గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులను కలుసుకున్నారు.

రాఘవేందర్ రెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెన్నం సోదరులైన టిపిసిసి రాష్ట్ర మాజీ కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి, బిగ్ టీవి గ్రూప్ ఆఫ్ చైర్మన్ వెన్నం విజయ్‌లను ప్రత్యేకంగా కలిసి ఓదార్చారు. సిఎం పర్యటన సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. గ్రామ ప్రజలు కూడా సిఎం రాకతో పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు.

వెన్నం రాఘవేందర్ రెడ్డి మరణం గ్రామానికి తీరని లోటని పలువురు పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని గ్రామస్థులు ఆకాంక్షించారు. సిఎం రాక తో రెడ్యాల గ్రామం జనసంద్రంగా మారింది. సిఎం వెంట మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కొండ సురేఖ, వేం నరేందర్‌రెడ్డి, ఎంపి బలరాం నాయక్, ఎమ్మెల్యేలు మురళి నాయక్, రామ్ చంద్రు నాయక్, ఎంపి బలరాం నాయక్, పాల్గొన్నారు.

# 'హరీష్‌రావు ఎన్ని అడ్డంకులు సృష్టించినా అభివృద్ధి ఆగదు

ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాజకీయ లబ్ధి కోసంమాజీ మంత్రి హరీష్ రావు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారనిభువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహంవ్యక్తంచేశారు. ఆయనఎన్ని అడ్డంకులు సృష్టించినా, చిల్లర రాజకీయాలు చేసినా అభివృద్ధి ఆగబోదని స్పష్టం చేశారు. 'హరీష్ రావు గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం కమీషన్ల కోసం కక్కుర్తి పడి, నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇవ్వడం వల్లే నేడు సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆరోపించారు. ఆదివారం ఎంపిచామల కిరణ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూమధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్ వాసుల ఏలాంటి అన్యాయం జరగకుండ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు.2012 జిఓ ప్రకారం 30 మీటర్ల బఫర్ జోన్ ఉండాల్సి ఉండగా, కేవలం 9 మీటర్ల బఫర్ చూపించి నాళాపై అపార్ట్‌మెంట్ నిర్మించారని ఆయన గుర్తు చేశారు. గత ప్రభుత్వం చేసిన తప్పుల వల్ల తెలియక ప్రజలు ఇళ్లు కొనుక్కున్నారని, ఇందులో ప్రజల తప్పేమీ లేదని ఆయన స్పష్టం చేశారు.

అపార్ట్‌మెంట్ వాసులకు అన్యాయం జరగనివ్వమని, బాధ్యులైన బిల్డర్లు, అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బిల్డర్ల నుండే బాధితులకు నష్టపరిహారం ఇప్పిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో మూసీ పునరుజ్జీవం, మెట్రో ఫేజ్2, ట్రిపుల్ ఆర్, ఫ్యూచర్ సిటీ నిర్మాణం వంటి భారీ ప్రాజెక్టుల ద్వారా నగరాభివృద్ధికి ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. గాంధీ సరోవర్ కట్టాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదని, కేవలం రాజకీయ లబ్ధి కోసమే హరీష్ రావు అవాస్తవాలు మాట్లాడుతున్నారని కొట్టిపారేశారు.

సబర్మతి, గంగా నదుల ప్రక్షాళన సమయంలోనూ ఆక్రమణలు తొలగించారని, అదే తరహాలో హైదరాబాద్ ప్రక్షాళన జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల పక్షానే ఉంటుందని, బాధితులకు న్యాయం చేస్తూనే నగరాభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.



## కాంగ్రెస్ పార్టీలో బిఆర్‌ఎస్ నాయకులు చేరిక

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బిఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కె.ఎం.గౌరీష్‌తో పాటు పలువురు నేతలు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాల అమలు తనను ఆకర్షించాయని, అందుకే కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ గౌరీష్‌కి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థి ఆత్మహత్యాయత్నంపై విచారణకు మంత్రి ఆదేశం

మంత్రి వాకిటి శ్రీహరి



**హైదరాబాద్/ప్రజాపక్షం :** హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో ఆదివారం విద్యార్థి ఆత్మహత్నం ఘటనపై విచారణ జరపాలని క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి డిజిపి బి.శివధర్‌రెడ్డిని ఆదేశించారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థి ఉమేష్‌ను పరామర్శించేందుకు క్రీడల శాఖ మంత్రి హుటాహుటిన వెల్‌నెస్ హాస్పిటల్‌కు చేరుకున్నారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆస్పత్రిలో అతనికి చికిత్స అందిస్తున్నారు. ఇతర కార్యక్రమాలను రద్దుచేసుకుని ఆస్పత్రికి చేరుకున్న మంత్రి, విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని స్వయంగా డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థికి అత్యుత్తమ వైద్యం అందించాలని వైద్యులకు మంత్రి ఆదేశించారు. విద్యార్థి పూర్తిగా కోలుకునే వరకు ప్రభుత్వమే అన్ని వైద్య ఖర్చులు భరిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. చికిత్స విషయంలో ఎలాంటి లోపం లేకుండా చూడాలని సూచించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డితో మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి దారితీసిన కారణాలను నిష్పక్షపాతంగా వెలికితీయాలని ఆదేశించారు. విద్యార్థి తల్లిదండ్రులను మంత్రి పరామర్శించి ధైర్యం చెప్పారు. మంత్రితో పాటు స్పోర్ట్స్ అథారిటీ ఎండి సోనీ బాలాదేవి, ఇతర అధికారులు ఆస్పత్రిలో ఉన్నారు.



## తెలంగాణ ఆత్మను చాటేలా 'గాడ్స్ ఇన్ ది వాయిస్'

కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ఒగ్గు కథను ప్రపంచానికి చాటేలా తెలంగాణ ఆత్మను ఆవిష్కరించే విధంగా ''గాడ్స్ ఇన్ ది వాయిస్'' డాక్యుమెంటరీ కల్చర్ ఫిల్మ్ రూపొందించారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. డాక్టర్ జి.కుమారస్వామి దర్శకత్వంలో రూపొందుతున్న ''గాడ్స్ ఇన్ ది వాయిస్'' టీజర్‌ను హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆదివారం కవిత ఆవిష్కరించారు. తెలంగాణ ఒగ్గు కథను అద్భుతమైన డాక్యుమెంటరీగా తెరకెక్కిస్తున్న కుమారస్వామితో పాటు మూవీ టీమ్‌ను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, మూవీ యూనిట్ సభ్యులు ప్రొఫెసర్ జోలి పోతుసెర్రి, మేఘా యాదవ్, మహేశ్వర్, జయదేవ్ యాదవ్, సాయి రుద్రకాంత్, తిరుపతి యాదవ్, కవిత యాదవ్, రాజ్ కుమార్, శ్రీణిక, గనికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సిఎం కప్ పోటీలు

యువ క్రీడాకారుల ఉత్సాహానికి వేదికగా రాష్ట్రం

తుది దశకు చేరుకున్న పోటీలు

సోమవారం ముగింపు వేడుకలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండో విడత సిఎం కప్ పోటీలు రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయి. హైదరాబాద్‌తో పాటు మరో 11 జిల్లాల్లో 44 క్రీడాంశాల్లో బాలురు, బాలికల విభాగాల్లో పోటీలు జరుగుతున్నాయి. కొన్ని క్రీడాంశాల్లో పోటీలు ముగిసినప్పటికీ, మరికొన్ని తుది దశకు చేరుకుని రసవత్తరంగా సాగుతున్నాయి.గచ్చిబౌలి స్టేడియంలో హాకీ, వాలీబాల్, ఫుట్‌బాల్, రెజ్లింగ్ పోటీలు జరుగుతుండగా, ఎల్‌బి ఇండోర్ స్టేడియంలో పవర్‌లిఫ్టింగ్ పోటీలు ముగిశాయి. వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఫెన్సింగ్ పలు విభాగాల పోటీలు ఫైనల్స్‌కు చేరుకున్నాయి. హ్యాండ్‌బాల్ క్వార్టర్ పోటీలు పూర్తయ్యాయి. బిలియరడ్స్, స్నూకర్ విభాగాల్లో పోటీలు తుది దశలోకి ప్రవేశించాయి. ఎల్‌బి టెన్నిస్ కాంప్లెక్స్‌లో టెన్నిస్ పోటీలు ఆరంభమయ్యాయి.గచ్చిబౌలి షూటింగ్ రేంజ్‌లో షూటింగ్ పోటీలు కొనసాగుతున్నాయి. హుస్సేన్ సాగర్ వాటర్ స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్‌లో సెయిలింగ్, రోయింగ్ పోటీలు ముగియగా, కాయకింగ్, కనోయింగ్ పోటీలు ప్రారంభమై ఫైనల్స్‌కు చేరుకున్నాయి. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో యోగ, మల్లఖంబ్ పోటీలు ఫైనల్ దశలోకి ప్రవేశించాయి. స్కేటింగ్ పలు విభాగాల పోటీలు కూడా నిర్వహించారు.ఇదే విధంగా మిగతా 11 జిల్లాల్లో నిర్వహిస్తున్న వివిధ క్రీడాంశాల పోటీలు కూడా తుది దశకు చేరుకుని ఉత్కంఠ రేపుతున్నాయి.

**ముగింపు వేడుకలు..** అన్ని పోటీలు ఈనెల 23న ముగియనున్నాయి. ఆయా జిల్లాల్లో ఎక్కడికక్కడ ముగింపు వేడుకలు నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్ పోటీల విజేతలకు ఎల్‌బి ఇండోర్ స్టేడియంలో ప్రత్యేక కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిన జట్టుతో పాటు రెండో, మూడో స్థానాల్లో నిలిచిన జట్లకు ట్రోఫీలు అందజేయనున్నారు. రాష్ట్రంలో గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసే వేదికగా సిఎం కప్ నిలుస్తోందని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.




## ఎన్‌ఎస్‌జిపై తెలంగాణ పోలీసు జట్టు ఘన విజయం

124 పరుగుల తేడాతో గెలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అఖిల భారత పోలీసు సౌత్ జోన్ టీ–20 క్రికెట్ టోర్నమెంట్ లో భాగంగా మూడవ రోజున మూలపాడు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ మైదానంలో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో తెలంగాణ పోలీసు జట్టు, నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ (ఎన్‌ఎస్‌జి) పై 124 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన తెలంగాణ పోలీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 259/2 భారీ స్కోర్ సాదించింది. తెలంగాణ పోలీసు జట్టులోని లోకనాథ్ నాయక్ 58 బంతుల్లో 119 పరుగులు చేసి అద్భుత శతకం సాధించాడు. ప్రత్యర్థి బౌలర్లపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడి బౌండరీలు, సిక్సర్ల వర్షం కురిపించి జట్టుకు భారీ స్కోరు సాధించడంలో తోడ్పాటు అందించాడు. ఆయన ప్రదర్శన మ్యాచ్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. చేదనలో ఎన్‌ఎస్‌జీ జట్టు లక్ష్యాన్ని ఛేదించడంలో విఫలమై 18.3 ఓవర్లలో 135 పరుగులకే ఆలౌట్ అయింది. తెలంగాణ బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్ తో ప్రత్యర్థి జట్టుపై పూర్తి ఆధిపత్యం చెలాయించారు. అత్యుత్తమ బ్యాటింగ్ ప్రతిభ కనబరచిన లోకనాథ్ నాయక్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు ప్రదానం చేయబడింది.ఈ మ్యాచ్‌లో తెలంగాణ రాష్ట్ర హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సి.వి. ఆనంద్ బ్యాటింగ్ లో రాణించి 40 పరుగులు సాధించి ప్రత్యర్థి జట్టు ముందు భారీ లక్ష్యాన్ని ఉంచడంలో తనదైన పాత్ర పోషించారు. కళాత్మకమైన స్ట్రెయిట్ డ్రైవులు, హుక్ మరియు పుల్ షాట్లతో అలరించారు. అనంతరం జరిగిన పోస్ట్ మ్యాచ్ ప్రెజెంటేషన్ కార్యక్రమానికి హాజరై విజేతలను సి.వి. ఆనంద్ అభినందించారు. మ్యాచ్ అనంతరం జరిగిన బహుమతి ప్రధాన కార్యక్రమంలో ఇరు జట్లలోని మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌లకు తెలంగాణ రాష్ట్ర హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సివి ఆనంద్, ఎపి స్పోర్ట్స్ డిఐజి అన్బురాజన్ మెమోంటోలు అందచేశారు.

## సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీలో సిపిఐ(ఎంఎల్) ఎస్‌ఒసి విలీనం

సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీలో సిపిఐ (ఎం.ఎల్) ఎస్‌ఒసి (స్టేట్ ఆర్గనైజ్ కమిటీ) పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో విలీనమైంది. రాజకీయ సిద్ధాంత విషయాలను చర్చించి ఒక అంగీకారానికి వచ్చింది. ఒక రాజకీయ పార్టీగా ఏర్పడి, పనిచేయాలని భావించినట్లు సిపిఐ (ఎం.ఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు పార్టీల విలీనం భారత దేశంలో విప్లవకారుల ఐక్యతకు మరింత తోడ్పడాలని, సరైన సిద్ధాంత పరంగా దేశంలో ఐక్య విప్లవ పార్టీగా ఏర్పడాలన్నారు. రెండు కమ్యూనిస్టు విప్లవ సంస్థల ప్రతినిధులు సిపిఐ(ఎం.ఎల్) లిబరేషన్ (గతంలో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టులెనినిస్ట్) పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ), సిపిఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ పార్టీలు సమావేశమయ్యాయి. అన్ని కమ్యూనిస్టు విప్లవ శక్తులను, పార్టీలు, సమూహాలు, వ్యక్తులను ఏకం చేయడం ద్వారా ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి వ్యతిరేక శక్తుల సమీకరణ, ఐక్య అఖిల భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు తదితర అంశాలపైన చర్చ జరిగిందని, కమ్యూనిస్టు విప్లవాత్మక, వామపక్ష, ప్రజాస్వామ్య, లౌకిక శక్తులు ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు, సమగ్ర చర్చల తర్వాత ఒక సాధారణ అవగాహనకు వచ్చాయని పేర్కొన్నారు. విస్తృత ఒప్పందంతో, రెండు సంస్థలు ఒకే సంస్థగా సిపిఐ (ఎం.ఎల్) మాస్‌లైన్‌లో విలీనమయ్యేందుకు అంగీకరించాయి. చారిత్రక నక్సల్బరీ తిరుగుబాటు ద్వారా ఉద్భవించిన శక్తులను, భారతదేశంలోని సోషల్ డెమోక్రటిక్ పార్టీలలోని విప్లవాత్మక మనస్తత్వం కలిగిన సమూహాలను, వ్యక్తులను, ప్రజా పోరాటాల నుండి ఉద్భవిస్తున్న అధునాతన అంశాలను ఏకం చేయడం ద్వారానే ఐక్య శక్తివంతమైన అఖిల భారత కమ్యూనిస్టు పార్టీని నిర్మించడమే తమ లక్ష్యం అని ప్రదీప్ సింఘా ఠాకూర్, అలిక్ చక్రవర్తి (సిపిఐఎంఎల్ మాస్‌లైన్) సోమనాథ్ ఛటర్జీ, తపన్ ముఖర్జీ (సిపిఐఎంఎల్ఎస్‌ఒసి) తెలిపారు.

## తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం ఫలితంగానే 'కాంగ్రెస్ మేనిఫెస్టో ఉద్యమ అంశాలు'

చీమ శ్రీనివాస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం ఫలితంగానే 'తెలంగాణ ఉద్యమ కారుల' అంశాలను కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపర్చారని ఆ ఫోరం వ్యవస్థాపక చైర్మన్ చీమ శ్రీనివాస్ తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యమకారు అంశాన్ని ఎవ్వరూ మాట్లాడలేదని, అలాంటి సమయంలో తమ ఫోరం తరపున ఉద్యమ కారుల గొంతుకగా పనిచేశామని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అనేక మంది వివిధ పేర్లతో ఉద్యమ కారుల గురించి మాట్లాడుతున్నారని, కానీ వారంతా కూడా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఉద్యమ అంశాలను పొందుపర్చిన తర్వాత, ఆ పార్టీ అధికారంలోనికి వచ్చిన తర్వాత మాట్లాడుతున్నారని తెలిపారు.

తెలంగాణ ఉద్యమ కారుల అంశాలను కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపర్చేందుకు తాము ఎంతో కష్టపడ్డామని, అనేక మందినాయకుల వద్దకు వె ళ్లామని వివరించారు.

# బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అరెస్ట్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తమ పార్టీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి క్యాంప్ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేయడం శాంతి భద్రతల పరిరక్షణలో ప్రభుత్వ వైఫల్యానికి ప్రత్యేక్ష నిదర్శనమని బిజెపి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు విమర్శించారు. హైదరాబాద్ తార్నాకలోని రాంచందర్ రావు ఇంటి వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. కామారెడ్డికి బయలుదెరి వెళ్తుతుండగా ఆయనను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టును అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో పోలీసులు బిజెపి రాష్ట్ర పార్టీ ఉపాధ్యాక్షురాలు బండ కార్తీక చంద్రా రెడ్డితో పాటు పలువురు బిజెపి నేతలు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. అంతకు ముందు రాంచందర్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బందకాండ పాలనసాగిస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్య పద్ధతులకు విర్ధంగా అరెస్టులు చేయడం సిగ్గు చేటాన్నారు.

**అప్రకటిత అత్యవసర పరిస్థితి : కిషన్ రెడ్డి**

తెలంగాణలో ప్రస్తుతం 'అప్రకటిత అత్యవసర పరిస్థితి' నడుస్తోందని కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి విమర్శించారు. 'రాజకీయంగా బిజెపి ఎదుగుదలను చూసి భయపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం, పోలీసు యంత్రాంగాన్ని వాడుకుని ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి తాటాకు చప్పుళ్లకు బిజెపి భయపడదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

**రాష్ట్రంలో నిర్బంధ పాలన : ఎంపి డి.కె. అరుణ**

బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపి డి.కె. అరుణ, బిజెపి ముఖ్య అధికార ప్రతినిధి సుభాష్ అరెస్టును తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోలీసులను అడ్డుపెట్టుకుని నిర్బంధ పాలన సాగిస్తున్నారని, ప్రజలు అన్నింటిని గమనిస్తున్నారని హెచ్చరించారు. స్వంత పార్టీ ఎమ్మెల్యేకు మద్దతు తెలపడం నేరమా అని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

## బిజెపి రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తోంది : వి.హనుమంతరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిజెపి రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తూ నియంత పోకడలకు పాల్పడుతోందని మాజీ ఎంపి వి.హనుమంతరావుఆరోపించారు. గాంధీభవన్ ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఢిల్లీలో జరిగిన ఎఐ సమ్మిట్‌లో ప్రధాన ప్రతిపక్ష నాయకుడికి అవకాశం ఇవ్వకపోవడం దారుణమన్నారు. రాజ్యాంగం ప్రకారం అధికారంలో ఉన్నవారితో పాటు ప్రతిపక్షంలో ఉన్నవారికి సైతం సమాన హోదా ఉంటుందని కాని బిజెపి ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. బిజెపి వైఖరిని ప్రజలు ఇప్పుడు కాకున్న రేపు అయినా తిరస్కరిస్తారని విహెచ్ పేర్కొన్నారు.కుల గణన చేపట్టడం ద్వారా తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు.రాజీవ్ గాంధీ ఆలోచనలను రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు తీసుకువెళ్లడం అభినందనీయమని తెలిపారు. రాష్ట్రంలో బిసి రిజర్వేషన్ పై అన్ని విధాలా కృషి చేశారని, చైర్మన్ , మేయర్, ఉప సర్పంచ్ పదవుల్లో మహిళలకి రిజర్వేషన్ కల్పించారన్నారు. డిసిసి ప్రత్యేక శిక్షణ శిబిరం సమావేశంలో పని చేసే వాళ్ళకి పదవులు అని సిఎం రేవంత్‌రెడ్డి చెప్పటం అభినందనీయమని విహెచ్ పేర్కొన్నారు.



## చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన గీత

హాజరైన ఎమ్మెల్యే వీరేశం, డైరీ చైర్మన్ అమిత్‌రెడ్డిలు

**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీ చైర్ పర్సన్‌గా ఎన్నికైన పందిరి గీతారమేష్ ఆదివారం రోజున పదవీ బాధ్యతలు చేపట్టారు. నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, తెలంగాణ డైరీ కార్పోరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డిలు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆమెకు శుభాకాంక్షాలు, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సేవ చేయడానికి ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని పాలక వర్గం సద్వినియోగం చేసుకోవాలని, ప్రజా సమస్యలను వెనువెంటనే పరిష్కరించే విధంగా తమ పాలన కొనసాగాలని సూచించారు. పట్టణంలో ఎదురయ్యే మౌళిక సమస్యల పట్ల ఎల్లవేళలా అప్రమత్తత వహించాలని, పారదర్శక పాలనతో ముందుకు సాగాలన్నారు. పట్టణ అభివృద్ధిలో తమ వంతు సహకారం ఎల్లపుడూ ఉంటుందని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు, వార్డు కౌన్సిలర్లను వారు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పోకల దేవదాసు, పందిరి శ్రీనివాసులు, జడల చిన్నమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## కుమ్మరి జాతరలో జరిగిన ఘటన అత్యంత దుర్మార్గం: ఎఐఎస్‌ఎఫ్

**ప్రజాపక్షం/దేవరకొండ:** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మరి జాతరలో జరిగిన చిన్నారి మృతి ఘటన రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా వైఫల్యానికి స్పష్టమైన నిదర్శనం అని, చిన్నారులు, మహిళల పట్ల అవమానకరంగా, అశ్లీలంగా ప్రవర్తించిన ఘటనలను ఎఐఎస్‌ఎఫ్ తీవ్రంగా ఖండిస్తుందని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు ఆరోపించారు. ఆదివారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ జాతర వంటి సాంప్రదాయ, సామాజిక వేడుకల్లో ప్రజల భద్రతకు సరైన చర్యలు తీసుకోకపోవడం అత్యంత దురదృష్టకరమని ఒక వైపు చిన్నారి మృతి చెందడం, మరోవైపు మహిళల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా జరిగిన చర్యలు సమాజంలో పెరుగుతున్న వికృత మనస్తత్వానికి ప్రతిబింబమని మహిళలపై వేదింపులు, అగౌరవకర ప్రవర్తన ఎట్టి పరిస్థితుల్లో సహించరానివని ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకొని నిందితులను శిక్షించాలని అన్నారు. ప్రజా వేడుకల్లో భద్రతా లోపాలు, పర్యవేక్షణ లోపాలు తీవ్ర పరిణామాలకు దారి తీస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకొని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. చిన్నారి మృతిపట్ల ఏఐఎస్‌ఎఫ్ సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## యూరియా ఆన్‌లైన్ పద్ధతితో ఇబ్బందులు


రైతులకు సరిపడా యూరియాను అందజేయాలి



**ప్రజాపక్షం/గుండాల:** రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన యూరియా ఆన్‌లైన్ పద్ధతి ద్వారా రైతులకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీని ద్వారా రైతులకు యూరియా తీసుకోవడానికి నానాపాట్లు పడాల్సిన పరిస్థితిన నెలకొందని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన యాప్ ద్వారా యూరియా సప్లైని రద్దు చేసి రైతులకు సరిపడా యూరియాను అందజేయాలని సిపిఐ రైతు సంఘం రాష్ట్ర నాయకులు రాజయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, రైతు మిత్ర సంఘాల ద్వారా రైతులకు నేరుగా యూరియాను అందించాలని ప్రభుత్వానికి ఆయన సూచించారు. రైతులు వరినాట్లు వేసి రెండు నెలలు గడుస్తున్నా యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు తమ పంటల పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు. తక్షణమే యాప్ ద్వారా యూరియా సప్లైని ఆపి రైతులకు నేరుగా యూరియాను అందించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా రైతు సంఘం నాయకులు కొమురయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల సాకారమే లక్ష్యం

ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** పేదల సొంతింటి కల సాకారమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కాసరబాద గ్రామంలో దుండిగల రాములుకు ప్రభుత్వం మంజూరి చేసిన ఇందిరమ్మ ఇల్లు పూర్తి చేసుకొని గృహప్రవేశం చేస్తుండగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోతి గోపాల్ రెడ్డితో కలిసి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. నూతన గృహ ప్రవేశం చేస్తున్న రాములు కుటుంబ సభ్యులు ఆయనకు పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కళ నెరవేరుతుందన్నారు. రెండేండ్ల కాంగ్రెస్ పాలనపై ప్రజలకు ఎంత నమ్మకం ఉందో ఇటీవల జరిగిన గ్రామ పంచాయితీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలే నిదర్శమని అన్నారు. రాబోయే మండ ల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో కూడా ఇవే ఫలితాలు రాబోతున్నాయని స్పష్టం చేశారు.

## దోషులకు కఠిన శిక్షలు విధించాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నాగర్‌కర్నూలు జిల్లా కుమ్మేర మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాల సందర్భంగా రజకులు దర్శనానికి వెళ్తున్న సమయంలో జరిగిన దాడి ఘటనపై దోషులను కఠినంగా శిక్షించాలని టీఆర్‌వీడిఎస్ జిల్లా కార్యదర్శి ఐతరాజు శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండ కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలు దాటినా దేవాలయాల్లోకి రజకులను ప్రవేశించనీయకుండా అడ్డుకోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రకులస్తులు దాడి చేసి కుటుంబ సభ్యులను తీవ్రంగా గాయపరచడంతో పాటు పసిపాప మృతికి కారణమైన ఘటన ఘోరమని అన్నారు. ఇది సామాజిక వివక్షకు పరాకాష్టగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ ఘటనను ప్రజా సంఘాలు, ప్రజలు తీవ్రంగా ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు రెవెల్లి యాదయ్య, పోలేపల్లి శంకర్, నదికొండ శ్రీనివాస్, ఐతరాజు మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి నెలా ఉచిత కంటి వైద్యశిబిరం

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

12 విడత కంటి వైద్య శిబిరంలో 610 మందికి కంటి పరీక్షలు



**ప్రజాపక్షం/చండూరు:** మునుగోడు నియోజకవర్గంలోని ప్రజలు ఎవ్వరు కంటి సమస్యతో బాధపడవద్దని కండ్ల సమస్యలు ఉన్న వారు ధైర్యంగా వెళ్లి కంటి ఆపరేషన్లు చేయించుకోవాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నియోజకవర్గం ప్రజలకు భరోసా కల్పించారు. తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా కంటి సమస్యలతో బాధపడే ప్రతఇఒక్కరికి కంటి చూపు మెరుగవ్వాలనే తలంపుతో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాలకు భారీ స్పందన వస్తుండటంతో ఆదివారం మునుగోడులోని క్యాంపు కార్యాలయం వద్ద చండూరు మున్సిపాలిటీ, చండూరు మండల ప్రజలకు 12వ విడుత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చండూరు మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు, వైస్ చైర్మన్ భూతరాజు దశరథ ,మండల నాయకులతో కలిసి ప్రారంభించారు. ఉచిత కంటి వైద్య శిభిరాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఎవరెవరికి ఏ ఏ కంట ఇసమస్యలు ఉన్నాయని ఆరా తీసి మీకు నేనున్నానని భరోసా కల్పించారు.ఈ 12వ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 610మందికి కంటి పరీక్షలు నిర్వహించగా అందులో250 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికైయ్యారు. కంటి ఆపరేషన్లకు ఎంపికైన వారిలో ఆదివారం 155 మందిని వెంటనే ఆపరేషన్ కొరకు హైదరాబాద్ లోని శంకర కంటి ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారందికి మంగళవారం కంటి ఆపరేషన్లు చేయనున్నారని తెలిపారు. ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రతి నెల నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చండూరు మండల కాంగ్రేస్ పార్టీ అధ్యక్షుడు కొరిమి ఓంకారం, పార్టీ చండూరు పట్టణ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్ గౌడ్, అబ్బనబోని లింగయ్య , మారయ్య పాల్గొన్నారు.

## నేడు మిర్యాలగూడలో సేవాలాల్ జయంతి వేడుకలు

ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి వెల్లడి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలను సోమవారం మిర్యాలగూడలో ఘనంగా జరగనున్నందున బంజారా సోదరులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సేవాలాల్ జయంతి ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించి మాట్లాడారు. గిరిజన బంజారాలు అత్యంత వైభవంగా జరుపుకునే సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జయంతి రోజు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం నుంచి సంత్ సేవాలాల్ భవనం ఎన్‌ఎస్పీ క్యాంప్ వరకు గిరిజన సాంప్రదాయం వేషధారణ డప్పు వాయిద్యాలతో ఆటపాటల ద్వారా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మహా భోగ్ బండార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలకు అధికారులు, విద్యావంతులు, మహిళలు కుల సంఘాలు, విద్యార్థి సంఘాలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందించడంతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొర్ర నాగునాయక్, రవితేజనాయక్, సర్పంచ్‌లు సిద్ధునాయక్, శ్రీహరి, ఎంఈవో ధర్మానాయక్, బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరద్‌నాయక్, కృష్ణకాంత్‌నాయక్, కృష్ణనాయక్, మురళినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బుద్ధవనం - అంతర్జాతీయ వేదికపై ఖ్యాతి



**ప్రజాపక్షం/నందికొండ:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నాగార్జునసాగర్ వద్ద అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన బుద్ధవనానికి ప్రపంచస్థాయి గుర్తింపు లభిస్తోంది. తాజాగా దక్షిణ కొరియాకు చెందిన ప్రతిష్టాత్మక విద్యాసంస్థ ప్రతినిధుల బృందం బుద్ధవనాన్ని సందర్శించి ప్రశంసలు కురిపించింది.హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పాల్గొన్న అనంతరం, బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య సూచన మేరకు బృందం నాగార్జునసాగర్‌కు చేరుకుంది. దక్షిణ కొరియాలోని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ బుద్ధిష్ట్ స్టడీస్‌కు చెందిన విద్యాసాంస్కృతిక ప్రతినిధులు కాంగ్ సుంగ్ యోంగ్, చోయ్ సేంగహో, మిన్ క్యేయోంగ్ వూ, కవన్ జిన్ వోక్, శేషు, చిరాగ్ జలది తదితరులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.బృందం ముందుగా భగవాన్ బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించి, అనంతరం బుద్ధ చరిత వనం, జాతక వనం, ధ్యాన వనం, స్థూప వనాలను సందర్శించింది. ముఖ్యంగా స్థూప వనంలో నిర్మించిన సౌత్ కొరియా మహాస్తూపాన్ని పరిశీలించి, భారకొరియా బౌద్ధ సంబంధాలకు ఇది ప్రతీకగా నిలుస్తోందని అభిప్రాయపడ్డారు.తదుపరి మహాస్తూపం అంతర్భాగంలోని సమావేశ మందిరంలో బుద్ధవనం విశేషాలను ప్రతిబింబించే లఘు చిత్రాన్ని వీక్షించారు. ధ్యాన మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, శాసన విభాగం అధికారులు, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్ర,ఆర్ట్స్ అండ్ ప్రమోషన్స్ మేనేజర్ శ్యాంసుందరరావు బుద్ధ జ్యోతులను వెలిగించి అతిథులను సన్మానించారు. బుద్ధవనం కండువాలు,బ్రోచర్లు అందజేసి సాంస్కృతిక మర్యాదలు పాటించారు.ఈ సందర్భంగా బుద్ధవనంలో చేపట్టబోయే నూతన నిర్మాణాలు, అంతర్జాతీయ బౌద్ధ సదస్సుల ప్రణాళికలు, పర్యాటకాభివృద్ధి చర్యలపై వారికి వివరించారు. బృందంతో పాటు స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.బుద్ధవనం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం తెలంగాణ పర్యాటక రంగానికి మరింత ఊతమిచ్చే అంశంగా భావిస్తున్నారు.

## ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించాలి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** ఆధునిక వైద్య సదుపాయాలు జిల్లా ప్రజలకు అందుబాటులోకి రావడం సంతోషకరమని నాణ్యమైన వైద్య సేవలు ప్రజలకు చేరువ కావడం ద్వారా ఆరోగ్యం మరింత బలోపేతం అవుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన లాలిత్య స్కిన్ అండ్ లేసర్ సెంటర్ ను మంత్రి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధునిక వైద్య సదుపాయాలు ప్రజలకు అందుబాటులోకి రావడం సంతోషకరమని పేర్కొన్నారు స్థానిక ప్రజలకు మెరుగైన చర్మ వైద్య సేవలు అందించాలని నిర్వాహకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వైద్యులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు

## అరైవ్(-) అలైవ్ రోడ్డు భద్రత అవగాహన

**ప్రజాపక్షం/సూర్యాపేట :** ప్రజల ప్రాణభద్రత ప్రధానంగా దృష్టిలో ఉంచుకొని జిల్లాలో నేటి నుండి వారం రోజులపాటు రెండవ దశ అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పి కె నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నిర్మూలించడం, ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యం చేరడం, ట్రాఫిక్ నియంత్రణపై ప్రజలకు అవగాహన పెంపొందించడం దీని ముఖ్య ఉద్దేశ్యమని చెప్పారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లో దీనిపై విస్తృత ప్రచారం చేస్తామని, ప్రజలకు ట్రాఫిక్ నియమాలను తెలియపరుస్తామన్నారు. హెల్మెట్ ధరించడం, సీటు బెల్ట్ వినియోగం, మితిమీరిన వేగం నివారణ, మద్యం సేవించి వాహనం నడపకూడదని అంశాలపై ప్రతిరోజు ఒక కార్యక్రమం నిర్వహించి ప్రజలను చైతన్యం చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని కోరారు.

## మత సామరస్యానికి ప్రతీక హజ్రత్ అబ్బాస్ దర్గా



**ప్రజాపక్షం/చింతపల్లి :** మత సామరస్యానికి ప్రతీక హజ్రత్ అబ్బాస్ దర్గా షరీఫ్ ఉరుసు అని మాజీ మంత్రి, సూర్యపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, బిఆర్‌ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మండల పరిధిలోని పికె మల్లేపల్లి గ్రామంలో జరుగుతున్న 57వ హజ్రత్ అబ్బాస్ దర్గా షరీఫ్ ఉరుసు ఉత్సవాలలో ఆదివారం వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ జగదీశ్‌రెడ్డి, రవీంద్రకుమార్‌కు ఘన స్వాతగం పలికి శాలువతో సన్మానించారు. తదనతంతరం వారు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్‌రెడ్డి, పల్లా ప్రవీణ్‌రెడ్డి, భీల్యానాయక్, కిషన్‌నాయక్, రమేష్‌నాయక్, దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, ఉజ్జిని విద్యాసాగర్‌రావు పాల్గొన్నారు.

## ఆర్గానిక్ మునగాకు ఉత్పత్తుల పరిశీలన

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలంలోని దాత్తయపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఎంఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కళాశాల నుండి వచ్చిన యూనిట్ 2 విద్యార్థులు దత్తాయిపల్లి గ్రామంలో ఉన్న యాదాద్రి ఆగ్రో ప్రాసెసింగ్ సెంటర్ కంపెనీని విజిట్ చేసి ఆర్గానిక్ పద్ధతులలో చేస్తున్న మునగాకు ఉత్పత్తుల గురించి తెలుసుకున్నారు. ఈ యొక్క ప్రాసెసింగ్ సెంటర్ గురించి సంస్థ డైరెక్టర్స్ సుధీర్, అమరేందర్ రెడ్డి, సుమలత అరుణలు వివరిస్తూ సోలార్ డిహైడ్రేషన్‌తో, మునుగ, తులసి, అశ్వగంధ, అల్లం, బొప్పాయి మొదలగు ఇతర ఆకులని ఎండబెట్టి ప్యాకింగ్ చేసి వివిధ దేశాలకి ఎగుమతి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో రైతులని భాగస్వాములని చేసి, వారిని ఆర్గానిక్ పద్ధతులలో పంటలని వేయించి వాటిని తిరిగి కోనేలాగా వారిని ప్రోత్సహిస్తున్నామని, దీని ద్వారా వారికీ మంచి ఆదాయంతోపాటు, భూమి ఆరోగ్యాన్ని కాపాడవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్, ప్రోగ్రాం ఆఫీసర్ కనక బాలరాజ్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.




## సర్కారీ దవాఖానా.. రోగులకు తీరని వేదన!

సమస్యల నిలయంగా నాంపల్లి ప్రభుత్వ దవాఖాన



**ప్రజాపక్షం/నాంపల్లి:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిస్థితి రోజురోజుకూ ఆందోళనకరంగా మారుతోంది.పేదలకు పెన్నిధిగా ఉండాల్సిన ప్రభుత్వ దవాఖానాలు నేడు సమస్యల నిలయాలుగా మారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మారుమూల గ్రామాల నుంచి ప్రభుత్వ వైద్యంపై నమ్మకంతో వచ్చే సామాన్యులకు నిరాశే ఎదురవుతోంది.డాక్టర్లు అందుబాటులో లేకపోవడం, ఉన్నా సమయపాలన పాటించకపోవడంతో రోగులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ప్రతిరోజూ వందలాది మంది రోగులు దవాఖానాకు వస్తున్నప్పటికీ, ఓపీ విభాగాల్లో డాక్టర్లు ఉండాల్సిన సమయంలో కుర్చీలు ఖాళీగా కనిపిస్తున్నాయి. గర్భిణీలకు తీవ్ర ఇబ్బందులు గైనకాలజిస్టులు లేకపోవడంతో గర్భిణీలు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రసవాల కోసం ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని వారు వాపోతున్నారు.అత్యవసర సేవల కొరత రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరిగితే ప్రాథమిక చికిత్స అందించే సిబ్బంది లేకపోవడం బాధాకరమని రోగులు ఆరోపిస్తున్నారు. సాయంత్రం 8 గంటల తర్వాత ఆసుపత్రిలో నర్సింగ్ సిబ్బంది కూడా అందుబాటులో ఉండకపోవడం పరిస్థితి దారుణతను తెలియజేస్తోంది.

సిబ్బంది కొరత పెరుగుతున్న పనిభారం


స్పెషలిస్ట్ డాక్టర్ల సంగతి పక్కన పెడితే, కనీసం ఎంబీబీఎస్ డాక్టర్లు కూడా పూర్తిస్థాయిలో లేరని తెలుస్తోంది. ఉన్న కొద్ది మంది సిబ్బందిపైనే అధిక పనిభారం పడుతుండటంతో రోగులకు సరైన సమయం కేటాయించడం కష్టమవుతోంది.

ప్రజల డిమాండ్

మారుమూల ప్రాంతాల్లో డాక్టర్లు విధులు నిర్వర్తించేలా కఠిన నిబంధనలు అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ దవాఖానాకు వస్తే జబ్బు తగ్గుతుందన్న నమ్మకం కల గాలి గానీ, ఇక్కడి పరిస్థితులు చూస్తే మరిన్ని సమస్యలు ఎదురయ్యే పరిస్థితి ఉందని స్థానికులు అంటున్నారు.

ఉన్నతాధికారులు వెంటనే స్పందించి డాక్టర్లు, నర్సుల కొరతను తీర్చడంతో పాటు సమయపాలన కచ్చితంగా అమలు చేయించి రోగులకు నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## చంద్రమ్మకు నివాళులు అర్పించిన ఎమ్మెల్సీ సత్యం



**ప్రజాపక్షం/మర్రిగూడ :** మండలంలోని తానేదారుపల్లి గ్రామానికి చెందిన సీపీఐ నాయకులు కర్నాటి అంజయ్య తల్లి కర్నాటి చంద్రమ్మ ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆదివారం వారి నివాసానికి వెళ్లి చంద్రమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన, వారి కుటుంబానికి ధైర్యం చెప్పి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. చంద్రమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ఈదుల బిక్షం రెడ్డి,మండల కన్వీనర్ బుర్ర శేఖర్, మండల కార్యవర్గ సభ్యులు ఎరుకల నిరంజన్ గౌడ్,శాఖ కార్యదర్శి అబ్బనగోని కృష్ణయ్య,అడుమయ్య,జాల చంద్రయ్య,పాముల రమేష్,కొమురయ్య పాల్గొన్నారు.

## మురళీకృష్ణుడిగా నారసింహుడు!



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** నీలమేఘ శ్యాముడు.. వేణుగాన లోలుడు.. ఆ నందకిశోరుడి రూపంలో యాదగిరి లక్ష్మీనరసింహస్వామి వారు భక్తులను మురిపించారు. లోక రక్షకుడైన నారసింహుడు, లోక మోహనుడైన మురళీకృష్ణుడిగా దర్శనమివ్వడంతో యాదగిరి గిరిప్రదక్షిణ భక్తి పారవశ్యంలో మునిగి తేలింది. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు ఆదివారం స్వామివారు ఉదయం శ్రీకృష్ణాలంకారంలో, రాత్రి పొన్న వాహనంపై ఊరేగుతూ భక్తకోటిని తరింపజేశారు.

వేణునాదం.. వేదనాదం!

బ్రహ్మోత్సవాల వేళ ఆలయంలో నిత్యారాధనల అనంతరం వేద మంత్రోచ్చారణల మధ్య స్వామి వారికి శ్రీకృష్ణాలంకార (మురళీకృష్ణుడు) సేవ నిర్వహించారు. చేతిలో వేణువు ధరించి, నెమలి పింఛంతో ముస్తాబైన స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. మురళీకృష్ణుడి వేణునాదం సాక్షాత్తు వేదనాదమని, ఆ రూపాన్ని దర్శించినా, ఆ గానాన్ని స్మరించినా ఇంద్రియాలకు ఉపశమనం కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. శ్రీపాంచరాత్రాగమ శాస్త్రానుసారముగా ఆలయ ప్రధానార్చకులు కల్లూరు వెంకటాచార్యులు, బట్టర్ సురేంద్ర ఆచార్యుల బృందం ఈ వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించారు.

రాత్రివేళ రమణీయం.. పొన్నవాహన సేవ పగలు కృష్ణుడిగా అలరించిన స్వామివారు, రాత్రి వేళ విశిష్టమైన పొన్న వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. దేవతా వృక్షాలలో శ్రేష్టమైన పొన్న వృక్షంపై స్వామివారి ఊరేగింపు కన్నులపండువగా సాగింది. భగవంతుడు సత్పురుషులకు నివాస వృక్షంలా అండగా ఉంటాడని, ఈ వాహనంపై స్వామిని దర్శిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. విద్యుత్ దీపాల కాంతుల మధ్య స్వామివారి తిరువీధి ఉత్సవం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

తరలివచ్చిన భక్తజనం..

ఈ వేడుకల్లో ఆలయ ఈవో జే. భవాని శంకర్, జిల్లా కలెక్టర్ ఎం. హనుమంతరావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తి, డీఈవో దోర్బల భాస్కర శర్మ తదితరులు పాల్గొన్నారు. ఏఈఓలు గజ్వేల్ రఘు, నవీన్ కుమార్ శర్మ, పర్యవేక్షకులు మరియు సిబ్బంది సమన్వయంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో యాదగిరిగిరి గోవింద నామస్మరణతో మారుమోగింది.



### అమెరికన్ సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో...

# 'అబ్‌కీ బార్ ట్రంప్ సే హార్'

- కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేశ్ ఎద్దేవా
- తాత్కాలిక వాణిజ్య ఒప్పందాన్ని ఇక 'కోల్డ్ స్టోరేజీ'లో పెట్టాలని కాంగ్రెస్ హితవు

**న్యూఢిల్లీ :** అమెరికా తాత్కాలిక వాణిజ్య ఒప్పందాన్ని లక్ష్యంగా చేసుకుని ఆదివారం కాంగ్రెస్ పార్టీ మోదీ సర్కారుపై విమర్శనాస్త్రాలు సంధించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ సుంకాలపై అమెరికన్ సుప్రీంకోర్టు తీర్పు తర్వాత 'అబ్ కీ బార్ ట్రంప్ సే హార్' అని ఎద్దేవా చేసింది. ఈ గందరగోళం నేపథ్యంలో దానిని తప్పకుండా 'కోల్డ్ స్టోరేజి'లో ఉంచాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించింది. మధ్యంతర ఒప్పందం కోసం ఫ్రేమ్ వర్క్ నిబంధనలను తిరిగి చర్చించాలని, దిగుమతి సరళీకరణ వ్యవసాయ ఉత్పత్తుల గురించి మాట్లాడే నిబంధనలను రద్దు చేయాలని ఆదివారం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇన్‌చార్జి కమ్యునికేషన్స్ జైరామ్ రమేశ్ డిమాండ్ చేశారు. ఒప్పందం అంటే ఇచ్చుపుచ్చుకోవడం అని, కానీ



భారత దేశం తాత్కాలిక వాణిజ్య ఒప్పందం కింద మాత్రమే ఇచ్చిపుచ్చుకుందని జైరామ్ రమేశ్ పేర్కొన్నారు. 'ప్రధానమంత్రి నరేంద్రమోదీ హూస్టన్‌లో 2019లో 'అబ్‌కీ బార్ ట్రంప్ సర్కార్' అనే నినాదం ఇచ్చారని, కానీ ఆ ఒప్పందం ఫ్రేమ్ వర్క్ 'అబ్ కీ బార్ ట్రంప్ హార్' అని రుజువు చేసింది' అని జైరామ్ రమేశ్ 'పిటిఐ' వీడియోలో చెప్పారు. భారతదేశం తన నిబద్ధతలను మార్చుకోవడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలను మార్చారని ఆయన ఆరోపించారు. ఈ సమస్యను చుట్టుముట్టిన భారీ గందరగోళం దృష్ట్యా ఈ ఉమ్మడి ప్రకటనను కోల్డ్ స్టోరేజీలో ఉంచాలని తాను ఆశిస్తున్నానని, ఇది ఏకపక్ష ఒప్పందం అని, ఇది దేశంలోని వివిధ రాష్ట్రాలలో లక్షలాది మంది రైతుల ప్రయోజనాలకు హానికరమని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేశ్ అన్నారు. కాంగ్రెస్ ఎజెండాలో కిసాన్ మహా చౌపల్స్ శ్రేణిలో మొదటిది భోపాల్‌లో ఫిబ్రవరి 24న, రెండవది మహారాష్ట్రలో మార్చి 7న, మూడవది శ్రీగంగానగర్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతుల ప్రయోజనాలను కాపాడటమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని జైరామ్ రమేశ్ నొక్కి చెప్పారు.

# జమ్ముకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

### ముగ్గురు ఉగ్రవాదులు హతం

**జమ్ము :** జమ్ముకశ్మీర్‌లో మళ్లీ తుపాకుల మోత మోగింది. కిష్టావర్ జిల్లాలోని మారుమూల ప్రాంతంలో ఆదివారం భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పాకిస్తాన్‌కు చెందిన జైషే మహమ్మద్ (జెఎం) తో అనుబంధంగా ఉన్న ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారని అధికారులు తెలిపారు. చత్రో బెల్ట్‌లోని పాసర్‌కుట్ ప్రాంతంలో 'త్రాషి–1' ఆపరేషన్ సమయంలో ఉగ్రవాదులు హతమయ్యారని, వారి నుండి రెండు ఎకె47 రైఫిల్స్‌తో సహా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు సైన్యం తెలిపింది. 'జెకె పోలీసులు, ఐబి (ఇంటెలిజెన్స్ బ్యూరో), సొంత నిఘా వర్గాల నుండి సేకరించిన విశ్వసనీయ నిఘా సమాచారం ప్రకారం, కిష్టావర్ ప్రాంతంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఉగ్రవాదులను ట్రాక్ చేయడానికి, తటస్థీకరించడానికి ఆపరేషన్ 'త్రాషి–1' కింద ఉమ్మడి ఆపరేషన్ ప్రారంభించారు. ముందుగా చర్చలు జరపగా, అవి విజయవంతం కావడంతో సిఐఎఫ్ (కౌంటర్ ఇంటెలిజెన్స్ ఫోర్స్) డెల్టా దళాలు, పోలీసులు, సిఆర్‌పిఎఫ్‌తో



పరస్పర సమన్వయంతో ఆదివారం ఉదయం 11 గంటలకు సవాలుతో కూడిన భూభాగంలో ఉగ్రవాదుల వ్యతిరేక ఆపరేషన్‌లోకి దిగినట్లు ఆర్మీకి చెందిన వైట్ నైట్ కార్ప్స్ ఎక్స్‌లో పోస్టు చేశారు. వ్యూహాత్మక కచ్చితత్వం, దూకుడును ప్రదర్శిస్తూ, ఇద్దరు ఉగ్రవాదులను విజయవంతంగా తటస్థీకరించిన ఎన్‌కౌంటర్ ప్రదేశంలో దళాలు ఆధిపత్యం చెలాయించాయని ఆర్మీ తెలిపింది. ఇంకా ఆపరేషన్ కొనసాగుతోందని, శాంతికి భంగం కలిగించడానికి ప్రయత్నించే వారికి ఆశ్రయం దొరకదని వైట్‌నైట్ కార్ప్స్ హెచ్చరించింది. ప్రాథమిక సమాచారాన్ని ఉటంకిస్తూ, హతమైన ఉగ్రవాదులిద్దరూ పాకిస్తాన్ జాతీయులు. నిషేధిత జెఇఎం సభ్యులు అని అధికారులు తెలిపారు. ఉగ్రవాదులు కొండ దిగువన ఉన్న ఒక మట్టిహౌస్ లోపల దాక్కున్నట్లు సమాచారం అందిందని, గాలింపు బృందాలపై వారు కాల్పులు జరపగా ప్రతిగా బలగాలు కూడా కాల్పుల జరిపినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఇంకా సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. చత్రో అటవీ ప్రాంతంలో గత నెలలో ఉగ్రవాదులు, భద్రతా దళాల మధ్య దాదాపు అరడజను సార్లు కాల్పులు జరిగాయి. ఫలితంగా ఒక సైనికుడు, ఒక ఉగ్రవాది మరణించారు. ఆదివారం ఇద్దరు ఉగ్రవాదులను హతమార్చడంతో ఈ సంవత్సరం జమ్ము ప్రాంతంలో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో మొత్తం ఆరుగురు జెఎం ఉగ్రవాదులను భద్రతా దళాలు మట్టుబెట్టాయి. అంతకుముందు, ఉధంపూర్‌లో ఇద్దరు, కథువా జిల్లాలో ఒకరు హతమయ్యారు.

## పెళ్లిళ్లకు కొన్ని గంటల ముందు అక్కాచెల్లెళ్ల ఆత్మహత్య..!



**న్యూఢిల్లీ :** కొన్ని గంటల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సిన అక్కా చెల్లెళ్లు ఆత్మహత్యకు పాల్పడ్డారు. రాజస్థాన్ రాష్ట్రం జోధ్‌పూర్ జిల్లాలోని మనాయ్ గ్రామంలో గుండెను పిండేసే ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. ఆత్మహత్యలకు పాల్పడ్డ పెళ్లి కుమార్తెలు శోభ (25), విమ్ల (23) ఇద్దరూ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్లుగా పనిచేస్తున్నారు. శనివారం వారి పెళ్లిళ్లు జరగాల్సి ఉండటంతో శుక్రవారం అర్ధరాత్రి వరకు ఇంట్లో పెళ్లి వేడుకలు, సంప్రదాయ 'బంధోలి' కార్యక్రమం సందడిగా సాగాయి. అయితే శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఇద్దరూ పురుగుల మందు సేవించారు. వారి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. అయితే పరిశీలించిన వైద్యులు అప్పటికే వారు మరణించినట్లు ప్రకటించారు. దాంతో మృతదేహాలను ఇంటికి తీసుకెళ్లిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వకుండానే అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. కానీ ఇంతలో మృతుల మేనమామ జస్వంత్ సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి అంత్యక్రియలను నిలిపేశారు. మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. మరో ఐదు నిమిషాలు ఆలస్యం జరిగి ఉంటే అంత్యక్రియలు పూర్తయ్యేవని జస్వంత్ సింగ్ చెప్పారు. మృతదేహాలు నీలి రంగులోకి మారాయని, ఇది విష ప్రయోగంవల్ల జరిగిన ఆత్మహత్యేనని మృతుల మేనమామ ఆరోపించారు. బాధితుల బాబాయ్‌లు, ఈ పెళ్లిళ్ల విషయంలో తీవ్ర ఒత్తిడి తెచ్చారని, మొదట కుదిరిన పెళ్లి సంబంధాలను రద్దుచేసి, బాబాయ్‌ల ఒత్తిడి మేరకు పోఖ్రాన్ ప్రాంతానికి చెందిన వ్యక్తులతో పెళ్లిళ్లు నిశ్చయించారని చెప్పారు. ఈ బలవంతపు పెళ్లి ఇష్టంలేకనే తన మేనకోడళ్లు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. కాగా, పోలీసులు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. పోస్టుమార్టంలో వారి మరణానికి పురుగుల మందే కారణమని తేలింది. వారు పురుగుల మందు తాగినట్లుగా ఆధారాలు లభించాయి. అయితే ఘటనా స్థలంలో ఎలాంటి ఆత్మహత్య లేఖ లభించలేదు. దీనిపై కుటుంబ సభ్యులందరినీ విచారిస్తున్నామని ఎడిసిపి రోషన్ మీనా తెలిపారు.

### మహిళకు పార్సిల్..ఓపెన్ చేస్తే

## పుర్రె, ఎముకలు, విభూది!

**చెన్నై :** ఓ మహిళకు వచ్చిన పార్సిల్‌ను తెరచి చూస్తే అందులో మనిషి పుర్రె, ఎముకలు, విభూది దర్శనమిచ్చాయి. దాంతో ఆమె తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. తమిళనాడు రాజధాని చెన్నైలోని ప్యారిస్ ఏరియాలో ఈ ఘటన జరిగింది.



వివరాల్లోకి వెళ్తే.. వ్యాసర్పాడికి చెందిన శృతి అనే మహిళ ప్యారిస్‌లోని ఓ దుకాణంలో పనిచేస్తోంది. ఇవాళ ఒక గుర్తు తెలియని వ్యక్తి శృతి పనిచేసే దుకాణం దగ్గరకి వచ్చి, శృతికి పార్సిల్ వచ్చిందని సెక్యూరిటీకి ఇచ్చి వెళ్లాడు. ఆ తర్వాత సెక్యూరిటీ గార్డు ఆ పార్సిల్‌ను తీసుకెళ్లి శృతికి ఇచ్చాడు. దాంతో శృతి ఆ పార్సిల్ తనది కాదని చెప్పింది. దాన్ని తీసుకునేందుకు నిరాకరించింది. దాంతో దుకాణ యజమాని తన సిబ్బంది అందరి సమక్షంలో పార్శిల్ తెరిచి చూశాడు. అందులో మనిషి పుర్రె, ఎముకలు, విభూది ఉండడం చూసి షాక్‌కు గురయ్యారు. అనంతరం తేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శ్రుతి కుటుంబీకులకు, అదే షాపులో పనిచేసే దినేశ్ కుటుంబీకులకు గొడవలు ఉన్నాయని.. ఈ నేపథ్యంలోనే ఆమెను భయపెట్టేందుకు దినేశ్ ఇలా చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. దాంతో పోలీసులు దినేశ్‌ను, అతని అనుచరులు శ్రీనివాసన్, జోసెఫ్‌ను అరెస్టు చేశారు.

## ఎస్‌యువి, ట్రక్ ఢీ.. ఐదుగురు పోలీస్‌లు మృతి

**భువనేశ్వర్:** ఒరిస్సా జర్సుగూడజిల్లాలోని నేషనల్ హైవే 49లో ఆదివారం తెల్లవారుఝామున ఎస్‌యువి, ట్రక్ ఢీకొట్టుకోవడంతో ఐదుగురు పోలీస్ సిబ్బంది మరణించగా , నలుగురు గాయపడ్డారు. పోలీస్‌లు తెలిపారు.పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం ... ఎనిమిది మంది ఒక వివాహానికి హాజరై తిరిగి వస్తుండగాజర్సుగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒడిశా ఆదర్శ విద్యాలయ సమీపంలో ఈ సంఘటన జరిగింది. ఐదుగురు సిబ్బంది మరణించారు. ఇద్దరు తీవ్రంగా గాయపడి బర్గఢ్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరొకరు స్థిరావస్థలో ఉన్నారు.ట్రక్ డ్రైవర్ కూడా గాయపడి , చికిత్స పొందుతున్నాడు. ప్రమాదంలో ట్రక్ , పోలీస్ వాహనం రెండూ పూర్తిగా దెబ్బతిన్నాయి. మరణించిన పోలీస్ సిబ్బంది కాశీరాంబోయి,దేబదుత్తషా,లింగరాజ్ ధారువా(ఆర్మీ పోలీస్ ఆఫీస్‌నుండి)డ్రిల్ సబ్ ఇనస్పెక్టర్ నిరంజన్ కుజుర్, హోంగార్డు భక్తబంధు మిర్ధాగా గుర్తించారు. గాయపడినవారిలో ఎపిఆర్ సిబ్బంది దుబరాజ్ మిరిగా, ఆకాశ్ నాయక్, సెర్జెంట్ రాజీవ్ భర్సగర్ ఉన్నారు. కాగా ఈ ఘటనపై ముఖ్యమంత్రి మోహన్ చరణ్‌మజీహ్, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.జర్సుగూడలో జరిగిన ఈదుర్ఘటనాత్మక రోడ్డు ప్రమాదంలో 5మంది అంకితభావం గల పోలీస్ సిబ్బంది అకాల మరణానికి సంతాపం తెలుపుతూ, వారిఆత్మలకు శాంతి కలగాలని , గాయపడిప వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని మజీహ ఎక్స్‌లో వ్రాశారు.


# డిజిటల్ మోసాల బారిన పడొద్దు

### బ్యాంకు ఖాతాల పాస్‌వర్డ్స్ తరుచుగా మార్చండి : ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ :** బ్యాంకు ఖాతాల పాస్‌వర్డ్‌లను తరుచుగా మారుస్తుండాలని దేశ ప్రజలకు ప్రధాని మోదీ సూచించారు. నో యువర్ కస్టమర్ (కెవైసి)ని అప్‌డేట్ చేయమని, రీ కెవైసిని చేయమని బ్యాంకు నుంచి వచ్చే రిక్వెస్టులను చూసి అస్సలు చిరాకు పడొద్దని ప్రజలను ఆయన కోరారు. సొంత డబ్బును కాపాడుకునేందుకే ఈ పనిని చేస్తున్నామనే విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. ఆదివారం రోజు 131వ మన్ కీ బాత్ కార్యక్రమంలో మోదీ పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ఇప్పటికీ బ్యాంకు ఖాతా కెవైసిని చేశాం కదా, దీన్ని మళ్లీమళ్లీ ఎందుకు చేయాలనే ప్రశ్న చాలామంది మదిలో ఉదయిస్తుంటుందని ప్రధాని అన్నారు. మళ్లీమళ్లీ కెవైసి ఎందుకంటే, బ్యాంకు ఖాతా భద్రత కోసమే అని అందరూ గ్రహించాలని ఆయన పిలుపునిచ్చారు. డిజిటల్ అరెస్ట్ లాంటి ఆన్‌లైన్ ఆర్థిక మోసాల బారినపడకుండా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రజలకు సూచించారు. ఈ కాలంలో పెన్షన్, రాయితీలు, బీమా, యూపీఐ సహా అన్నీ బ్యాంకు ఖాతాతోనే లింకై ఉన్నాయని మోదీ గుర్తుచేశారు. అందుకే ఖాతాలకు మెరుగైన భద్రతను కల్పించేందుకు రీ కేవైసీని బ్యాంకులు చేయిస్తాయన్నారు.

**కెవైసి పేరుతో ఫేక్ కాల్స్, మెసేజ్‌లు రావొచ్చు**

''అయితే కెవైసి, రీ కెవైసి పేరుతో కొంతమంది నేరగాళ్ల



నుంచి ఫేక్ కాల్స్ వచ్చే ప్రమాదం ఉంది. వాళ్లు ఎస్ఎంఎస్‌లు, వెబ్ సైట్ లింక్స్ పంపే ముప్పు కూడా ఉంది. అందుకే కెవైసి, రీ కెవైసిని నేరుగా బ్యాంకు బ్రాంచీలో చేయించండి. లేదంటే బ్యాంకు అధికారిక యాప్ ద్వారా ఈ ప్రక్రియను పూర్తి చేయండి. ఎవరికీ మీ ఒటిపిని, ఆధార్ నంబరును, బ్యాంకు ఖాతా వివరాలను చెప్పకండి. మీ బ్యాంకు ఖాతా పాస్‌వర్డ్‌లను తరుచుగా మారుస్తుండండి. ఇలాంటి అంశాలపై దేశ ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇటీవలే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాలను నిర్వహించింది. ఈ ఏడాది పొడవునా ఈ వారోత్సవాలు కొనసాగనున్నాయి. ఆర్‌బిఐ సూచనలను పాటించండి. మీ కేవైసీని అప్‌డేట్ చేసుకోండి'' అని ప్రధాని మోదీ తెలిపారు.

**3 మేడిన్ ఇండియా ఎఐ మోడల్స్‌ను ఆవిష్కరించాం**

ఢిల్లీలో జరిగిన ఎఐ సదస్సు ద్వారా ఏఐ విభాగంలో భారత్ అద్భుత సామర్థ్యాలేంటో ప్రపంచానికి తెలిసొచ్చాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఏఐ సదస్సు వేళ మూడు మేడిన్ ఇండియా ఏఐ మోడల్స్‌ను భారత్ ఆవిష్కరించిందని ఆయన తెలిపారు. ''భారత్ నిర్వహించిన ఎఐ సదస్సుకు చాలామంది ప్రపంచదేశాల నేతలు వచ్చారు. ఈ సదస్సు సందర్భంగా ప్రదర్శించిన భారతీయ క్షఐ ఆవిష్కరణలను నేను వాళ్లకు చూపించాను. ప్రపంచ దేశాల నేతలకు ప్రత్యేకించి రెండు ఆవిష్కరణలు బాగా నచ్చాయి. వీటిలో మొదటిది అమూల్ బూత్. ఇందులో పశువుల నిర్వహణతో ముడిపడిన ఏఐ యాప్‌లను ప్రదర్శించారు. సకాలంలో పశువులకు చికిత్సను అందించేందుకు ఎఐ టెక్నాలజీని ఎలా వినియోగించాలి అనేది అమూల్ బూత్‌లో వివరించారు. పాల డైరీ కార్యకలాపాలను, పశువులను ఎప్పటికప్పుడు సమర్థంగా ట్రాక్ చేసేందుకు పాడి రైతులకు ఏఐ వ్యవస్థలు ఎలా ఉపయోగపడతాయి అనే సమాచారాన్ని ఆ బూత్‌లో తెలియజేశారు'' అని ప్రధాని మోదీ వివరించారు.

**జయలలిత ప్రజల గుండెల్లో నిలిచిపోతారు**

''ఫిబ్రవరి 24న తమిళనాడు మాజీ సిఎం జయలలిత జయంతి జరగబోతోంది. ఆమెకు ఈసందర్భంగా నివాళులు అర్పిస్తున్నాను. అమ్మ జయలలిత తమిళనాడు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు. కేరళకు చెందిన మామాంగం సంప్రదాయానికి శతాబ్దాల చరిత్ర ఉంది. 250 ఏళ్ల తర్వాత మళ్లీ ఆ సంప్రదాయం కేరళలో జీవం పోసుకుంది. ఇది హర్షించే విషయం'' అని ప్రధాని మోదీ చెప్పారు.

## ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంకులో భారీ మోసం

### గోల్‌మాల్ వ్యవహారం విలువ రూ.590 కోట్లు

**ముంబయి:** ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంకులో భారీ మోసం జరిగింది. చండీగఢ్ నగరంలోని ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంకుకు చెందిన ఒక బ్రాంచీలో జరిగిన ఈ గోల్‌మాల్ వ్యవహారం విలువ రూ.590 కోట్ల దాకా ఉందని తెలిసింది. ఈ బ్రాంచీకి చెందిన కొంత మంది ఉద్యోగులే ఈ మోసానికి పాల్పడ్డారని ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంకు వెల్లడించింది. ఈ సమాచారాన్ని ఫిబ్రవరి 21న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ)కు తెలియజేసింది. దీనిపై పోలీసులకూ ఫిర్యాదు చేశామని తెలిపింది. తమ బ్యాంకులో ఉన్న హరియాణా రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలు, ఇతర వ్యక్తులు, సంస్థల ఖాతాలలో మోసపూరిత, అనధికారిక లావాదేవీలు జరిగాయనే ప్రాథమిక సమాచారం ఉందని ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంకు పేర్కొంది. ప్రస్తుతం ఈ అన్ని ఖాతాల లావాదేవీలపై అంతర్గత సమీక్ష చేస్తున్నామని, అది పూర్తయ్యాక ఎంత మొత్తంలో ఆర్థిక మోసం జరిగింది అనేది నిర్దిష్టంగా తెలుతుందని చెప్పింది. ఖాతాల్లోని లావాదేవీల సమాచారం, ఖాతాదారులు చేసే క్లెయిమ్‌లు, రికవరీ అయ్యే నగదును కలుపుకొని ఈ ఆర్థిక మోసం విలువను నిర్ధరిస్తామని బ్యాంకు స్పష్టం చేసింది. ఈ ఆర్థిక మోసం విలువ రూ.590 కోట్ల దాకా ఉంటుందనే అంచనాకు వచ్చినట్లు ఆర్‌బిఐకు ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంకు తెలియజేసింది.

## యుపిలో అవినీతి, దుష్టపాలన పెచ్చుమీరుతోంది

### రాష్ట్రంలో బిజెపి చేసిన అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదు

### సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ విమర్శ

**లక్నో :** ఉత్తరప్రదేశ్‌లో బిజెపి ప్రభుత్వంపై సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ తీవ్రంగా మండిపడ్డారు. రాష్ట్రంలో అవినీతి, దుష్పరిపాలన పెచ్చుమీరిందని ఆరోపించారు. అదే సమయంలో బాధలు పెరిగేకొద్దీ పిడిఎ బలపడుతుందని ఉద్ఘాటించారు. వెనుకబడిన (పిచ్‌డే), దళిత, మైనారిటీ (అల్పసంఖ్యాక్) వర్గాలను సూచించడానికి అఖిలేశ్ తరుతూ పిటిఎ అనే పదాన్ని ఉపయోగిస్తారు. ఆదివారం లక్నోలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో యాదవ్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వ అభివృద్ధి పనులను ప్రశ్నించారు. తమకు ఎక్కడా అభివృద్ధి కనిపించడం లేదని, అది ఎక్కడ ఉందని నిలదీశారు. వేస్తున్న పైపులైన్లు అవినీతి పైపులైన్లు అని అన్నారు. మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో అక్రమాలు జరిగాయని, నాణ్యత లేని పనుల కారణంగా నీటి ట్యాంకులు పగిలిపోతున్నాయని, క్షేత్రస్థాయిలో అవినీతి స్పష్టంగా కనిపిస్తుందని ఆయన ఆరోపించారు. ఈ నెల చివర్లో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రతిపాదించిన జపాన్ పర్యటనను విమర్శిస్తూ 'ముఖ్యమంత్రి జపాన్ వెళ్తున్నారని, కానీ క్యోటోకు వెళ్లడం లేదని విన్నాను. ఆయన అక్కడికి వెళ్లి ఇక్కడ ఏమి చేయాలో, గత 10 సంవత్సరాలలో ఆయన ఏమి చేయలేకపోయారో చూడాలి' అని అన్నారు. 2014లో ఉత్తరప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన తర్వాత, భారతీయ జనతా పార్టీ (బిజెపి) వారణాసిని క్యోటో తరహా నగరంగా మారుస్తామని ప్రకటించిందని ఎద్దేవా చేశారు. బిజెపి నేతృత్వంలోని కేంద్రం ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను ప్రస్తావిస్తూ, ప్రతిపాదిత బుల్లెట్ రైలు ఖర్చు ప్రాథమిక అంచనా నుండి



బాగా పెరిగిందని యాదవ్ అన్నారు. టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) గురించి మాట్లాడుతూ, ఆవిష్కరణలు, స్టార్టప్‌లు నినాదాలుగా పనిచేయడం కంటే ప్రజల నిజమైన సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టాలని యాదవ్ అన్నారు. గత ఎస్పీ పాలనలో రాష్ట్రంలో, ముఖ్యంగా నోయిడాలో ప్రారంభించిన పారిశ్రామిక విధానాలను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రీబ్రాండింగ్ చేస్తోందని ఆయన ఆరోపించారు కొత్త పెట్టుబడులు క్షేత్రస్థాయిలో కనిపించడం లేదని పేర్కొన్నారు.

## ఐదు సీట్లు ఇవ్వండి : ఐయుఎంఎల్

**చెన్నై :** తమిళనాడులో ఏప్రిల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆయా పార్టీలు సీట్ల పంపకాలపై దృష్టి సారించాయి. తమకు ఐదు సీట్లు ఇవ్వాలని ఐయుఎంఎల్ అధ్యక్షుడు ఖాదర్ మొహిద్దీన్ ఆదివారం డిఎంకె విజ్ఞప్తి చేశారు. కూటమిలో కూటమిలో విస్తృత ముస్లిం ప్రాతినిధ్యం కావాలని ఐయుఎంఎల్ నాయకుడు పేర్కొన్నారు. శాసనసభలో తగినంత బలాన్ని కూడగట్టుకునేందుకు



డిఎంకె గొడుగు కింద వివిధ ముస్లిం సంస్థలకు 16 నియోజకవర్గాలను కేటాయించాలని పేర్కొన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికలకు డిఎంకె లౌకిక ప్రగతిశీల కూటమికి నాయకత్వం వహిస్తుంది. టిఆర్ బాలు నేతృత్వంలోని డిఎంకె కమిటీతో మొదటి రౌండ్ సీట్ల పంపకాల చర్చల తర్వాత ఖాదర్ విలేకరులతో మాట్లాడుతూ ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) పాత్రను కేవలం ఒక రాజకీయ సంస్థ కంటే ఎక్కువ అని నొక్కిచెప్పారు, దీనిని తమిళనాడులో 60 లక్షలకు పైగా ముస్లిం ఓటర్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న 'సమాజ ఆధారిత రాజకీయ పార్టీ'గా అభివర్ణించారు. 'కలైంగర్ (ఎం కరుణానిధి) హయాంలో, ఆయన ఐయుఎంఎల్‌కు ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలను ఇచ్చారు. ప్రస్తుత డిఎంకె నాయకత్వాన్ని అదే సంఖ్యలో కేటాయించాలని మేము అభ్యర్థించాము' అని అన్నారు. అయితే కూటమిని మరింత బలోపేతం చేయడానికి డిఎండికె వంటి కొత్త అభ్యర్థులను చేర్చుకోవాల్సిన అవసరాన్ని డిఎంకె నాయకత్వం యోచిస్తుండగా, నాలుగు సీట్లు కూడా ఆమోదయోగ్యమని మొహిద్దీన్ అన్నారు. కాగా, గతంలో ఇచ్చిన మూడు సీట్లలో పార్టీ గెలవలేకపోయినందున, అంతకంటే తక్కువగా రెండు సీట్లలో పోటీ చేయడాన్ని ఐయుఎంఎల్ పరిగణించాలని డిఎంకె సూచించిందని ఖాదర్ చెప్పారు.

## 25,26 తేదీల్లో మోదీ ఇజ్రాయెల్ పర్యటన


### బుధవారం సాయంత్రం పార్లమెంటులో ప్రధానోపన్యాసం

**జెరూసలెం:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 25,26 తేదీలలో ఇజ్రాయెల్‌లో పర్యటించనున్నారు. ఆర్థిక, భద్రత, దౌత్య సహకారాల విస్తృతిపై రెండు దేశాలు దృష్టిపెట్టాయి. 25వ తేదీ బుధవారం సాయంత్రం ఇజ్రాయెల్ పార్లమెంటు కెన్సెట్‌లో మోదీ ప్రధానోపన్యాసం చేస్తారు. 2023 అక్టోబరులో గాజాపై ఇజ్రాయెల్ దాడి చేసిన తర్వాత చాలామంది పశ్చి మ దేశాల నాయకులు ఇజ్రాయెల్‌లో పర్యటించినప్పటికీ గ్లోబల్ సౌత్ నుండి చాలా కొ ద్దిమంది నాయకులు మాత్రమే ఇజ్రాయెల్ లో పర్యటించిన పూర్వరంగంలో మోదీ ప ర్యటనకు అత్యధిక ప్రాధాన్యత వచ్చింది. తా మిద్దరం (నెతన్యాహూ–మోదీ) అన్ని రంగాలలో సహకార విస్తృతి గురించి చర్చలు జ రుపుతామని వారాంతపు మంత్రివర్గ సమావేశ ప్రారంభం సందర్భంగా నెతన్యాహూ చెప్పారు. భారత్ అంటే ఏదో చిన్న దేశం కాదని, ఆ దేశంలో 140 కోట్లమంది జనాభా ఉన్నారని, ఎంతో శక్తిమంతమైన దేశమని అన్నారు. హైటెక్, కృత్రిమ మేధ, క్వాంటమ్ రంగాలలో కూడా సంబంధాలవృద్ధి గురించి చర్చిస్తామన్నారు. గాజా వెస్ట్‌బ్యాంక్‌లో ఆక్రమణలను చట్టబద్ధం చేస్తూ భూముల రిజిస్ట్రేషన్లకు ఇజ్రాయెల్ పార్లమెంటు ఒక శాసనం చేసిన తర్వాత ఐక్యరాజ్యసమితి సహా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు తీవ్రస్థాయిలో నెతన్యాహూ చర్యలను దుమ్మెత్తిపోశారు. ఇలా 100 దేశాలు ఇజ్రాయెల్ చర్యలను తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇలా వ్యతిరేకించిన దేశాలలలో భారత్ కూడా ఉంది. ఈ విమర్శలు వెలువడిన కొద్ది రోజుల తర్వాత మోదీ ఇజ్రాయెల్ పర్యటన వార్త బయటకు వచ్చింది. 2017లో ఇజ్రాయెల్‌లో మోదీ మొదటిసారి పర్యటించారు. ఈ విధంగా ఒక భారత ప్రధానమంత్రి ఇజ్రాయెల్ పర్యటన అదే మొదటిసారి. ఇప్పుడు మళ్ళీ రెండోసారి పర్యటనకు వెళుతున్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇజ్రాయెల్–భారత్ మధ్య రక్షణ, భద్రత, వాణిజ్యం, సాంకేతిక రంగాలలో సంబంధాలు బలపడుతున్నాయి. మౌలికంగా పాలస్తినా ప్రజలకు సంఘీభావం, పాలస్తినా ఆవిర్భావమే భారత్ విదేశాంగ విధానంలోఅనేక దశాబ్దాలుగా ప్రధానాంశంగా ఉంటూ వస్తోంది. స్వతంత్ర పాలస్తినా విముక్తి పోరాటాకు ఆది నుండీ భారతదేశం మద్దతు ఇస్తూ వస్తోంది. అడాల్ఫ్ హిట్లర్ కారణంగా యూరప్ నుండి నిరాశ్రయులైన యూదులకు పాలస్తినాలో మాతృభూమిని ఏర్పాటు చేస్తామని 1917లో బ్రిటన్ చేసిన బాల్ఫోర్ డిక్లరేషన్‌ను భారత్ సహా ప్రపంచదేశాలు వ్యతిరేకించాయి. 1938 నవంబరు 26వ తేదీన 'హరిజన్' పత్రికలో మహాత్మాగాంధీ రాసిన వ్యాసంలో ''ఇంగ్లాండ్ ఇంగ్లీషు వారిదే, ఫ్రాన్స్ ఫ్రెంచ్ ప్రజలదే, అదేవిధంగా పాలస్తినా అరబ్బువాసులదే'' అని ప్రకటించారు.

### మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఖరారుపై

## భారత్–అమెరికా చర్చలు తాత్కాలిక వాయిదా

**న్యూఢిల్లీ:** మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు సోమవారం తలపెట్టిన భారత్–అమెరికా సమావేశాలు వాయిదా పడ్డాయి. రెండు దేశాలకు చెందిన ప్రధాన సంప్రదింపుకర్తలు నిర్ణీత ప్రకారం ఫిబ్రవరి 23 నుండి మూడు రోజులు వాషింగ్టన్‌లో సంభాషణలు చేయాల్సి ఉంది. అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ట్రంప్ ప్రభుత్వానికి పెద్ద విఘాతంగా మారడంతో ఆయన చిక్కుల్లో పడ్డారు. ఈ పరిస్థితులు చక్కదిద్దుకుని కొన్ని ప్రశ్నలకు సమాధానాలు సిద్ధం చేసుకోవాలంటే అమెరికా వాణిజ్య శాఖ ప్రదానాధికారులకు కొంత గడువు అవసరం. అందువల్ల ఈ సమావేశం ఎప్పుడు జరుగుతుందనే విషయం తర్వాత ప్రకటిస్తారు. అమెరికా వాణిజ్యమంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి,భారత్ వాణిజ్యమంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి దర్పణ్ జైన్ మధ్య జరగాల్సిన చర్చలు పరస్పర ప్రయోజనాలకు అనుగుణంగా మరో తేదీన జరుగుతాయని ఢిల్లీలోని కేంద్ర వాణిజ్యశాఖ వర్గాలు ఆదివారం ప్రకటించాయి. అమెరికాతో వ్యాపారం చేసే వాణిజ్యభాగస్వామ్య దేశాలపై ట్రంప్ విధించిన దిగుమతి సుంకాల భారం చెల్లుబాటు కాదంటూ ఫిబ్రవరి 20వ తేదీన అక్కడి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రిపబ్లికన్ ప్రభుత్వానికి ఇంటా బయటా తలవంపులుగా మారింది. ఈ తీ





ర్పు చెప్పిన ఆరుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులపై ట్రంప్ విరుచుకుపడ్డారు. వ్యక్తిగత దూషణలు చేశారు.1977 నాటి ఐఇఇపిఎ (అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం) ప్రకారం దిగుమతి సుంకాలను పెంచడం వీలు కాదని కోర్టు స్పష్టం చేయడంతో ట్రంప్ ప్రత్యామ్నాయ మార్గం ఎంచుకున్నారు. ఇప్పటివరకూ ఎవరూ ఉపయోగించని 122వ సెక్షన్‌ను బయటకు తీసి కోర్టు రద్దుచేసిన సుంకాలస్థానంలో 15 శాతం కొత్త సుంకాలను అమలులోకి తెచ్చారు. ఈ సుంకాలు నిరాటంకంగా 155 రోజులు అమలులో ఉంటాయి. 20వ తేదీన మొదట 10 శాతం విధించిన సుంకాలను తర్వాత గరిష్టంగా 15 శాతానికి పెంచారు. కోర్టు తీర్పును, తదుపరి పరిణామాలను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తున్నట్లు భారత ప్రభుత్వం కూడా ప్రకటించింది. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు, ఖజానాను నింపేందుకు చేపట్టిన కీలక ఎజెండాకు సుప్రీంకోర్టు తీర్పుతో ఎదురుదెబ్బ తగిలింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జాన్ రోబెర్ట్స్ నాయకత్వాన విస్తృత ధర్మాసనం 6–3 మెజారిటీతో ట్రంప్‌కు వ్యతిరేకంగా తీర్పు చెప్పడంతో అనేక దేశాలు దీనిని ఒక ఉపశమన చర్యగా భావిస్తున్నాయి.గత ఏడాది ఆగస్టు నెలలో ట్రంప్ భారత్‌పై 25 శాతం సుంకాలు విధించారు. కోర్టు తీర్పు నేపథ్యంలో రెండు దేశాలమధ్యా ఈనెలారంభంలో కుదిరిన వాణిజ్య ఒప్పందంలో ఎలాంటి మార్పులూ ఉండబోవని ట్రంప్ ప్రకటించారు. కానీ ఈ మొదటిదశ ద్వైపాక్షిక ఒప్పందాన్ని ఖరారు చేయడానికి భారత్–అమెరికా వాణిజ్య ప్రధాన సంప్రదింపుకర్తలు సోమవారం ప్రారంభించాల్సిన చర్చలు పై కారణాలవద్ద వాయిదా పడ్డాయి. 2021–25 సంవత్సరాలలో భారత్‌కు అమెరికా వస్తువులలో అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా కొనసాగింది. భారత్ మొత్తం ఎగుమతులలో అమెరికా వాటా 18 శాతంగా ఉండగా, దిగుమతుల్లో 6.22 శాతంగా ఉంది. మొత్తం 10.73 శాతం మేరకు ద్వైపాక్షిక వాణిజ్యం జరిగింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ద్వైపాక్షిక వాణిజ్యం 186 బిలియన్ డాలర్ల మేరకు చేరుకుంది. వీటిల్లో 86.5 బిలియన్ డాలర్ల మేరకు ఎగుమతులు ఉండగా, 45.3 బిలియన్ల మేరకు దిగుమతులు ఉన్నాయి.

# సాహిత్య ధోరణి మార్చిన సోషలిస్టు రియలిజం

ప్రపంచ సాహిత్య–కళా లోకాన్ని 20వ శతాబ్దంలో ప్రభావితం చేసిన అత్యంత శక్తివంతమైన ధోరణులలో సోషలిస్టు రియలిజం ఒకటి. సాహిత్యంలో సోషలిస్టు రియలిజం అనేది ఒక నిర్దిష్ట సౌందర్యశాస్త్ర, సిద్ధాంత దృక్పథం. ఇది ప్రధానంగా మార్క్సిస్టు భావజాలానికి ఆధారంగా అభివృద్ధి చెందింది. సామాజిక వాస్తవాలను వర్గపోరాట దృష్టితో చిత్రిస్తూ, కార్మిక వర్గం, శ్రమజీవుల జీవితం, వారి పోరాటాలు, ఆశలు, సామూహిక చైతన్యం వంటి అంశాలను కేంద్రీకరించడం దీనికి లక్షణం. వ్యక్తిగత భావోద్వేగాల కంటే సామాజిక మార్పు, చరిత్రాత్మక గమనం, సమాజ నిర్మాణ శక్తులపై దృష్టి పెట్టడం ఇందులో ముఖ్యమైనది. ఈ విధానం వాస్తవాన్ని కేవలం యథాతథంగా చూపడమేగాక, అది సామాజికవాద భవిష్యత్తు వైపు కదులుతున్న చరిత్రాత్మక ప్రక్రియగా ప్రతిబింబిస్తుంది. సోషలిస్టు రియలిజం ప్రధాన లక్షణాలలో మొదటిది వర్గచైతన్యం. పాత్రలు సాధారణంగా కార్మికులు, రైతులు, శ్రమజీవులు. రెండవది చరిత్రాత్మక ఆశావాదం. కథలో కష్టాలు ఉన్నా, చివరికి సమాజం పురోగమిస్తుంది అనే భావన ఉంటుంది. మూడవది సామూహికత. వ్యక్తి కంటే సమూహం ముఖ్యం. నాలుగవది సిద్ధాంత స్పష్టత. రచనలో సామాజిక అన్యాయంపై విమర్శ ఉండాలి. దానికి ప్రత్యామ్నాయంగా సామాజికవాద మార్గం సూచించాలి. సామాజిక వాస్తవ దృక్కోణంలో చేసిన రచనలు కేవలం కథలుగానే మిగిలిపోవు. అవి సమాజ మార్పు పట్ల ఒక ఆవశ్యకతను సూచిస్తాయి. భారతీయ సందర్భంలో కూడా సామాజిక వాస్తవవాద ధోరణులు కనిపిస్తాయి. సోవియట్ యూనియన్‌లో ప్రారంభమైన ఈ సాహిత్య రూపం, కమ్యూనిస్టు సిద్ధాంతాలను కళ ద్వారా ప్రజల్లో వ్యాప్తి చేయడం, కార్మిక వర్గం పాత్రను మహోన్నతంగా చూపించడం, సమాజవాద భావజాలాన్ని కళా సృష్టిలో ముఖ్యంగా స్థాపించడం వంటి లక్ష్యాలతో అభివృద్ధి చెందింది. సోషలిస్టు రియలిజం అంటే, సమాజవాద విలువలను అలంకరించడం... కార్మికులు, రైతులు, సాధారణ ప్రజలను సాహిత్య హీరోలుగా చూపించడం.. మార్క్సిస్టు–లెనినిస్టు సిద్ధాంతాలను కళా రూపంలో ప్రతిఫలించడం.. ఆర్థిక, రాజకీయ పోరాటాల వాస్తవాలను సామాజిక మార్పు కోణంలో చిత్రించడం వంటి లక్ష్యాలతో ఏర్పడిన సిద్ధాంతపరమైన సాహిత్య–కళా ఉద్యమం. 1932లో స్టాలిన్ కాలంలో, నాటి సోవియట్ ప్రభుత్వం దీనిని అధికారికంగా రాష్ట్ర సిద్ధాంతంగా ప్రకటించి కళా–సాహిత్యాన్ని ఒక రాజకీయ ఆయుధంలా ఉపయోగించింది. సోషలిస్టు రియలిజం ఆవిర్భావానికి తాత్విక ఆధారాలుగా కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్ ఆలోచనలను ప్రముఖంగా పేర్కోవాలి. వర్గపోరాటం, దోపిడీ, కార్మిక వర్గ విముక్తి గురించి వారు చెప్పిన సిద్ధాంతాలే సోషలిస్టు రిజలిజం ధోరణికి మూలం. సాహిత్యం కార్మిక వర్గాన్ని చైతన్యపరచాలి అనే భావనకు సోషలిస్టు రియలిజం కూడా జతకలిసింది. సాహితీకారుల బాధ్యతను పెంచింది. లెనిన్ ప్రకారం కళ అనేది శ్రామిక విప్లవానికి దోహదం పడాలి. ప్రజల వాస్తవ జీవితం, వారి పోరాటాలు, భవిష్యత్తు ఆశలు తదితర అంశాలన్నీ సాహిత్యంలో ప్రతిబింబించాలని అంటాడు లెనిన్. సోషలిస్టు రియలిజం సాహిత్యానికి రష్యన్ రచయిత మాక్సిమ్ గోర్కీని ఆద్యుడిగా పేర్కోవచ్చు. ఆయన రచనలు పేదలు, కార్మికుల బాధలను కళ్లకుకడతాయి. గోర్కీ రచించిన 'మదర్' ప్రపంచ సోషలిస్టు సాహిత్యంలో ఒక ప్రధాన గ్రంథం. 'సాహి త్యం ప్రజలను విముక్తి వైపు నడిపించే శక్తి' అంటాడు గోర్కీ. అనడమే కాదు.. అదే సూత్రాన్ని ఆచరించి చూపించాడు.

రేమండ్ విలియమ్స్ సోషలిస్ట్ రియలిజం వ్యవస్థాపక సూత్రాలుగా మూడు అంశాలను గుర్తిస్తాడు. అవి 'పార్టినోస్ట్' లేదా పార్టీ యొక్క కార్మికవర్గ లక్ష్యం పట్ల నిబద్ధత, ప్రజాదరణ యొక్క 'నరోద్నోస్ట్', దిగువ తరగతి ప్రయోజనాల పట్ల రచయిత నిబద్ధతను తెలిపే 'క్లాసోవోస్ట్'. పార్టినోస్ట్ ఆలోచన వ్లాదిమిర్ లెనిన్ వ్యాసం, పార్టీ ఆర్గనైజేషన్ అండ్ పార్టీ లిటరేచర్ (1905) ఆధారంగా రూపొందింది. ఇది కార్మికవర్గాన్ని దోపిడీ నుండి విముక్తి చేయాలనే పార్టీ లక్ష్యం పట్ల రచయితకు ఉన్న నిబద్ధతను పునరుద్ఘాటిస్తుంది. నరోద్నోస్ట్ కళాకృతికి దక్కిన ప్రజాదరణ పొందిన సరళతను సూచిస్తుంది. పారిస్ మాన్యుస్క్రిప్ట్స్‌లో మార్క్స్ పెట్టుబడిదారీ సమాజంలో మానసిక, శారీరక భావాలను వేరుచేయడం వల్ల ఉద్భవించే పరాయీకరణను సూచిస్తాడు. గతంలో ఫ్యూడలిజం కింద కుటీర పరిశ్రమలలో నిమగ్నమైన కార్మికులు తమంతటతాముగా వివిధ వస్తువులను ఉత్పత్తి చేసేవారు. ఉత్పత్తికి సంబంధించిన అన్ని కార్యకలాపాలు ఒకే వ్యక్తుల పర్యవేక్షణలో ఒకే చోట జరిగేవి. కానీ, పెట్టుబడిదారీ విధానంలో కార్మికులు తమ ఉత్పత్తులపై నియంత్రణ కోల్పోయి వివిధ భాగాల ఉత్పత్తిలో నిమగ్నమై తమ సొంత పని నుంచి బలవంతంగా దూ రం కావాల్సి వచ్చింది. కాబట్టి, జానపద కళ మాత్రమే ప్రజల కళగా




మనుగడ సాగించింది. నరోద్నోస్ట్ అనే భావన ప్రజా కళ యొక్క ఈ గుణాన్ని పునరుద్ఘాటిస్తుంది. ఇది ప్రజలకు అందుబాటులో ఉంటుంది. వారు కోల్పోయిన సమగ్రతను పునరుద్ధరించాలని కోరుకుంటుంది. క్లాసోవోస్ట్ అనేది కార్మికవర్గ ప్రయోజనాల పట్ల రచయిత నిబద్ధతను సూచిస్తుంది. ఇది ఒక నిర్దిష్ట తరగతి పట్ల రచయిత యొక్క స్పష్టమైన విధేయతకు సంబంధించినది కాదు. అయితే, సామాజిక పరివర్తనను చిత్రీకరించే రచయిత స్వాభావిక సామర్థ్యంతో సంబంధం కలిగి ఉంటుంది. కాగా, సోవియట్ యూనియన్ అధికారిక సాహిత్య విధానాన్ని ప్రకటించడంతో 'మాస్కో లైన్' ప్రజాదరణ పొందింది. అంతర్జాతీయంగా కమ్యూనిస్టు వర్గాల ఆమోదం దక్కించుకుంది. ఫలితంగా, సాహి త్యం, ఆర్థిక శాస్త్రం మధ్య ప్రత్యక్ష సంబంధంపై విస్తృత చర్చలు ప్రారంభమయ్యాయి. అప్పటి వరకూ ఉన్న ఆలోచనలను అనుసరించి, కొంత మంది రచయితలుతాము మేధోపరమైన పరిమితిలో చిక్కుకున్నట్టు గుర్తించారు. ఫలితంగా సామాజిక అంశాలకు, సమాజానికి, ఆర్థిక పరిస్థితులకు, జీవన విధానాలకు ప్రాధాన్యం పెరిగింది. వాస్తవికతను ప్రదర్శించని రచనలకు ఆదరణ తగ్గింది. అయితే, కొంత మంది సాహితీకారులు ఈ విధానాన్ని అత్యంత కఠినమైన సాహితీ ప్రక్రియగా చూశారు. ఇలాంటి పరిస్థితుల్లోనే క్రిస్టోఫర్ కాడ్వెల్ రాసిన 'ఇల్యూజన్ అండ్ రియాలిటీ' సాహిత్యంలో కొత్త కోణాన్ని ఆవిష్కరించింది. ఈ గ్రంథంలో, అతను సాహిత్యాన్ని, కళారూపాలను సామాజిక, ఆర్థిక పరిస్థితుల ప్రకారం ఎలా అర్థం చేసుకోవాలనే ప్రశ్నలకు సమాధానమిస్తాడు. బేస్ (ఆర్థిక నిర్మాణం), సూపర్‌స్ట్రక్చర్ (సంఘటనా, రాజకీయ, మత, కళా నిర్మాణం) మధ్య పరస్పర సంబంధాన్ని వివరిస్తాడు. ఈ ఆలోచన సహజంగానే టెర్రీ ఈగిల్టన్ వంటి మార్క్సిస్టు విమర్శకులకు నచ్చలేదు. ఈగిల్టన్ ప్రకారం కళ, చట్టం, రాజకీయాలు, మతం వంటి మూలకాలు దేనికదే సొంత అభివృద్ధి వేగాన్ని కలిగి ఉంటాయి. ప్రతి మూలకం దాని అంతర్గత పరిణామాలతో అభివృద్ధి చెందుతుంది. సమాజాన్ని కేవలం వర్గ పోరాటం లేదా ఆర్థిక పరిస్థితి ప్రతిబింబమని మాత్రమే చూడరాదు. అంటే, సూపర్‌స్ట్రక్చర్ స్వతంత్రంగా కూడా రూపకల్పన, అభివృద్ధి, మార్పును అనుభవిస్తుంది. ఈగిల్టన్ అభిప్రాయాల్లో అతి కొద్ది భాగం ఐన్‌స్టీన్ రాసిన 'సైన్స్ అండ్ రియాలిటీ'తో కలుస్తాయి. కానీ, ఐన్‌స్టీన్ తార్కిక ఆలోచనకు అధిక ప్రాధాన్యం ఇచ్చాడు. ఈగిల్టన్ మాత్రం అన్ని అంశాలకు సమప్రాతినిధ్యం ఇచ్చాడు. అతని అభిప్రాయాలను చాలా మంది మార్క్సిస్టులు తోసిపుచ్చారు. సూపర్‌స్ట్రక్చర్‌కు ఉత్పత్తి విధానం (బేస్) కీలకమని, దానిని విస్మరించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. హంగేరియన్ మార్క్సిస్ట్ తత్వవేత్త, విమర్శకుడు జార్జ్ లుకాక్స్ 19వ శతాబ్దపు వాస్తవికతను ఒక నమూనాగా భావించి, వాస్తవిక రచనలు సమాజంలోని వైరుధ్యాల, వర్గ విభజనల లోతైన మోడల్స్‌ను బయటకు తెస్తాయని నమ్మాడు. ఐరోపాలో బలపడిన మార్క్సిస్టు సిద్ధాంతాలపై దోపిడీ వర్గాలు ఉక్కుపాదం మోపడం ఆనవాయితీగా మారింది. మార్క్సిస్టు దృక్పథం ఆధారంగా ఏర్పడిన సోషలిస్టు రియలిజంపై విమర్శలు, ప్రతివిమర్శలు ఎలావున్నా, ప్రజల జీవితాలు ఆర్థిక పరిస్థితులతో ముడిపడిన వైనాన్ని యావత్ ప్రపంచం గుర్తించింది. పెట్టుబడిదారీ దోపిడీ వర్గం ప్రజలను అచేతనులను చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నప్పటికీ, మార్క్సిస్టు ఆలోచనా విధానం ప్రగతిశీల సాహిత్యానికి మూలకంగా భాసిల్లుతునే ఉంది. ఐరోపా దేశాల్లో మార్క్సిస్టు దృక్పథం అనేకానేక ఒత్తిళ్ల మధ్య కూడా ఉనికిని కాపాడుకుంటునే ఉంది. ఎంతో మంది రచయితలు 'సోషలిస్టు రియలిజం' ధోరణిలో సాహితీ సృష్టి చేశారు... ఇప్పటికీ చేస్తునే ఉన్నారు. అయితే, అలాంటి వారి సంఖ్య తక్కువగా ఉండడం దురదృష్టకరం. వివిధ ఒత్తిళ్లకు లొంగిపోతున్న రచయితలు ఇకనైనా పంథాను మార్చుకొని, ప్రజాహిత సాహిత్యాన్ని అనుసరించడానికి ప్రయత్నించాలి. సాహిత్యానికి నిజమైన అర్థాన్ని ఇవ్వాలి. ఎందుకంటే, ఇలాంటి రచనల్లోనే శ్రమజీవుల జీవితాన్ని కేం ద్రంగా తీసుకొని సమాజ నిర్మాణాన్ని విశ్లేషించే ప్రయ త్నం కనిపిస్తుంది. సోషలిస్టు రియలిజం పద్ధతి రాజకీయ ప్రచారం కాదు... ఒక సౌందర్యశాస్త్ర దృక్పథం. వాస్తవాన్ని శాస్త్రీయ సామాజిక విశ్లేషణతో చూడాలని సూచిస్తుంది. అయితే దీనిపై విమర్శలు కూడా ఉన్నా యి. కొందరు విమర్శకులు ఇది అధికార అనుకూల సాహిత్యంగా మారిపోయిందని, సృజనాత్మక స్వేచ్ఛను పరిమితం చేసిందని అంటారు. అయినప్పటికీ, శ్రమజీవుల స్వరాన్ని ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంలో దీనికి ఉన్న పాత్రను నిర్లక్ష్యం చేయలేం. ఆధునిక సాహిత్యంలో ఈ పద్ధతి ప్రాముఖ్యత ఇంకా కొనసాగుతోంది. గ్లోబలైజేషన్, పెట్టుబడిదారీ వ్యవస్థ విస్తరణ, ఆర్థిక అసమానతలు పెరుగుతున్న సందర్భంలో వర్గ విశ్లేషణ అవసరం మరింత స్పష్టమైంది. కార్మికుల వలసలు, వ్యవసాయ సంక్షోభం, నగరీకరణ వల్ల ఏర్పడిన సమస్యలు వంటి అంశాలను అర్థం చేసుకోవడానికి సోషలిస్టు రియలిజం ఒక ఉపయుక్త దృష్టి కోణం అందిస్తుంది. సమకాలీన రచయితలు పూర్తిగా సోషలిస్టు రియలిజం విధానాన్నే అనుసరించకపోయినా, సామాజిక న్యాయం, వర్గ అసమానత, శ్రమ గౌరవం వంటి అంశాలను పరిశీలించేటప్పుడు ఈ పద్ధతి ప్రభావం కనిపిస్తుంది. ఇంకా ఒక ముఖ్యమైన అంశం ఏమిటంటే, ఇది వ్యక్తిని సమాజంతో అనుసంధానిస్తుంది. వ్యక్తిగత బాధలు, సమస్యలు కూడా సామాజిక నిర్మాణాల ఫలితమే అని ఇది సూచిస్తుంది. ఈ దృక్పథం ఆధునిక సాహిత్యంలో సామాజిక బాధ్యతను పెంపొందిస్తుంది. రచయిత తన కాలంతో సంబంధం పెట్టుకొని, సమాజ మార్పులో పాత్ర వహించగలడని ఈ సిద్ధాంతం నొక్కి చెబుతుంది. సారాంశంగా చెప్పాలంటే, సోషలిస్టు రియలిజం అనేది వాస్తవాన్ని సామాజికవాద దిశలో విశ్లేషించే సాహిత్య విధానం. ఇది వర్గపోరాటం, శ్రమజీవుల గౌరవం, చరిత్రాత్మక ఆశావాదం వంటి అంశాలను కేంద్రీకరిస్తుంది. దీనిపై విమర్శలు ఉన్నప్పటికీ, సమాజ వాస్తవాలను గంభీరంగా పరిశీలించడానికి, సమకాలీన అసమానతలను విశ్లేషించడానికి ఇది ఇప్పటికీ ప్రాముఖ్యత కలిగి ఉంది.

**– సత్యశ్రీ**

## మొట్టమొదటి నవల ఏది?

ప్రపంచ సాహిత్యంలో మొదటి నవలగా ఏ రచనను పరిగణించాలి అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం లేదు. ఎందుకంటే, అది నిర్వచనంపై ఆధారపడి ఉంటుంది. ఆధునిక అర్థంలో, సమగ్ర కథన నిర్మాణం, వ్యక్తిత్వ విశ్లేషణ, సామాజిక నేపథ్యం, గద్యరూప విస్తృతి వంటి లక్షణాల ఆధారంగా పరిశీలిస్తే, జపాన్ దేశానికి చెందిన 'ది ది ఆఫ్ జెన్జీ' (11వ శతాబ్దం)ని ప్రపంచపు మొదటి నవలగా అనేక సాహిత్య పండితులు భావిస్తారు. దీన్ని మురసాకి శికిబు రచించింది. ఇందులో రాజసభ జీవితం, ప్రేమ, రాజకీయ సంబంధాలు, మానసిక సంఘర్షణలు విపులంగా చిత్రించారు. పాత్రల అంతర్ముఖ జీవితంపై ఇంత లోతైన విశ్లేషణ అప్పటివరకు అరుదు. అయితే, పాశ్చాత్య సాహిత్యంలో మొదటి ఆధునిక నవలగా స్పెయిన్‌కు చెందిన 'డాన్ క్విగ్జోట్' (1605)ను గుర్తిస్తారు. మిగెల్ డి సర్వాంటెస్ రచించిన ఈ కృతి వాస్తవికత, వ్యంగ్యం, పాత్రాభివృద్ధి వంటి లక్షణాలతో నవల ప్రక్రియకు కొత్త దిశనిచ్చింది. కాబట్టి, మొదటి నవల అనే గుర్తింపు సాహిత్య ప్రమాణాలపై ఆధారపడి మారుతుంది. అయితే, గద్యరూపంలో సమగ్ర కల్పిత కథనానికి ప్రాచీన నమూనాగా 'ది ది ఆఫ్ జెన్జీ'ని పరిగణిస్తారు.




## భాషా ఉద్యమానికి జాతీయ గుర్తింపు

భారతదేశ సాంస్కృతిక వైవిధ్యం కేవలం భాషల సంఖ్యలో మాత్రమే గాక, వాటి వెనుక ఉన్న చరిత్ర, ఆత్మగౌరవం, గుర్తింపులోనూ ప్రతిఫలిస్తుంది. ఇటీవలి కాలంలో న్యూ ఢిల్లీలో జరిగిన 'ఓల్ చికీ' లిపి శతాబ్ది ఉత్సవాల ప్రారంభంతో, ఈ సత్యం మరొకసారి దేశవ్యాప్తంగా ప్రతిధ్వనించింది. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆవిష్కరించిన ఈ వేడుక, కేవలం ఒక లిపి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంగా చూడకూడదు. కారణం, అది సంతాలి సమాజం సాంస్కృతిక స్వాభిమానానికి ఇచ్చిన అధికారిక గుర్తింపు. సంస్కృతి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్మారక నాణెం, తపాలా స్టాంపును విడుదల చేయడం, ఒక భాషా ఉద్యమానికి జాతీయ స్థాయిలో లభించిన గౌరవాన్ని సూచిస్తుంది. ఓల్ చికీ లిపి ఆవిష్కరణ వెనుక ఉన్న చరిత్రను పరిశీలించినప్పుడు, అది ఒక సామాజిక పునరుజ్జీవన ఉద్యమంగా కనిపిస్తుంది. ఒడిశాలోని మయూర్భంజ్ జిల్లాకు చెందిన పండిట్ రఘునాథ్ ముర్ము 1925లో ఈ లిపిని రూపొందించారు. ఆ సమయంలో సంతాలి భాషను రోమన్, దేవనాగరి, ఒడియా లేదా బెంగాలీ లిపుల్లో రాయడం ఆనవాయితీగా ఉండేది. కానీ ఆ విధానం భాష యొక్క స్వర నిర్మాణాన్ని పూర్తిగా ప్రతిబింబించలేకపోయింది. ఒక భాషకు తన స్వంత లిపి లేకపోవడం, దాని సాంస్కృతిక స్వతంత్రతకు ఒక లోటు. ఈ లోటును భర్తీ చేయాలనే సంకల్పంతో ముర్ము ఓల్ చికీని సృష్టించారు. ఆయన 1936లో రచించిన 'హై సెరెనా' అనేది ఈ లిపిలో రచించిన తొలి గ్రంథం. బిదుచందన్ వంటి రచనలు సంతాలి సంస్కృతిని ప్రతిబింబిస్తూ, లిపి, భాష మధ్య ఉన్న అంతర్గత అనుబంధాన్ని బలపరిచాయి. ఓల్ చికీ నిర్మాణం భాషా శాస్త్ర పరంగా ప్రత్యేకమైనది. మొత్తం 30 అక్షరాలతో కూడిన ఈ లిపి పూర్తిగా ధ్వన్యాత్మక స్వభావం కలిగినది. ప్రతి గుర్తు ఒక నిర్దిష్ట ధ్వనికి నేరుగా అనుసంధానమవుతుంది. సంతాలి భాషలో ఉన్న గ్లోటల్ స్టాప్‌లు, ప్రత్యేక స్వర రూపాలను ఖచ్చితంగా ప్రతిబింబించగల సామర్థ్యం ఈ లిపికి ఉంది. ఇది సంతాలి ఆస్ట్రోఆసియాటిక్ భాషా కుటుంబానికి చెందినది. ఈ కుటుంబానికి ప్రత్యేకమైన ధ్వన్యనుకరణ లక్షణాలను సరిగ్గా వ్యక్తపరచడానికి ఓల్ చికీ అనుకూలంగా రూపుదిద్దుకుంది. భాషా స్వరూపాన్ని సంరక్షించే సాధనంగా మారింది. ఈ లిపి భౌగోళిక వ్యాప్తి కూడా గమనించదగ్గది. జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, బిహార్, అస్సాం రాష్ట్రాలలో సంతాలి మాట్లాడే సమాజానికి ఇది ప్రధాన వ్రాత మాధ్యమంగా మారింది. ఒక భాషా సమాజం విభిన్న రాష్ట్రాలలో విస్తరించి ఉన్నప్పటికీ, ఓల్ చికీ వారిని ఒక సాంస్కృతిక బంధంతో కలిపింది. లిపి ద్వారా భాష పాఠశాలల్లో ప్రవేశించింది, సాహిత్య సృష్టికి మార్గం ఏర్పడింది, సామాజిక చైతన్యం పెరిగింది. రాజ్యాంగ పరంగా కూడా సంతాలి భాషకు లభించిన గుర్తింపు ఒక మైలురాయి. 2003లో జరిగిన 92వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా సంతాలి భాషను భారత రాజ్యాంగం ఎనిమిదవ షెడ్యూల్‌లో చేర్చడం, భాషా సమానత్వానికి ఒక బలమైన అడుగు. 2025, డిసెంబర్‌లో భారత రాజ్యాంగాన్ని సంతాలి భాషలో, ఓల్ చికీ లిపిలో అనువదించడం, ప్రజాస్వామ్య న్యాయానికి ఒక చారిత్రక ముందడుగు. రాజ్యాంగం ప్రతి పౌరుడి హక్కులు మరియు బాధ్యతలను నిర్వచించే పత్రం. అది ఒక సమాజానికి అందుబాటులో ఉండాలంటే, వారి భాషలో ఉండాలి. ఈ అనువాదం సంతాలి సమాజానికి రాజ్యాంగంతో నేరుగా అనుసంధానం కల్పించింది. ఇది భాషా న్యాయానికి ప్రతీక. ఒక లిపి కేవలం అక్షరాల సమాహారం కాదని, అది ఒక సమాజం యొక్క చరిత్ర, సంస్కృతి, స్వాభిమానానికి ప్రతీక అనీ ఓల్ చికీ శతాబ్ది వేడుకలు మనకు ఒక విశాలమైన సందేశాన్ని అందిస్తున్నాయి. పండిట్ రఘునాథ్ ముర్ము చేసిన ఆవిష్కరణ ఒక వ్యక్తిగత కృషి అయినప్పటికీ, అది సమాజాన్ని పునరుద్ధరించిన ఉద్యమంగా మారింది. భాషను సంరక్షించడం అనేది కేవలం సంస్కృతిని కాపాడటం కాదు... అది భవిష్యత్తును నిర్మించడం. ఓల్ చికీ శతాబ్ది ఉత్సవం, భాషా గౌరవం, జాతీయ ఐక్యత మధ్య ఉన్న సమన్వయాన్ని ప్రతిబింబిస్తుంది. భారతదేశం వంటి బహుభాషా దేశంలో, ప్రతి భాషా సమాజం తన స్వరాన్ని వినిపించుకునే హక్కు కలిగి ఉంది. ఓల్ చికీ కథ, ఆ హక్కు సాధ్యమని, సమష్టి చైతన్యంతో అది స్థిరపడగలదని చూపిస్తుంది.

# మానవత్వ పరిమళం.. హేమలతా లవణం..

ప్రముఖ కవి గుర్రం జాషువా కుమార్తె... తెలుగునాట నాస్తిక ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన గోరా (గోపరాజు రామచంద్రరావు) కోడలు.. మరో నాస్తికవాది గోపరాజు లవణం భార్య... ఇన్ని ప్రత్యేకతలు ఉన్నాయి కాబట్టే, హేమలతా లవణం పేరు తెలుగు సమాజ చరిత్రలో సామాజిక బాధ్యత, మానవతా దృక్పథం, రచనా చైతన్యం అనే మూడు అంశాలతో విడదీయరాని సంబంధం కలిగి ఉంది. ఆమె సంఘసేవకురాలు. ఆలోచనతో కూడిన కార్యచరణకు ప్రతీక. తండ్రి జాషువా నుంచి సమానత్వ భావనను, సమాజంలోని అణచివేతలపై సున్నిత దృష్టిని వారసత్వంగా అందుకుంది. 1932 ఫిబ్రవరి 26న గుంటూరు జిల్లా వినుకొండలో జన్మించిన హేమలత, విద్యలో ప్రతిభ కనబరిచి, మద్రాసు క్వీన్స్ కళాశాలలో బిఎ పూర్తి చేసి బంగారు పతకం సాధించింది. విద్య ఆమెకు వ్యక్తిగత పురోగతికో సాధనం... సామాజిక మార్పుకు ఆయుధం... నాస్తికత్వం, ప్రజాస్వామ్య విలువలు, గాంధేయ ఆలోచనలతో పెరిగిన గోపరాజు లవణంతో ఆమె వివాహం కూడా సామాజిక సందేశమైంది. వర్ణాంతర వివాహంగా జరిగిన ఈ కలయిక, కులవివక్షను సవాలు చేసిన సాహసోపేత నిర్ణయం. హేమలతా లవణం జీవితమంతా అణగారిన వర్గాల పక్షాన నిలిచి, జరిపిన నిరంతర పోరాటమే. వినోబా భావే భూదాన యాత్రలో పాలొనడం, చంబల్ లోయలో బందిపోటు దొంగలలో మానసిక పరివర్తన కోసం కృషి చేయడం ఆమె సేవా దృక్పథాన్ని స్పష్టం చేస్తుంది. నేరస్థుల పునరావాసం, సంస్కరణ ఆమె పనిలో ముఖ్యాంశంగా నిలిచింది. స్టూవర్టుపురం దొంగల పునరావాస కార్యక్రమాలు ఆమె సామాజిక బాధ్యతను ప్రతిబింబించాయి. 1961లో వాసవ్య విద్యాలయం స్థాపన ద్వారా సమత, మమతలపై ఆధారపడిన విద్యా విధానాన్ని ప్రోత్సహించింది. ఆర్థిక సమతా మండలి ద్వారా వెనుకబడిన వర్గాలలో ఆర్థిక, సామాజిక చైతన్యం కల్పించేందుకు కార్యక్రమాలు చేపట్టింది. 1981లో కావలిలో స్థాపించిన నవవికాస్ సంస్థ ద్వారా అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసింది. జోగినీ వ్యవస్థ నిర్మూలనలో ఆమె పాత్ర విశేషమైనది. జోగినులను, వారి పిల్లలను ఆదుకునేందుకు సంస్కార్ వంటి సంస్థలను నెలకొల్పి, వారికి భూములు ఇప్పించడంలో, వివాహాలు జరిపించడంలో కీలకంగా వ్యవహరించింది. ఈ కృషి ఫలితంగా అప్పటి ప్రభుత్వం జోగినీ వ్యవస్థ నిర్మూలన చట్టాన్ని అమలు చేసింది. అంధవిశ్వాసాల కారణంగా బాధపడుతున్న మహిళల సమస్యలను ఆరోగ్య సమస్యలుగా గుర్తించేందుకు ప్రయత్నించడం ఆమె దూరదృష్టిని సూచిస్తుంది. రచయిత్రిగా కూడా హేమలత తన సామాజిక బాధ్యతను నిలబెట్టుకుంది. 'జీవన ప్రభాతం', 'నేరస్థుల సంస్కరణ', 'మా నాన్నగారు', 'అనుభవ తరంగాలు' వంటి రచనల ద్వారా ఆమె అనుభవాలను, సంస్కరణ దృక్పథాన్ని పాఠకులకు అందించింది. జీవన ప్రభాతంకు తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం లభించడం ఆమె రచనా ప్రతిభకు గుర్తింపు. తండ్రి జాషువా రచనలు అందరికీ



చేరాలనే సంకల్పంతో వాటిని ముద్రించడం ద్వారా సాహిత్య సేవ చేసింది. ప్రకృతి విపత్తుల సమయంలో కూడా ఆమె సేవలు ఆగలేదు. 1977 దివిసీమ ఉప్పెన, తదుపరి తుపానులు వంటి విపత్తుల సమయంలో పునరావాస కార్యక్రమాల్లో పాల్గొంది. ఈ సేవలకు గాను ఆమె అనేక పురస్కారాలు అందుకుంది. అయితే, అవార్డులు ఆమె లక్ష్యం కాదు... సమాజ మార్పే ప్రధాన ధ్యేయం. సాహిత్య సేవ అంటే, రచయితగా, కేవలం పుస్తకాలు రాయడం మాత్రమేకాదని, సమాజాన్ని నవపథంలోకి నడిపించే సాహిత్యం ప్రజలకు చేరేందుకు ప్రయత్నం చేయడం కూడా అందులో భాగమేనని హేమలత జీవితం ఒక స్పష్టమైన సందేశం ఇస్తుంది. సమాజ బాధ్యతను మోసే ధైర్యం కలిగి ఉండటం... ఆలోచనను కార్యరూపంలోకి తీసుకురావడం... అణగారిన వారి కోసం నిలబడటం ఆమె జీవితానికి ప్రత్యేకతను సంపాదించిట్టాయి. సార్థకతను అందించాయి. ఆమె జీవితం, రచనలు రెండూ కలిపి ఒక సమగ్ర సామాజిక ఉద్యమంలా గోచరిస్తుంది. 2008 మార్చి 20న ఆమె మరణించినా, సమానత్వం, మానవత్వం, చైతన్యం అనే విలువలు ఆమె వారసత్వంగా కొనసాగుతున్నాయి.

**(ఈనెల 26న జయంతి)**


ఈ వారం కవితలు

## నల్లబంగారు నేలపై పొడిచిన ఎర్రని పొద్దు

భద్రాద్రి కొత్తగూడెం
శ్రామిక జన వాడల్లో
హరిజన గిరిజన బడుగు
బహుజనుల గుండెల్లో
రెపరెపలాడుతూ
ఎగురుతున్నది ఎర్రని జెండా
ఎన్నెన్నో అవమానాలు
ఆర్థిక ప్రలోభాలు
దుర్మార్గాలను దౌర్జన్యాలను
దిగమింగుకొని
కుల, మత కుళ్లు రాజకీయాల
సుడుగుండ్లు దాటుకొని
కొత్తగూడెం నల్లబంగారు నేలపై
ఎగిరింది మన ఎర్రెర్రని జెండా
కమ్యూనిస్టులకిక
కాలం చెల్లిందంటూ
కారుకూతలు కూసే
ఓ కుహనా మేధావులారా
కనబడుతున్నదా కొత్తగూడెం
కంచుకోటపై కమ్యూనిస్టులు
ఎగరేసిన ఎర్రని జెండా
వినబడుతుందా ఇంక్విలాబ్
జిందాబాదంటు నినదించే
గళాల గర్జన
శ్రమదోపిడీ పోయేదాకా
సమసమాజం వచ్చేదాకా
మరణమన్నది లేదోయ్
మార్క్సిజం సిద్ధాంతానికి ..
సూర్యచంద్రులున్నంతవరకు
ఎగురుతూనే వుంటుందోయ్
ఎర్రని జెండా

**(కొత్తగూడెం కార్పొరేషన్‌లో కమ్యూనిస్టుల విజయానికి అంకితం)**

**– బొమ్మగాని నాగభూషణం**
**9849622633**



## దోషి

స్టాన్ స్వామిని చంపేస్తే
రాజ్యాన్ని ప్రశ్నించక మా మతం కాదని
అటువైపు చూడలేదు

ముక్కుపచ్చలారని అమ్మాయిని
ప్రార్థనా మందిరంలో
అత్యాచారం చేస్తే మా మతం కాదని
నోరు మెదప లేదు

దళిత వాడలను సెక్స్ ప్రయోగశాలల్లాగా
చూస్తుంటే ఊరి చివర బతుకులతో మనకేందని
ఊరిమధ్యలో బొంద్రాయి సంబరాలు చేసుకుంటివి

భూమి మీద ఆధిపత్యమెవడిదైతే
వాడు చేసే అరాచకాలను చూసీ చూడనట్టు
తలుపులు బిగించి వినోదాల పెట్టెల్లో తల దూర్చితివి

రాజ్యాధికారం చేపట్టాక
అదే కులహంకారం పెచ్చుమీరి
హత్యలు చేసిన చరిత్ర ఆయా కులాల సొంతం
కారంచేడు చుండూరు సాక్షిగా!
నేడు కుమ్మెరలో పసిబిడ్డను తొక్కి చంపేసిన ఆధిపత్యం

ప్రార్థనమందిరంలోకెళ్లిన చాకలిదే మతమని
నిర్వచించిందో పైమెట్టు
నాలుగో వర్ణంలోని ఓ చిన్న చేపను
అదే వర్ణంలోని పెద్ద చేప చంపేసింది
బీజం వేసింది చతుర్వర్ణ వ్యవస్థదే!
దోషి సైతం అదే!!

**– గిరి ప్రసాద్ చెలమల్లు**
**9493388201**




కవిత మదిలో మెరిసింది
నిశ్శబ్దపు హృదయంలో
ఆలోచనల అలలా వచ్చి
భావాల్ని మేల్కొలిపింది.

కవిత కాగితపు ఒడిలోచేరింది
సిరాతో స్నేహం చేసి
అక్షరాల అడుగుల్లో
అర్థాలకు ఊపిరి పోసింది.

కవిత నదిలా పారింది
మనసు నిండా ప్రవహించి
పదాల పల్లకీలో
పుటలపై పరుగులేసింది.

కవిత కమ్మగా కుదిరింది
అక్షరాల అల్లికలో
లయకు లయ కలిపి
స్వరాల్ని సర్దుకుంది.

కవిత పత్రికల్లో ప్రచురితమయ్యింది
ప్రపంచపు వెలుతురులో
తన రూపాన్ని చూపిస్తూ
కవిత్వమని చాటింది.

కవిత పాఠకులను పిలిచింది
హృదయాల తలుపులు తట్టి
నన్ను ఆస్వాదించు అంటూ
మనసులను పలకరించింది.

కవిత మన్ననలు పొందింది
ప్రశంసల పరిమళంలో
చప్పట్ల మోగుల్లో
ఆనందంగా తేలిపోయింది.

కవిత కంచికి వెళ్ళింది
కాలపు ఒడిలో ఒదిగి
సంతృప్తి నిద్రలో
శాంతిగా విశ్రాంతి తీసుకుంది.

కవితలను చదవండి
కవులను ప్రోత్సహించండి,
పలుకులమ్మను తలచి
ప్రసాదంగా స్వీకరించండి.

కవితల్లో మునగండి
కవితామృతమును త్రాగండి,
కవితావిందును ఆరగించి
కవితామర్మము తెలుసుకోండి.

**– గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్, భాగ్యనగరం**

## పేదల ముఖంలో ఆనందం.. చూడటమే కాంగ్రెస్ లక్ష్యం



ప్రజాపక్షం/శివ్వంపేట : పేదల ముఖంలో ఆనందం చూడటమే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి అన్నారు. మండలంలోని చిన్నగొట్టిముక్క, గుండ్లపల్లి గ్రామాలలో ప్రభుత్వం నుంచి మంజూరై నిర్మాణం పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇండ్లను పీసీసీఎస్ మాజీ చైర్మన్ వెంకటరాంరెడ్డితో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గ్రామాలలో మరిన్ని ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేసిందని ఆయన అన్నారు. పేదల ముఖంలో ఆనందం చూడడమే కాంగ్రెస్ పార్టీ ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో గుండ్లపల్లి సర్పంచ్ పెంజర్ల మమత నర్సింలుయాదవ్, గోమారంసర్పంచ్ హైమావతిఆంజనేయులు, తాళ్లపల్లి సర్పంచ్ లక్ష్మి గేమ్యానాయక్, కస్తూరితండా సర్పంచ్ కిషన్‌నాయక్, మాజీ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, మండల సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్‌గుప్తా, ఉప్పునూతల సత్యనారాయణగౌడ్, కర్రె రాములు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ప్రజావాణి

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 23వ తేదీ(సోమవారం) నుంచి యథావిధిగా తిరిగి ప్రారంభమవుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.మున్సిపల్ ఎన్నికల ప్రవర్తన నియమావళి ముగిసిన నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని తిరిగి నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.జిల్లాలోని ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన వినతులు,ఫిర్యాదులు సమర్పించడానికి వారు ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి హాజరై నేరుగా అధికారులకు తమ దరఖాస్తులను అందజేయవచ్చని పేర్కొన్నారు.జిల్లావాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## పట్టణాభివృద్ధికి కృషి చేస్తా..

మున్సిపల్ చైర్మెన్ లావణ్య నాగరాజు



ప్రజాపక్షం/రామాయంపేట: పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని రామాయంపేట మున్సిపల్ చైర్మెన్ గజవాడ లావణ్య నాగరాజు అన్నారు. ఆదివారం పట్టణంలోని పలు వార్డుల్లో నూతన పాలకవర్గానికి సన్మాన కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా 3వ వార్డులో ఏడీదుల ఎల్లమ్మ దేవాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు,ఐక్యవాసులు పాలకవర్గానికి సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. తాము గెలుపుకోసం పాటుపడిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటామని చెప్పారు. ఎన్నికల వరకే రాజకీయాలని, ఎన్నికల తర్వాత కేవలం అభివృద్ధిపైనే మాత్రమే దృష్టి పెడుతామన్నారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుల సహకారంతో రామాయంపేట మున్సిపాలిటిని ఆదర్శ మున్సిపాలిటిగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. వైస్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు, వైస్ చైర్మెన్ పోచమ్మల నవీన గణేష్, కౌన్సిలర్లు గజవాడ నాగరాజు, రవి, సృష్ట కుమార్, రంజిత్, శ్యామల స్వామితో పాటు నాయకులు బత్తుల రాజయాదవ్, యాదగిరి, సొల్పూర్‌రాజు,సంతోష్ దామోదర్, స్వామి, శివ, బత్తుల శ్యామయ్య, వంశీతో పాటు పాల్గొన్నారు.

## దివంగత వైఎస్‌ఆర్ కృషితో.. రూపుదిద్దుకుంటున్న గజ్వేల్

మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి



ప్రజాపక్షం / గజ్వేల్: దివంగత వైయస్సార్ కృషి ఫలితంగా రాష్ట్రంలోని ప్రధాన పట్టణాలకు దీటుగా గజ్వేల్ ప్రాంతం రూపుదిద్దుకుంటున్నట్లు మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దివంగత సీఎం వైయస్ రాజశేఖర్‌రెడ్డి చొరవతో ఈ ప్రాంతంలో పరిశ్రమలు స్థాపనకు కేంద్ర బిందువుగా మారగా, మారుతున్న పరిస్థితుల్లో గజ్వేల్, వర్గల్ మండలాల్లో సైతం పరిశ్రమలు విస్తరిస్తున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా జంట నగరాలకు సమీపంలో ఉండడం కలిసి వస్తుందని, రైల్వే లైన్, నూతన రోడ్ల నిర్మాణం వంటి వసతులు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంస్థలు తమ వాణిజ్య వ్యాపార విపణిలు ప్రారంభించగా, త్వరలోనే ఊహించని అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం హైదరాబాద్ పరిసర ప్రాంతాలలోని పరిశ్రమలను తరలిస్తుండడంతో గజ్వేల్ ప్రాంతానికి కలిసి వచ్చే అంశంగా మారిందని, దీంతో నిరుద్యోగ యువతకు చక్కటి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు దక్కనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, విజయ మోహన్, నేతలు నాయిని యాదగిరి, ఊడెం సారిక శ్రీనివాస్ రెడ్డి, షరీఫ్, రమేష్ గౌడ్, గుంటుకు శ్రీనివాస్, నేత నాగరాజు, వెంకట్ గౌడ్, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

## పలు స్థలాలను పరిశీలించిన సబ్ కలెక్టర్

ప్రజాపక్షం/బోధన్: బోధన్ నియోజకవర్గంలోని పలు స్థలాలను సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఆదివారం పరిశీలించారు. పాత సంస్కార్ సొసైటీ స్థలాన్ని సబ్ కలెక్టర్ సందర్శించారు. రుద్రూర్ మండలం అంబం శివారులో ఉన్న సర్వే నంబర్లు 227, 228లలో మొత్తం 6.04 గుంటల విస్తీర్ణం గల భూమిని పరిశీలించారు. అంబం గ్రామంలోని మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలకు అదనపు గదుల నిర్మాణం కోసం అనుకూలమైన స్థలాన్ని గుర్తించే ఉద్దేశ్యంతో ఈ సమీక్ష నిర్వహించారు.



# ప్రతి విద్యార్థి 10 జిపిఎ సాధించాలి

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్





ప్రజాపక్షం/వెల్దుర్తి: గ్రామీణ, వెనుకబడిన వర్గాల బాలికలకు నాణ్యమైన విద్యను అందిస్తూ, చదువుకు దూరమైన ఎంతోమంది జీవితాల్లో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు వెలుగులు నింపుతున్నాయని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఆదివారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలో కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను కలెక్టర్ పరిశీలించారు. హాస్టల్లోని నిత్యావసర సరుకులను, స్టోర్ రూంను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందజేయాలని. నిత్యావసర సరకులను సరఫరా చేసే ఏజెన్సీ వారు నాణ్యమైన వస్తువులను మాత్రమే అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.విద్యార్థులకు ఖచ్చితంగా మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని అన్నారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. విద్య బోధన, భోజన సదుపాయం ఇతర మౌలిక వసతులు ఎలా ఉన్నాయి.? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా వచ్చే బోర్డు పరీక్షల దృష్ట్యా విద్యార్థులందరూ 10 జీపీఏ సాధించేందుకు ఉపాధ్యాయులు సమగ్ర వ్యూహాన్ని అమలు చేయాలని సూచించారు. కస్తూరిబా గాంధీ విద్యాలయం ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 8న అంతర్జాతీయ.. శ్రామిక మహిళా దినోత్సవం

'తుడుం దెబ్బ' ఆధ్వర్యంలో భారీ సభ



ప్రజాపక్షం/ఆదిలాబాద్/నిర్మల్ : అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 8వ తేదీన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కొమురం భీం కాలనీలో ఆదివాసీ మహిళా సంఘం(తుడుం దెబ్బ) ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు సంఘం నేతలు ప్రకటించారు.ఆదివారం జరిగిన సన్నాహక సమావేశంలో తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు పేందూరు దాది రావు,మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ఆదివాసీ మహిళల సాధికారత,హక్కులు, భద్రత ,విద్య ,ఆరోగ్యం వంటి అంశాలపై ఈ సభలో ప్రధానంగా చర్చించనున్నట్లు తెలిపారు.మహిళలపై జరుగుతున్న అణచివేతను ఎండగట్టడంతో పాటు,సమానత్వం కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఇందిర, విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సలాం వరుణ్,సోయం లలిత,ఆత్రం గణపతి,వేడమ ముకుందరావు,ఇతర ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి సిఎం కప్ పోటీలలో నిర్మల్ జిల్లా క్రీడాకారుల జోరు..



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : రాష్ట్ర స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలలో జిల్లా క్రీడాకారులు తమ అద్భుత ప్రతిభను చాటుతూ మరిన్ని పతకాలను సొంతం చేసుకున్నారు.ఆదివారం జరిగిన వివిధ క్రీడా విభాగాల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు పతకాల వేటలో ముందు వరుసలో నిలిచారు.ముఖ్యంగా యోగా విభాగంలో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు.రిథమిక్ యోగా అండర్14 సబ్ జూనియర్ బాలుర విభాగంలో మాగం చరణ్ అద్భుత ప్రదర్శన కనబరిచి వెండి పతాకాన్ని కైవసం చేసుకున్నాడు.అలాగే అండర్25 విభాగంలో దిలీప్ తన నైపుణ్యంతో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లాకు బంగారు పతకాన్ని అందించాడు.

# మున్నూరుకాపు అభివృద్ధి కోసం కృషి

సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మపురి సంజయ్



ప్రజాపక్షం/నిజామాబాద్ : పంచముఖి మున్నూరుకాపు సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని, మీలో ఉన్న ఐక్యత అన్ని సంఘాలలో రావలని మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మపురి సంజయ్ అన్నారు. జిల్లాలోని మున్నూరుకాపులందరిని ఏకం చేసి, ఒకే తాటిపైకి తెచ్చేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. ఆదివారం వినాయక్‌నగర్‌లోని పంచముఖి మున్నూరుకాపు సంఘం 202627 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం సంఘ భవనంలో నూతన అధ్యక్షులు మిద్దె రవికుమార్, ప్రధాన కార్యదర్శి దారం పోతన్న, కోశాధికారి కర్క రమేష్ కార్యవర్గం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్నూరుకాపు జిల్లా అధ్యక్షులు ధర్మపురి సంజయ్ విచ్చేసి నూతన అధ్యక్షులు మిద్దె రవికుమార్, ప్రధాన కార్యదర్శి దారం పోతన్న, కోశాధికారి కర్క రమేష్‌లతో పాటు 22 మంది కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కండువా, శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ధర్మపురి సంజయ్‌ను శాలువ, కండువాతో, పూలమాలతో ఘనంగా సన్మానించామన్నారు. మున్నూరుకాపులు రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మున్నూరు కాపులు రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మున్నూరుకాపుల ఐక్యతతోనే ఇది సాధ్యమవుతుందన్నారు. నూతన అధ్యక్షులు మిద్దె రవికుమార్ మాట్లాడుతూ అధ్యక్షులుగా ఎన్నుకున్న సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అధ్యక్షులుగా మిద్దె రవికుమార్, ప్రధాన కార్యదర్శి దారం పోతన్న, కోశాధికారి కర్క రమేష్, గౌరవ అ ధ్యక్షులు ఆకుల శ్రీశైలం, ఆమ లడ్డూ శంకర్, ము ఖ్య సలహాదారులు హరిదా సాయిరెడ్డి, చిట్టి నారాయణరెడ్డి, వైసాక్షి సంతోష్, పెద్దకాపులు నగుర్త ధర్మేందర్, సోమిరెడ్డి జగదీష్, పంతుల ముత్యం, ఉపాధ్యక్షులు యేల్మల శంకర్, ముకుందం శ్రీనివాస్, ఆసాని లచ్చన్న, అంజిరెడ్డి, రఘునందన్, సంతోష్, హన్మాండ్లు, కృష్ణ, తిరుమల్, రాజు, శివకుమార్ లను ఎన్నుకున్నారు.

# సాంకేతికతతోనే అధిక దిగుబడి

ప్రజాపక్షం / కాగజ్ నగర్ : రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటే పెట్టుబడి ఖర్చు తగ్గి దిగుబడి పెరుగుతుందని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కోనేరు కృష్ణ రావు అన్నారు. ఆదివారం హైదరాబాద్ లోని ఎన్‌టిఆర్ గార్డెన్స్ లో నిర్వహించిన రైతు బడి అగ్రి షో 2026 కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ వ్యవసాయ యంత్రాలు, విత్తన రకాలను పరిశీలించి నిపుణులతో చర్చించారు. ఇలాంటి ప్రదర్శనలతో కొత్త ఆవిష్కరణలను తెలుసుకొని క్షేత్రస్థాయిలో అమలు చేస్తే రైతుల ఆదాయం రెట్టింపు అవుతుందని పేర్కొన్నారు. ఈ అగ్రి షోలో డ్రోన్ ద్వారా ఎరువుల పిచికారీ, ఎస్‌ఆర్‌ఐ విధానానికి అనువైన యంత్రాలు, మొక్కజొన్నలో సింగిల్ పాస్ సీడ్ డ్రిల్ వంటి పరికరాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పశుసంవర్ధక రంగంలో అధిక పాలిచ్చే హైబ్రిడ్ జాతులు, పశువుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించే స్మార్ట్ కాలర్లు, డిజిటల్ పరికరాలను ప్రదర్శించారు. పత్తిలో డ్రిప్ ఇరిగేషన్, మిర్చిలో వైరస్ నిరోధక విత్తన రకాల గురించి కంపెనీ ప్రతినిధులు వివరించారు. ప్రభుత్వ పథకాలను సాంకేతికతతో జోడించి సాగు చేయాలని ఆయన రైతులకు సూచించారు. వ్యవసాయ సంస్థల ప్రతినిధులు, విత్తన కంపెనీల నిర్వాహకులు, యంత్రాల తయారీదారులు పాల్గొన్నారు.

# కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రజాపక్షం/నిజామాబాద్ : కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమం కోసం పని చేసి సారథి ఉద్యోగం రాకుండానే కీబోర్డ్ ఆంజనేయులు మరణించడం బాధాకరమని సిర్ప లింగం, రాంపూర్ సాయి అన్నారు. కళ కోసం ఆయన ప్రాణాలు సైతం లెక్క చేయకుండా సేవలందించిన గొప్ప కళాకారుడికి బోర్డు ఆంజనేయులు అని కళలోకానికి ఆంజనేయులు లేని లోటు తీరనిదని కళాకారులు గంగాధర్, రాంపూర్ సాయి, కోకిల నాగరాజు, ఆర్టీసీ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సుభాష్‌నగర్‌లోని పెన్షనర్స్ భవన్‌లో సకల కళాకారుల ఆధ్వర్యంలో కీబోర్డ్ అంజన్న యాదిలో సంతాప సభ నిర్వహించగా సిర్ప లింగంఅధ్యక్షత వహించారు. ఆయన చిత్రపటానికి జిల్లా నలుమూలాల నుండి ఇతర జిల్లాల నుంచి వచ్చిన కళాకారులు నివాళులర్పించారు.అరుణోదయ దాసు, మనోహర్, నర్సారెడ్డి, నర్సింగ్, మహేష్, వంశీ, వర్మ, అరున్, ఢీమ్, సవిత, విజయ్, నిహారిక, మనోజ, మీనా, గోదావరి, గణేష్, గోపాల్ ప్రముఖులు పాల్గొని సంతాప సభను విజయవంతం చేశారు.

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు పూర్తి

ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు



ప్రజాపక్షం / కాగజ్ నగర్ : ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సిర్పూర్ ఎంఎల్ఏ డా పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. ఆదివారం కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని బాలాజీనగర్ 11వ వార్డులో మన్నె యాదగిరికి మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఆయన భూమి పూజ నిర్వహించారు. ప్రభుత్వం నుంచి అందే ఆర్థిక సహాయాన్ని సకాలంలో పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. వార్డుల్లో అర్హులైన మిగతా లబ్ధిదారుల జాబితాలను కూడా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సింధం శ్రీనివాస్, దస్తగిరి, అనిల్, నానాజీ పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల కబ్జా.. అధికారుల మౌనం

ప్రజాపక్షం / తిర్యాణి : కొమురం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండల పరిధిలో ప్రభుత్వ భూముల కబ్జాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. పంచాయతీ, రెవెన్యూ శాఖలకు చెందిన ఖాళీ స్థలాలు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన భూముల్లో కొందరు వ్యక్తులు తాత్కాలిక షెడ్లు, దుకాణాలు, కంచెలు ఏర్పాటు చేసి ఆక్రమిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తీరుపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. పలుమార్లు ఫిర్యాదులు చేసినా క్షేత్రస్థాయిలో ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. తక్షణమే స్పందించి ఆక్రమణకు గురైన భూములపై సర్వే నిర్వహించాలని, నివేదికను బహిర్గతం చేసి బాధ్యులపై కేసులు నమోదు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# రైతు పక్షాన పోరాడితే అక్రమ కేసులా ?

మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల




ప్రజాపక్షం/భీమ్‌గల్ : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని రైతుల సమస్యలపై పోరాడుతున్న వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ వేధింపులకు గురి చేస్తోందని మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పార్టీ కార్యాలయం వద్దకు చేరుకుని కాంగ్రెస్ ప్రభుత్వం 32 మంది రైతులపై పెట్టిన అక్రమ కేసులను నిరసిస్తూ నల్ల జెండాలు నల్ల దుస్తులతో నిరసన తెలిపారు. రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం రైతులతో కలిసి పోలీస్‌స్టేషన్ కు తరలివెళ్లారు. పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న వేముల ఎస్సై సంజీవ్ నోటీసులు అందజేశారు. నోటీసులు అందుకుని వేముల పోలీసులు పెట్టిన అక్రమ కేసులపై అసహనం వ్యక్తం చేశారు. పోలీసుల అనుమతి తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును తీవ్రంగా ఖండించారు.

### రైతుబంధు ఏదీ ? భరోసా ఏదీ ?

సుమారు 57 వేల మంది రైతులకు నేటికి రైతుబంధు అందలేదని, వరికి బోనస్ ఇస్తామన్న హామీ అటకెక్కిందని విమర్శించారు. సాగు సమయంలో యూరియా అందక రైతులు అల్లాడుతుంటే వారి పక్షాన పోరాడుతున్న 32 మంది రైతులు, పార్టీ నాయకులపై అక్రమ కేసులు పెట్టి పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిప్పడం దుర్మార్గమన్నారు. మహిళలకు తులం బంగారం, పెన్షన్ వంటి ఎన్నికల హామీలపై ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని మండిపడ్డారు.డిసెంబర్ 18, 2024 న ప్రస్తుత సిఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి, మంత్రులతో కలిసి రాజ్‌భవన్ ఎదుట ధర్నా విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు మహిళలకు తులం బంగారం, పెన్షన్ పథకాలను అమలు చేయాలని, వంద కేసులు పెట్టినా భయపడే ప్రసక్తి లేదని, రైతుల కోసం , ప్రజల కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని, మాజీ మంత్రి,వేముల ప్రశాంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# ఉద్యమకారిణి జలజకు కన్నీటి వీడ్కోలు



ప్రజాపక్షం/నిజాంపేట్: ఉద్యమకారిణి, ప్రజా కళాకారుని జలజ మృతి బాధాకరమని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ డాక్టర్ జివి వెన్నెల అన్నారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ మృతి చెందిన ఉద్యమకారిణి జలజ అంత్యక్రియలు నార్సింగ్ లోని వ్యవసాయ క్షేత్రంలో జరిగిన అంతిమ సంస్కారణాలకు హాజరైన వెన్నెల, కవులు కళాకారులు, విప్లవోద్యమ మాజీ ఉద్యమకారులు, ప్రజా సంఘాల నాయకులు పాడమోసి నివాళులర్పించారు. కామ్రేడ్ జలజ జీవితం నిర్బంధాల సుడిగుండాల నుంచి ఉద్భవించిందని ఆ మెసేజ్ చేసిన త్యాగం తెలంగాణ సమాజానికి అవసరమన్నారు నేడు జలజ మృతి కవులకు కళాకారులకు తెలంగాణ సమాజానికి తీరనిలోటు అన్నారు. నార్సింగ్ మండల కేంద్రం లోని తన వ్యవసాయం క్షేత్రం లో అంతక్రియలు నిర్వహించారు. తెలంగాణ లోని ఉమ్మడి మెదక్ జిల్లా అలాగే సాంస్కృతిక సారధి లో పని చేస్తున్న అనేకమంది కళాకారులు జలజ తో విప్లవద్యమంలో పనిచేసిన నాయకులు ఆమె జ్ఞాపకాలు తలుచుకుంటూ భూమి బుక్తి విభక్తి కోసం పోరాటం చేసిన అమరవీరుల ఆశయాలను తలుచుకుంటూ ఉపన్యాసాలు కొనసాగించారు. జలజ మొండితనానికి పట్టుదలకు మారుపేరని అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా తాను రాసిన గేయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా విడుదల చేశామని గుర్తు చేశారు గుర్తు చేశారు. జలజ చిన్నప్పటి నుండి ఉపాధ్యాయురాలుగా ఉద్యమకారుని గా రచయితగా కళాకారునిగా సమస్యల పట్ల మొండిగా పట్టుదలతో పనిచేస్తూ తన జీవితాన్ని ప్రజల కంచితం చేసిన వ్యక్తిగా నిలిచిపోయిందని కొనియాడారు. ఆటపాటలతో అంత్యక్రియలు పూ ర్తి చేశారు.పూర్వ ఉద్యమ మిత్రులు రామక్క, బూ దక్క, సునీత, శారద, బోయ శ్రీనివాస్, పి.శంకర్, దుబాసి సంజీవ్, బాలరాజు గౌడ్, బొమ్మల మైసయ్య, మాజీ జెడ్పిటిసి రమణ, ఆశరామారావు, వెంకన్న, శేఖర్, షేక్ బాబు, అభినయ శీ, కోదాడ శ్రీనివాస్, అర్జున్, స్వప్న, సంకాపూర్ సర్పంచ్ శ్రీనివాస్, కుటుంబ సభ్యులు రామచంద్రం, తేజ, బంధుమిత్రులు సహచరులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ఉద్రిక్తత

ఎమ్మెల్యేను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు



ప్రజాపక్షం/బైంసా : కామారెడ్డిలో ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి పై జరిగిన దాడికి నిరసిస్తూ సంఘీభావం తెలపడానికి ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తన నివాసం నుండి వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు.ఈ సందర్భంగా బిజెపి నాయకులకు పోలీసుల మధ్య బహబిహా జరిగింది.కామారెడ్డి వెళుతుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని ఆగ్ర హం వ్యక్తం చేశారు.పోలీసులు ఎమ్మెల్యేను గృహనిర్బంధంలో ఉంచారు. కాంగ్రెస్ పార్టీ ప్ర జాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతుందన్నారు.కామారెడ్డిలో కాంగ్రెస్ సర్కార్ రా జ్యాంగాన్ని ఖుని చేసిందన్నారు.గత పది ఏళ్లు గా కెసిఆర్,ఇప్పుడు రేవంత్ రెడ్డి ఇద్దరు తోడు దొంగలని ప్రజాస్వామ్య విలువలను కాల రాస్తున్నారన్నారు. తమ సహచర ఎమ్మెల్యే రాజాసింగ్ ఓలా గ్రామానికి విగ్రహావిష్కరణకు వస్తు ంటే పోలీసులు తూఫ్రాన్‌లో అరెస్టు చేయ డం ఏంటని ఎమ్మెల్యే పటేల్ మండిపడ్డారు. రాజాసింగ్ వచ్చేవరకు విగ్రహాన్ని ఆవిష్కరించేది లేదని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ ప్రభు త్వం ఇకనైనా తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ఎ మ్మెల్యే వెంట బైంసా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్ బాబు,బిజెపి పట్టణ అధ్యక్షుడు రావుల రాము, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో డిఐ నసీరుద్దీన్ మృతి

ప్రజాపక్షం / మంచిర్యాల : మంచిర్యాల ల్యాండ్ అండ్ రెవెన్యూ సర్వే జిల్లా ఇన్స్‌పెక్టర్ (డిఐ) నసీరుద్దీన్ నిర్మల్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆదివారం ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో ప్రయాణిస్తుండగా కడెం సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అతివేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టడంతో నసీరుద్దీన్ ఘటనాస్థలంలోనే ప్రాణాలు విడిచారు. ఈ ప్రమాద సమయంలో కారులో ఉన్న ఆయన కూతురు, మనవడికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గమనించిక్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసే నసీరుద్దీన్ మరణవార్త విన్న మంచిర్యాల జిల్లా రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాల కోసం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచాలి




**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల పట్టణంలోని జ్యోతి హైస్కూల్ ఐఐటీ అకాడమీకి చెందిన 25 మంది విద్యార్థులు ఈ నెల 12,13,14 తేదీలలో స్థానిక వివేకానంద స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి సీఎం కప్ ఫుట్ బాల్ (బాయ్స్ అండ్ గర్ల్స్) కిక్ బాక్సింగ్ పోటీలలో అత్యంత ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈ నెల 20 నుండి 24 వ తేదీ వరకు హైదరాబాద్ లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి సీఎం కప్ ఫుట్ బాల్ ( బాయ్స్ అండ్ గర్ల్స్) కిక్ బాక్సింగ్ పోటీలకి ఎంపిక కావడం జరిగిందని పాఠశాల డైరెక్టర్ బియ్యాల హరి చరణ్ రావు తెలిపారు. పాఠశాల డైరెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి సీఎం కప్ ఫుట్ బాల్ (గర్ల్స్) పోటీలకు 10 మంది విద్యార్థులు, ఫుట్ బాల్ (బాయ్స్) పోటీలకు 9 మంది విద్యార్థులు, కిక్ బాక్సింగ్ పోటీలకు 6 గురు విద్యార్థులు ఎంపిక అయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బియ్యాల హరి చరణ్ రావు విద్యార్థులను అభినందించి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ బియ్యాల హరి చరణ్ రావు, శ్రీధర్ రావు, మౌనిక రావు, అజిత,ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు యథావిధిగా ప్రజావాణి: కలెక్టర్

**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కోసం జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి కార్యక్రమాన్ని యథావిధిగా సోమవారం నుంచి కొనసాగించ నున్నట్లు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## 28లోగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి: సంతోష్

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** భూమి కలిగి ఉన్న ప్రతి రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని కొత్తపల్లి మండల వ్యవసాయ అధికారి కోట సంతోష్ కుమార్ తెలిపారు. భూమికి ఆధార్ లింక్ చేసుకోవాలని సూచించారు. పిఎం కిసాన్, బ్యాంకు రుణాలు, ఇతర ప్రభుత్వ అన్ని రకాల పథకాలకు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరిగా చేసుకోవాలని పేర్కొన్నారు. రైతు వేదికలలో ఏఈవో, మీసేవ సెంటర్‌లో ఆదార్ కార్డు, ఆధార్ లింకు ఉన్న మొబైల్‌తో ఓటిపి చెప్పడం ద్వారా పూర్తవుతుందని తెలిపారు. ప్రభుత్వ పథకాలు పొందడానికి ప్రతి రైతు ఈ నెల 28 లోగా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని కోరారు.

## వరద కాలువలో కారు బోల్తా అదృశ్యమైన వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/మల్యాల:** అదృశ్యమైన వ్యక్తి వరద కాల్వలో పడి మృతి చెందిన సంఘటన జగిత్యాల జిల్లా మల్యాల మండలం లో ఆది వారం చోటు చేసుకుంది.వివరాల్లోకి వెళితే పెగడపెల్లి మండలం సుద్దపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు తిర్మని రమణారెడ్డి (50) ఈనెల 18న సాయంత్రం ఇంటి నుంచి కారులో బయలుదేరి మరుసటి రోజు ఉదయం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పెగడపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని గాలిస్తున్నారు. ఇవాళ ఉదయం మల్యాల ఎక్స్ రోడ్ సమీపం లోని వరద కాలువలో కారు కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్రేన్ సాయంతో బయటకు తీశారు. కారులో మృతి చెందిన వ్యక్తి సుద్దపెల్లి గ్రామానికీ చెందిన రమణ రెడ్డి గుర్తించి మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## మద్యం మత్తులో ఉరివేసుకొని ఆత్మహత్య



**ప్రజాపక్షం/ముత్తారం :** మద్యానికి బానిసై మద్యం మత్తులో ఉరివేసుకొని చనిపోయిన సంఘటన దర్యాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం దర్యాపూర్ గ్రామానికి చెందిన చందా మొగిలి 43 సంవత్సరాలు గల వ్యక్తి గ్రామపంచాయతీ కాంటాక్ట్ పద్ధతిలో 2019 సంవత్సరం నుండి పనిచేస్తున్నారు. అయితే మొగిలి మద్యానికి బానిసై ప్రతిరోజు తాగుతూ ఇంటికి వెళ్లి తన భార్యతో గొడవలు చేస్తూ మద్యం పిచ్చిగా ప్రవర్తించేవాడు. అదే ప్రతిరోజు లాగే మద్యం తాగిన మొగిలి శనివారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చి తన భార్యను తిట్టుకుంటూ ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకొని ఇంట్లోని దూలానికి చీరతో ఉరివేసుకొని చనిపోయినట్టు మృతుని భార్య పోలీసులకు తెలిపింది. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు కూతుర్లు మానస, మౌనిక ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ముత్తారం ఎస్సై రవికుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.


## అక్రమంగా మట్టిని తరలిస్తున్న మూడు టిప్పర్లు పట్టివేత

**ప్రజా పక్షం/మల్యాల:** అనుమతి లేకుండా అక్రమంగా వరద కాల్వ మట్టినీ తరలిస్తున్న 3 టిప్పర్లను,ఒక జే సి బి ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసుకొని సీజ్ చేసినట్లు మల్యాల ఎస్సై నరేష్ కుమార్ తెలిపారు.జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాంపూర్ గ్రామ శివారు లోని వరధ కాల్వ వద్ద శనివారం రాత్రి 10:30 గంటల సమయంలో అక్రమంగా టిప్పరు లారీ లలో మొరం మట్టి ని తరలిస్తున్నారని సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకొని అనుమతులు లేకుండా అక్రమంగా జేసిబి సాయం తో మట్టిని తరలిస్తున్న 3 టిప్పర్లు లారీలను , జెసిబి ని పట్టుకున్నామని,మల్యాల అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అరుణ్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రోడ్డు భద్రత నియమాలను అందరూ పాటించాలి: సిఐ శ్రీను

**ప్రజాపక్షం/బెజ్జంకి:** రోడ్డు భధ్రత నియమాలను ప్రతి ఒక్కరు పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సిద్దిపేట రూరల్ సిఐ శ్రీను అన్నారు.జిల్లా పోలీస్ కమిషనర్ సాదన రశ్మీ పెరుమాళ్ ఆదేశాల మేరకు ఆదివారం మండల పరిధిలోని తోటపల్లి గ్రామంలోని రాజీవ్ రహదారి వద్ద సిద్దిపేట రూరల్ సిఐ శ్రీను,ఎస్ఐ బి.సౌజన్య ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించి రోడ్డు భధ్రత నియమాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది,వాహనదారులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాల అభివృద్ధికి కృషి





### సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్

**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి నియోజకవర్గ పరిధిలోని ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.ధర్మపురి పట్టణంలో ఆదివారం గోదావరి నది ఒడ్డున నూతనంగా నిర్మించిన గంగమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిస్థాపన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగమ్మ తల్లికి మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద బోరు బావి, ప్రహరీ గోడ నిర్మాణానికి అవసరమైన నిధులు అందిస్తానని కమిటీ సభ్యులకు హామీఇచ్చారు. అంతకు ముందు మండలంలోని దోనూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతా లక్ష్మణ హనుమాన్ సమేత రామచంద్ర స్వామి వారి నూతన ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం పలికారు. ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ సంగ నర్సింహులు, దోనూర్ గ్రామ సర్పంచ్ దాసరి పురుషోత్తం, నాయకులు వేముల రాజేష్, చిలుముల లక్ష్మణ్, కౌన్సిలర్లు చీపిరిశెట్టి రాజేష్, కె.పవన్ కుమార్, విజయ్ బాబు, వొజ్జల లక్ష్మణ్, చుక్క సంధ్య, భీంరాజ్, గంగపుత్ర సంఘం నాయకులు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్టాపనలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**ప్రజాపక్షం/చందుర్తి :** మండల కేంద్రం లో ఇటీవల నూతనంగా నిర్మించిన మల్లికార్జున స్వామి ఆలయం లో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం లో రాష్ట్ర ప్రభుత్వ విప్ , స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదివారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు , దాతలు సహకరించడం అభినందనీయమన్నారు.సనాతన ధర్మం , ఆధ్యాత్మికత పెంపొందించేలాగ ఆలయ నిర్మాణం ఉందన్నారు.ఆలయ నిర్మాణానికి ముందుకు వచ్చిన గ్రామ పాలక వర్గాన్ని,అభివృద్ధి లో పాలుపంచుకుంటున్న ఎన్నారైలను అభినందించారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ పులి సత్యం,మండల కాంగ్రెస్ అధ్యక్షులు చింతపంటి రామస్వామి,గ్రామ శాఖ అధ్యక్షులు దారం రామచంద్రం,నాయకులు గొట్టె ప్రభాకర్ ,మోతె రాములు,మోతె బాబు,బొజ్జ మల్లేశం,చిలుక భూమేష్ ,పోతరాజు రవి,ఆలయ కమిటీ సభ్యులు కత్తి తిరుపతి,పులి నారాయణ,గుగ్గిల్ల గంగాధర్ , మర్రి మల్లేశం ,భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాపక్షం/గొల్లపల్లి:** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని గంగాదేవి పల్లె గ్రామంలో బాల్సాని జమున కు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఆదివారం గ్రామ సర్పంచ్ కొలకాని జలంధర్ పాల్గొని ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంతో ఒక కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కలను నిజం చేస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సొంటి కలను నెరవేర్చాలని ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొలకాని జలంధర్, మాజీ సర్పంచ్ బాల్సాని రాజు, సర్పంచ్ మని సాయి, రాఘవపట్నం సర్పంచ్ కాసారపు భవాని అరవింద్ గౌడ్, గ్రామస్తులు లబ్ధిదారులు పాల్గొన్నారు.



## మాట నిలబెట్టుకున్న కార్పొరేటర్ వేముల కవిత చంద్రశేఖర్



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు కరీంనగర్ నగరంలోని కొత్తపల్లిలో గల 17వ డివిజన్ కార్పొరేటర్ వేముల కవిత చంద్రశేఖర్ మాట నిలబెట్టుకున్నారు. డివిజన్‌కు చెందిన సిరిపురం స్వప్న మురళిల కుమార్తె వివాహ మహోత్సవంలో పాల్గొని స్వయంగా రూ.10,016 లను ఆడబిడ్డ కట్నంగా అందజేసారు.

## జాతరలో చలివేంద్రం ఏర్పాటు

**ప్రజాపక్షం/చొప్పదండి:** చొప్పదండి పట్టణ కేంద్రంలో జరుగుతున్న శ్రీశ్రీ శివకేశవ(శంభు స్వామి) జాతరలో భాగంగా భక్తుల సౌకర్యార్థం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు 5వ వార్డు కౌన్సిలర్ వడ్లూరి అనూష శ్యామ్ సుందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్‌ల ఆద్వర్యంలో ఉచిత చలివేంద్రం ఏర్పాటు చేశారు.

## హామీలను విస్మరించిన కాంగ్రెస్: హరీష్

**ప్రజాపక్షం/సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా పాలమాకుల గ్రామాన్ని ఐక్యతతో అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుకుందామని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. నంగునూర్ మండలం పాలమాకుల గ్రామం లో జరుగుతున్న శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో మాజీ మంత్రి హరీష్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ యాదవులుకులదైవంగా శ్రీకృష్ణున్ని కొలుస్తారని. గ్రామంలో శ్రీకృష్ణ స్వామి ప్రతిష్ట జరగటం చాల సంతోషంగా ఉందన్నారు. గ్రామంలోని ఊరచెరువును కాళేశ్వరం నీళ్లతో నింపుకున్నామన్నారు. నిండుకుండల ఊరచెరువు నీళ్లతో కళకళ లాడుతుందన్నారు. గ్రామంలో వందశాతం సిసి రోడ్ల నిర్మాణం పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. సిద్దిపేట నియోజక వర్గంలోనే మొదటి కొనుగోలు కేంద్రాన్ని పాలమాకుల గ్రామంలో ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. గత 15 ఏండ్లుగా వడ్ల కొనుగోలు కేంద్రాన్ని పాలమాకుల గ్రామం నుండి ప్రారంభించుకున్నట్లు తెలిపారు. వడ్లు, మొక్కలు. కొనుగోలు కేంద్రం నాలుగు ఊర్లు అమ్ముకునే విధంగా గ్రామం ఉపయోగపడుతుందన్నారు. పాలమాకుల గ్రామం మీదుగా ఫోర్ లైన్స్ రోడ్డు ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. రెండుమూడు రోజుల్లో లైట్స్ ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. పాలమాకుల మీదుగా రింగ్ రోడ్డు నిర్మాణం చేసుకొని నలుదిక్కుల రోడ్లు ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. కెసిఆర్ ప్రభుత్వం 200 ఫింఛన్‌ను 2వేలు చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు వేలు ఇస్తానని మాట తప్పినట్లు తెలిపారు. మహిళలకు ఇస్తానన్న 2500 రూపాయలు ఎగ్గొట్టినట్లు మండిపడ్డారు. యాదవులకు స్థలం ఇప్పించి బోర్ మోటర్‌ను ఏర్పటు చేసినట్లు తెలిపారు. అలాగే యాదవుల కమ్యూనిటి హాల్‌కు 5 లక్షలు ఇచ్చినట్లు గుర్తుచేశారు. గ్రామంలోనే బాలవికాస్ వాటర్ ప్లాంట్ నియోజకవర్గంలో మొట్టమొదలు ప్రారంభించుకున్నట్లు తెలిపారు. నాస్వంత ఖర్చులతో వాటర్ క్యాన్స్ ఇప్పించినట్లు తెలిపారు. ఉపాధి కూలీలకు వాటర్ బాటిల్స్, టిఫిన్ బాక్స్‌లు ఇచ్చినట్లు తెలిపారు. గ్రామగ్రామానికి లైట్స్ ఇచ్చినట్లు తెలిపారు. ప్రజల శ్రేయస్సు కొరకు నాశక్తి వంచనలేకుండ కృషిచేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోని శ్రీకృష్ణ స్వామి ఆశీస్సులతో అన్నింటా మంచి జరుగాలని ఆకాంక్షించారు. అంతకు ముందు పలు వివాహాలకు హాజరై నూతన వదూవరులను మాజీ మంత్రి హరీష్‌రావు ఆశీర్వదించారు.



## మేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన కొలగాని శ్రీనివాస్

**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ కార్పోరేషన్ మేయర్ ఎన్నికైన కొలగాని శ్రీనివాస్ ఆదివారం మున్సిపల్ కార్యాలయంలోని ఆయన చాంబర్ లో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేసి పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాబోయే వేసవిలో ప్రజల త్రాగు నీటి సరఫరా ఇబ్బందులు తొలగించడం, సమ్మర్ ఆక్షన్ ప్లాన్ లో భాగంగా విలీన గ్రామాల డివిజన్ల కు రూ. 49 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు పరిపాలనాపరమైన మంజూరు ఫైల్ పై మొదటి సంతకం చేశారు. పదవికి సహకరించిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచంధర్ రావుకు,జాతీయ, రాష్ట్ర నాయకులకు, నగర ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నేతృత్వంలో డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, పాలకవర్గ సభ్యుల సహకారంతో రాబోవు 5 సంవత్సరాల్లో 66 డివిజన్ల అభివృద్దే ధ్యేయంగా పని చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం, పాలకవర్గ సభ్యుల సహకారం తో నగరాన్ని మరింత సుందరంగా తీర్చి దిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, బీజేపి పార్టీ జిల్లా అధ్యక్షుడు కృష్ణా రెడ్డి, పాలకవర్గ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



## హత్య కేసులో నిందితులకు రిమాండ్

**ప్రజాపక్షం/దుబ్బాక:** దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని చెల్లాపూర్‌లో కాంగ్రెస్ నాయకుడు వంగ బాల్‌రెడ్డి(61)హత్య కేసులో నిందితులను పట్టుకుని, శనివారం రాత్రి రిమాండ్ తరలించినట్లు దుబ్బాక పోలీసులు తెలిపారు. ఈ కేసు వివరాలను దుబ్బాక సీఐ రాజేష్ వెల్లడించారు. చెల్లాపూర్ కు చెందిన కాంగ్రెస్ నాయకుడు వంగ బాల్‌రెడ్డికి తమ సమీప బంధువులైన వంగా రేణుకారెడ్డి కుటుంభీకులతో కొంత కాలంగా భూ వివాదం నెలకొంది. శుక్రవారం వివాదస్పదమైన భూమిలో బాల్‌రెడ్డి జేసీబీతో చదును చేయిస్తున్నాడు. విషయం తెలుసుకున్న రేణుకారెడ్డి ఆమె కుమారుడు సోమేశ్వర్‌రెడ్డిలు బైక్‌పైన సంఘటన స్థలానికి చేరుకుని, బాల్‌రెడ్డితో గొడవకు దిగారు. ఈక్రమంలో మాట మాట పెరిగి రేణుకారెడ్డిని బాల్‌రెడ్డి తోసేయడంతో ఆమె కుమారుడు సోమేశ్వర్‌రెడ్డి వెంట తెచ్చుకున్న కత్తితో బాల్‌రెడ్డిపై దాడి చేశారు. బాల్ రెడ్డిచేతులను రేణుకారెడ్డి గట్టిగా పట్టుకోగా, సోమేశ్వర్‌రెడ్డి కత్తితో అతడి చాతి, మెడపైన పొడిచారు. బాల్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడని నిర్థయించుకుని అక్కడి నుండి వెళ్లిపోయారు. మృతుడి సోదరి మట్ట నీరజ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిందితుల నుండి కత్తి, బైక్‌లను సీజ్ చేసి, వారిని శనివారం రాత్రి రిమండ్‌కు తరలించినట్లు సీఐ రాజేష్ తెలిపారు.



రైటప్:22డిబికె01: బాల్‌రెడ్డి హత్య కేసులో నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు.

## ప్రభుత్వ భూమి కబ్జాదారులపై చర్యలు: మాజీ జెడ్‌పిటిసి నాగినేని

**ప్రజాపక్షం/ముత్తారం :** ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదివారం మాజీ జడ్పిటిసి జగన్మోహన్ రావు అన్నారు.ముత్తారం మండలం శత్రాజ్ పల్లె గ్రామ శివారులోని 181 సర్వే నెంబర్ 8ఎకరాల ప్రభుత్వ భూమిని భూపాల్ పల్లి జిల్లా,మండలం, వెంకట్రావు పల్లె గ్రామానికి చెందిన వ్యక్తి కబ్జా చేసి అందులో పైపులను వేయడం జరుగుతుందని అట్టి విషయమై గతంలో పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందని అయన తెలిపారు.గతంలో పిర్యాదు చేసినప్పటికీ నామమాత్రం గానే చూసి చూడనట్లు వదిలి వేశారని అన్నారు. ఇప్పటికైనా కబ్జా కు గురైన ప్రభుత్వ భూమిని పరిరక్షించి సర్వే చేసి హద్దులు నియమించి కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ జెడ్పిటిసి నాగినేని జగన్ మోహన్ రావు ఒక ప్రకటనలో కోరారు.



## అంబేద్కర్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి

**ప్రజాపక్షం/గొల్లపల్లి:** జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండల కేంద్రంలో సామాజిక సేవ కార్యకర్త గంగాధర మధుసూదన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంబేద్కర్ నామస్మరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి పాల్గొని మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళిలు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ అనుసరించిన మార్గం ఎప్పటికీ చిరస్మరణీయమని కొనియాడారు. బడుగు బలహీన వర్గాలకు ఆయన చేసిన కృషి వెలకట్టలేనిదని అంబేద్కర్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి అన్నారు. అంబేద్కర్ దేశానికి అందించిన అమూల్యమైన సేవలు సమానత్వం న్యాయం సామాజిక సంస్కరణలో వారి ఆలోచనలు ఆశయాలను దేశంలోని బడుగు బలహీన వర్గాలు ప్రతి ఒక్కరూ స్వేచ్ఛ వాయువులు హక్కులు పొందాలంటే అంబేద్కర్ త్యాగం కృషి మేధస్సు ఉందని కొనియాడారు. కావున దేశ ప్రజలందరూ అంబేద్కర్ సేవలను స్మరించుకోవాలని కోరారు. కల్లు ముఖ్యం కాదు కలం ముఖ్యం అని యువత ముందుండి విద్య ఉద్యోగాల్లో పోటీపడాలని యువత చెడు అలవాట్లకు చెడు ఆలోచనలకు లోను కాకుండా నేటి యు వత దేశానికి ఆదర్శ నిలవాలి.మండలంలోని యువత అంబేద్కర్ గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి మన భారతీయుడైన అంబేద్కర్ ప్రపంచ దేశాలే గౌరవిస్తున్నాయంటే ఆయన ఎంతటి మహనీయుడో తెలుసుకోవలసిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐ దో వార్డ్ సభ్యుడు సంగెం కళ్యాణ్, శాలివాహన కుమ్మరి సంఘం మండల అధ్యక్షుడు సిరికొండ తిరుపతి, బాబు జగ్జీవన్ రామ్ సంఘం అధ్యక్షులు జేరిపోతుల కొమరయ్య, సామాజిక సేవ కార్యకర్త సాతర్ల లక్ష్మణ్, తుడుం దుర్గయ్య, తుడుం లింగయ్య, సుద్దాల రాజలింగు, సిరికొండ వెంకటేష్, చెవులమద్ది రాజయ్య, చెవులమద్ది రాజలింగు, జేరిపోతుల అనిల్, ఏల్పుల రాము, సురేష్, మనుపటి రమేష్, ఎనగందుల సాయి, జక్కుల గంగాధర్, బోడపట్ల రాజకుమార్, సంగెం హరీష్, రంగా, సంతోష్, గ్రామస్తులు, అంబేద్కర్ వాదులు పాల్గొన్నారు.



## సర్కారుపై సమరం

### చలో సెక్రటేరియట్ పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని జగిత్యాల ఆర్.టి.సి డిపోలో ఆదివారం రోజున ఆర్.టి.సి జేఏసీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 24న జరగనున్న "సర్కారుపై సమరం – చలో సెక్రటేరియట్" కార్యక్రమానికి సంబంధించిన ప్రచార పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో నిర్వహించారు. కే.ఆర్ రావు, జి. రామయ్య నాయకత్వం వహించగా సుమారు 20 మంది ఆర్టీసీ ఉద్యోగులు నినాదాలు చేస్తూ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్.టి.సి జేఏసీ ఉద్యోగులు,తదితరులు పాల్గొన్నారు.



# దక్షిణాఫ్రికాతో భారత్ మ్యాచ్..సంజూకు నోఛాన్స్



**అహ్మదాబాద్ :** గ్రూప్–ఎలో టాపర్స్ మధ్య బిగ్ ఫైట్‌కు వేళైంది. అజేయంగా నాకౌట్‌కు దూసుకెళ్లిన భారత్, దక్షిణాఫ్రికాలు సూపర్–8 తొలిపోరులో ఢీకొంటున్నాయి. అహ్మదాబాద్ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ గెలిచిన సఫారీ కెప్టెన్ ఎడెన్ మర్క్రమ్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. నాలుగు మార్పులతో ప్రొటీస్ జట్టు ఆడుతుండగా.. ఏ మార్పులు లేకుండా టీమిండియా బరిలోకి దిగుతోంది. గత సీజన్ ఫైనలిస్టులు భారత్, దక్షిణాఫ్రికా బిగ్ ఫైట్‌కు సిద్ధమయ్యాయి. లీగ్ దశను అజేయంగా ముగించిన ఇరు జట్లు నాకౌట్ పంచ్ విసిరేందుకు అహ్మదాబాద్‌లో ఢీకొంటున్నాయి. పొట్టి ప్రపంచకప్‌లో ఏడుసార్లు తలపడగా 52 రికార్డు టీమిండియా ఆధిపత్యాన్ని చాటుతోంది. అయితే.. మ్యాచ్ విన్నర్లతో కళకళలాడుతున్న ప్రొటీస్‌కు తక్కువ అంచనా వేయడానికి లేదు. ఇక ఈ మ్యాచ్‌లోనైనా ఓపెనర్ అభిషేక్ శర్మ ఫామ్ అందుకోవాలని మేనేజ్‌మెంట్, అభిమానులు కోరుకుంటున్నారు. వరుసగా మూడు డకౌట్‌లతో నిరాశపరిచిన అతడి స్థానంలో చోటు ఆశించిన సంజూ శాంసన్‌కు నిరాశే ఎదురైంది.

**భారత్ తుది జట్టు :** అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), హార్దిక్ పాండ్యా, శివం దూబే, రింకూ సింగ్, వాషింగ్టన్ సుందర్, అర్ష్‌దీప్ సింగ్, బుమ్రా, వరుణ్ చక్రవర్తి.

**దక్షిణాఫ్రికా తుది జట్టు :** ఎడెన్ మర్క్రమ్(కెప్టెన్), క్వింటన్ డికాక్(వికెట్ కీపర్), రియాన్ రికెల్టన్, డెవాల్ బ్రెవిస్, డేవిడ్ మిల్లర్, ట్రిస్టన్ స్టబ్స్, మార్కో యాన్సెన్, కార్బిన్ బాస్చ్, కేశవ్ మహారాజ్, కగిసో రబడ, లుంగి ఎంగిడి.

## వరల్డ్ కప్‌లో గూగుల్ సిఇఒ క్రికెట్ పాఠాలు

పొట్టి ప్రపంచకప్ ఫీవర్ ప్రపంచమంతా పట్టుకుంది. నాకౌట్ మ్యాచ్‌ల వేళ.. అభిమానులే కాదు పలురంగాల దిగ్గజాలు సైతం క్రికెట్‌కు సలామ్ అంటున్నారు. ఈ జాబితాలో గూగుల్ సిఇఒ సుందర్ పిచాయ్ సైతం చేరిపోయారు. అహ్మదాబాద్‌లో భారత్, దక్షిణాఫ్రికా సూపర్–8 మ్యాచ్ సందర్భంగా ఆయన ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మాజీ ఆటగాడు సునీల్ గవాస్కర్‌తో కలిసి ప్రపంచకప్‌ను మైదానంలోని తీసుకువచ్చారు. పదో సీజన్ టి–20 ప్రపంచకప్ టోర్నీకి మాజీ ఆటగాళ్లు.. సాంకేతిక



నిపుణులు కొత్త కళ తీసుకొస్తున్నారు. భారత పర్యటనలో ఉన్న గూగుల్ సిఇఒ సుందర్ పిచాయ్ తనకు ఆటపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుందర్‌కు భారత కెప్టెన్ శుభమన్ గిల్ క్రికెట్ పాఠాలు నేర్పారు. 'ఫుల్ షాట్' ఎలా ఆడాలో గిల్ చూపించాడు. ఓ ఇలానా? అని గూగుల్ బాస్ ఆసక్తిగా గమనించారు. అనంతరం బ్యాట్ అందుకున్న సుందర్ ఫుల్ షాట్ ఆడి సంబురపడ్డారు. అహ్మదాబాద్ స్టేడియం చేరుకున్న సుందర్ టాస్ అనంతరం.. వరల్డ్‌కప్ ట్రోఫీతో తళుక్కుమన్నారు. భారత మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్‌తో కలిసి ట్రోఫీని మైదానంలోకి తీసుకొచ్చారాయన.

## స్పిన్ వ్యూహానికి శ్రీలంక చిత్తు..



సూపర్–8లో ఇంగ్లాండ్ బోణీ..! స్వదేశంలో స్పిన్ అస్త్రంతో ప్రత్యర్థులను బ్బతీయాలనుకున్న శ్రీలంక కు ఇంగ్లాండ్ పెద్ద షాకిచ్చింది. పల్లెకెల్ స్టేడియంలో విల్ జాక్స్(322) తిప్పేయగా.. పవర్ ప్లేలోనే కష్టాల్లో పడిన లంక.. ఏ దశలోనూ కోలు కోలేకపోయింది. 150 పరుగుల ఛేదనలో టాపార్డర్, మిడిలార్డర్ చేతులెత్తేయగా.. కెప్టెన్ దసున్ శనక(30) పోరాడినా సరిపోలేదు. తడబడుతూ సాగిన ఆతిథ్య జట్టు ఇన్నింగ్స్‌కు ఆదిల్ రషీద్(213) తెరదించగా.. 51 పరుగుల తేడాతో గెలుపొందిన ఇంగ్లాండ్ అదిరే బోణీ కొట్టింది. సొంతగడ్డపై చెలరేగాలనుకున్న శ్రీలంకను ఇంగ్లాండ్ స్పిన్ అస్త్రంతో పడగొట్టింది. సూపర్–8లో లంక నుంచి స్పిన్ ముప్పును ఊహించిన హ్యారీ బ్రూక్ సేన అందుకు తగ్గట్టే సన్నద్ధమైంది. కానీ.. తీరా మైదానంలోకి దిగాక ఫిల్ సాల్ట్(62) ఒక్కడే రాణించగా ప్రత్యర్థికి 150 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఫేవరెట్ లంక పల్లెకెలె స్టేడియంలో అలవోకగా గెలుస్తుందని అభిమానులు అనుకున్నారు. కానీ, పవర్ ప్లేలోనే ఇంగ్లాండ్ విజయం దిశగా నడిచింది. డేంజరస్ ఓపెనర్ పథుమ్ నిశాంక(9)ను రెండో ఓవర్‌లోనే ఔట్ చేసి జోఫ్రా ఆర్చర్(2–20) తొలి బ్రేకివ్వగా.. అక్కడి నుంచి విల్ జాక్స్(3–22)తన స్పిన్ మ్యాజిక్ చూపించాడు. రిటర్న్ క్యాచ్‌తో కుశాల్ మెండిస్(4)ను వెనక్కి పంపిన అతడు.. పవన్ రత్నాయకే(0), దునిత్ వెల్లలాగే(10)లను వెనక్కి పంపి ఆతిథ్య జట్టును కష్టాల్లోకి నెట్టాడు. పవర్ ప్లే చివరి ఓవర్లో రెండు ఫోర్లు బాదిన వెల్లలాగే.. మిడాఫ్లో షాట్కు యత్నించి బ్రూక్ చేతికి చిక్కడంతో 34కే లంక ఐదు కీలక వికెట్లు కోల్పోయింది.

# ఆరోగ్యం

## మెరుగైన ఆరోగ్యానికి ఏడు రోజుల మెనూ..



లేవగానే (ప్రతి రోజు ఒకేలా)
గోరువెచ్చని నీరు – 1 గ్లాస్
5 నానబెట్టిన బాదం లేదా,
1 టీస్పూన్ నానబెట్టిన మెంతులు

**సోమవారం...**అల్పాహారం :రాగి జావ +మజ్జిగ
మధ్యాహ్నం ముందు : జామ పండు (చిన్నది)
మధ్యాహ్న భోజనం:2 జొన్న చపాతీలు
పాలకూర పప్పు, దోసకాయ సలాడ్
సాయంత్రం: గ్రీన్ టీ + ఉడికించిన శనగలు
రాత్రి: కూరగాయల సూప్ + 1 చపాతీ

**మంగళవారం...** అల్పాహారం: ఓట్స్ ఇడ్లీ + కూరగాయల చట్నీ, మధ్యాహ్నం ముందు: ఆపిల్ (చిన్నది), మధ్యాహ్న భోజనం: బ్రౌన్ రైస్ (చిన్న ముద్ద), సాంబార్, బెండకాయ కూర, పెరుగు (అర కప్పు), సాయంత్రం: దాల్చిన చెక్క కషాయం, రాత్రి: 2 చపాతీలు + క్యాబేజీ కూర

**బుధవారం...** అల్పాహారం: గోధుమ రవ్వ ఉప్మా (కూరగాయలతో), మధ్యాహ్నం ముందు: నారింజ పండు, మధ్యాహ్న భోజనం: 2 రాగి చపాతీలు, తోటకూర పప్పు, క్యారెట్ సలాడ్, సాయంత్రం: గ్రీన్ టీ + పల్లీలు (చిన్న ముద్ద), రాత్రి: కూరగాయల స్ట్యూ / సూప్

**గురువారం...** అల్పాహారం: ఓట్స్ దోస + సాంబార్, మధ్యాహ్నం ముందు: పియర్ పండు, మధ్యాహ్న భోజనం: బ్రౌన్ రైస్ (చిన్న ముద్ద), మునగాకు పప్పు, సొరకాయ కూర, సాయంత్రం: ఉడికిన కార్న్ (చిన్న కప్పు), రాత్రి: 1–2 చపాతీలు + బీరకాయ కూర

**శుక్రవారం...** అల్పాహారం: బెసన్ వెజ్ చిల్లా, మధ్యాహ్నం ముందు: జామ పండు, మధ్యాహ్న భోజనం: 2 జొన్న చపాతీలు, సాంబార్, బెండకాయ కూర, పెరుగు (అర కప్పు), సాయంత్రం: గ్రీన్ టీ, రాత్రి: కూరగాయల సూప్


**శనివారం...** అల్పాహారం: రాగి దోస + కూరగాయల చట్నీ, మధ్యాహ్నం ముందు: ఆపిల్ (అరటి వద్దు), మధ్యాహ్న భోజనం: బ్రౌన్ రైస్ (చిన్న ముద్ద), పాలకూర, సాంబార్, క్యాబేజీ కూర, సాయంత్రం: ఉడికిన శనగలు, రాత్రి: 2 చపాతీలు + తోటకూర కూర

**ఆదివారం...**అల్పాహారం: వెజిటబుల్ ఓట్స్ ఉప్మా, మధ్యాహ్నం ముందు: నారింజ పండు, మధ్యాహ్న భోజనం: 2 రాగి చపాతీలు, మునగాకు పప్పు, దోసకాయ సలాడ్, సాయంత్రం: గ్రీన్ టీ, రాత్రి: లేత పాలు (అర గ్లాస్) + కూరగాయల సూప్

**ముఖ్యమైన నియమాలు...**
ఉప్పు చాలా తక్కువ
నూనె రోజుకు 2–3 టీ స్పూన్లు మించకూడదు
భోజనం సమయాలు మారకూడదు
రాత్రి భోజనం 7:30 లోపు
చక్కెర, తీపి, వేయించినవి పూర్తిగా వద్దు.

## అరుదైన వ్యాధులపై ప్రయోగాలకు బయోబ్యాంక్


ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన వైద్య, పరిశోధనా సంస్థల శాస్త్రవేత్తలు కలిసి లైసోసోమల్ స్టోరేజ్ డిసార్డర్స్ (ఎల్ఎస్‌డి) అనే అరుదైన జన్యు వ్యాధుల ఉపవ



ర్గానికి సంబంధించిన దేశంలోని తొలి ప్రభుత్వ ఆధారిత జాతీయ బయోబ్యాంక్‌ను ఏర్పాటు చేశారు. ఇది అరుదైన రోగాల పరిశోధన, నిర్ధారణ, జన్యు విశ్లేషణ, భవిష్యత్ చికిత్సా వ్యూహాల అభివృద్ధికి కీలక వేదికగా ఉపయోగపడుతుంది. బయో బ్యాంక్‌లో రోగుల నుండి సేకరించిన జీవ నమూనాలు, జన్యు సమాచార డేటా, క్లినికల్ వివరాలను భద్రపరుస్తారు. జాతీయ బయోబ్యాంక్ స్థాపన భవిష్యత్‌లో మరింత సమర్థవంతమైన చికిత్సల అభివృద్ధికి దోహదపడే అవకాశముంది.

## యాంటీబయాటిక్స్‌కు ప్రత్యామ్నాయం!

కోరం సెన్సింగ్ అనేది బ్యాక్టీరియా మధ్య జరిగే రసాయన సంకేతాల ఆధారిత కమ్యూనికేషన్ వ్యవస్థ. జనాభా సాంద్రత పెరిగే కొద్దీ, బ్యాక్టీరియా ప్రత్యేక సంకేత మాలిక్యూల్స్‌ను విడుదల చేసి పరస్పరం సమాచారాన్ని పంచుకుంటాయి. ఈ ప్రక్రియ ద్వారా వారు తమ జీన్ల వ్యక్తీకరణను సమన్వయం చేసుకుంటారు. ఇటీవలి పరిశోధనలు ఈ వ్యవస్థపై దృష్టి సారించి, యాంటీబయాటిక్స్‌కు ప్రత్యామ్నాయంగా యాంటీకోరం సెన్సింగ్ థెరపీలను అభివృద్ధి చేసే అవకాశాన్ని సూచిస్తున్నాయి. ఇది భవిష్యత్ వైద్య రంగంలో కీలక మార్పుకు దారి తీయవచ్చు. కోరం సెన్సింగ్ వ్యవస్థలో ప్రధాన భాగాలు మూడు: బ్యాక్టీరియా సమూహం, సంకేత మాలిక్యూల్స్, ప్రవర్తనా జీన్లు. బ్యాక్టీరియా విడుదల చేసే ఆటోఇండ్యూసర్లు వాతావరణంలో క్రమంగా పెరుగుతాయి. ఒక నిర్దిష్ట పరిమితి చేరుకున్న తర్వాత, అదే బ్యాక్టీరియా ఈ సంకేతాలను గుర్తించి ప్రతిస్పందన జీన్లను సక్రియం చేస్తాయి. ఫలితంగా వైరులెన్స్ (రోగ కారక శక్తి), బయోఫిల్మ్ నిర్మాణం, హారిజాంటల్ జీన్ ట్రాన్స్‌ఫర్, కంపిటెన్స్ (డిఎన్ఎ స్వీక



రణ సామర్థ్యం) వంటి సమూహ ప్రవర్తనలు ప్రారంభమవుతాయి. ఈ ప్రక్రియలు తగిన జనాభా పరిమాణం ఉన్నప్పుడు మాత్రమే సమర్థవంతంగా పనిచేస్తాయి, అందుకే కోరం సెన్సింగ్ సూక్ష్మ జీవుల్లో సమన్వయానికి కీలక మెకానిజం. ఈ భావనను మొదట 1960ల మధ్యలో హంగేరియన్ మూలాలున్న సూక్ష్మ జీవ శాస్త్రవేత్త అలెగ్జాండర్ టొమాజ్ పరిశీలించాడు. ఆయన 'స్ట్రెప్టోకాకస్ న్యుమోనియా' (గతంలో న్యుమోకొకస్‌గా పిలిచేవారు) బ్యాక్టీరియాలో డిఎన్ఎ స్వీకరణ సామర్థ్యంపై చేసిన అధ్యయనాల్లో ఈ కమ్యూనికేషన్ లక్షణాన్ని గుర్తించారు. దీనివల్ల ఔషధ నిరోధకత సమస్యను తగ్గించే అవకాశం ఉంది. అందువల్ల, కోరం సెన్సింగ్‌పై పరిశోధనలు వైద్యరంగంలో కొత్త చికిత్సా మార్గాలను ఆవిష్కరించే దిశగా ముందుకు సాగుతున్నాయి.

# చెట్టుపట్టాల సమస్యపై శాసనమండలిలో ప్రస్తావిస్తా

### సంక్షేమ పథకాలపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు సరికావు
### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/మర్రిగూడ :** గ్రామీణ పేద రైతుల చెట్టుపట్టాల సమస్యను శాసనమండలిలో ప్రస్తావించి న్యాయం జరిగేలా కృషి చేస్తానని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హామీ ఇచ్చారు. ఆదివారం నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని ఖుదాబక్ష్‌పల్లి సిపిఐ గ్రామ శాఖ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఖుదాబక్ష్‌పల్లి గ్రామంలో గత 6070 సంవత్సరాలుగా చెట్ల నుంచి ఫలాలను సేకరించి జీవనోపాధి పొందుతున్న పేద రైతులకు ఇప్పటికీ చెట్టుపట్టాలు లేకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన వారికి తక్షణమే చెట్టుపట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామంలో గతంలో అనేక పోరాటాలు జరిగాయ ని, ఆ స్ఫూర్తితో హక్కుల సాధన కోసం మరోసారి సంఘటితంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలు గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషిచేయాలని సూచించారు. పేద వర్గాలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలు పేదల జీవన ప్రమాణాలపై ప్రతికూల ప్రభావం చూపే విధంగా ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. మొండి బకాయిల పేరుతో బ్యాంకుల నుంచి కార్పొరేట్ సంస్థలు పొందిన లక్షల కోట్ల రూపాయల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసినప్పుడు సుప్రీంకోర్టు ఎందు కు స్పందించలేదన్నారు. ప్రభుత్వాలు కార్పొరేట్ల కు మద్దతుగా వ్యవహరించిన సందర్భాల్లో న్యాయస్థానాలు స్పందించలేదని, పేదల సంక్షేమ పథకాల విషయంలో మాత్రం వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేదలకు ఉపాధి లేనప్పుడు ప్రభుత్వాలు తప్పనిసరిగా సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు. ఆ పథకాలు లేకపోతే వారి జీవనం కష్టసాధ్యమవుతుందన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించాలని, కార్పొరేట్లకు దోచిపెడుతున్న సంపదపై అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ పోరాటాల ఫలితంగా వేల ఎకరాల భూమి పేదలకు అందిందని గుర్తుచేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఈదుల భిక్షం రెడ్డి,మండల కన్వీనర్ బుర్ర శేఖర్,గ్రామ శాఖ కార్యదర్శి మేదరి యాదయ్య,పొట్ట అశోక్, గిరి ముత్తయ్య, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# పట్టణాభివృద్ధికి సహకారం



### సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్

**ప్రజాపక్షం /మంచిర్యాల :** మంచిర్యాల పట్టణాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు నూతనంగా ఎన్నికైన మేయర్, డిప్యూటీ మేయర్లు చొరవ చూపాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ కోరారు. మంచిర్యాల నగర మేయర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన ధరణి మధుకర్, డిప్యూటీ మేయర్ చల్ల రమ్య మహేష్‌లను ఆదివారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మేయర్ చాంబర్‌లో నూతన కార్యవర్గానికి సిపిఐ జిల్లా నాయకత్వం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ నగరాభివృద్ధిలో భాగంగా మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా వంటి ప్రజల ప్రాథమిక సమస్యల పరిష్కారంపై మేయర్, డిప్యూటీ మేయర్లు చిత్తశుద్ధితో దృష్టి సారించాలని సూచించారు. ప్రజా ప్రయోజనాలే పరమావధిగా సాగే అభివృద్ధి పనులకు సిపిఐ పక్షాన తమ సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు రేగుంట చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగం రవి, జిల్లా సమితి సభ్యులు ఎస్.కె బాజీ సైదా, పూజారి రామన్న, కొనిగంటి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

# కుమ్మరి జాతర ఘటన దుర్మార్గం

### ఎఐఎస్ఎఫ్ ఖండన

**ప్రజాపక్షం/హనుమకొండ :** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మరి జాతరలో జరిగిన చిన్నారి మృతి ఘటన రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా వైఫల్యానికి స్పష్టమైన నిదర్శనం అని, అదేవిధంగా, చిన్నారులు, మహిళల పట్ల అవమానకరంగా, అశ్లీలంగా ప్రవర్తించిన ఘటనలను ఎఐఎస్ఎఫ్ తీవ్రంగా ఖండిస్తోందని హనుమకొండ జిల్లా సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉట్కూరి ప్రణీత్ గౌడ్, బాషబోయిన సంతోష్ తెలిపారు. జాతర వంటి సాంప్రదాయ, సామాజిక వేడుకల్లో ప్రజల భద్రతకు సరైన చర్యలు తీసుకోకపోవడం అత్యంత దురదృష్టకరమని, ఒకవైపు చిన్నారి మృతి చెందడం, మరోవైపు మహిళల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా జరిగిన చర్యలు సమాజంలో పెరుగుతున్న వికృత మనస్తత్వానికి ప్రతిబింబం అని తెలిపారు. మహిళలపై వేధింపులు, అగౌరవకర ప్రవర్తన ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరానివన్నారు. ప్రజా వేడుకల్లో భద్రతా లోపాలు, పర్యవేక్షణ లోపాలు తీవ్ర పరిణామాలకు దారి తీస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని బాధ్యులపై కఠిన శిక్షలు విధించాల్సిన అవసరం ఉందని తెలిపారు. చిన్నారి మృతి పట్ల ఎఐఎస్ఎఫ్ హృదయపూర్వక సంతాపాన్ని వ్యక్తం చేస్తుందన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తోందన్నారు. ఈ ఘటనలో పాలుపంచుకున్న వారిపై తక్షణమే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం, పోలీసు శాఖను డిమాండ్ చేశారు. మహిళల భద్రత కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి కట్టుదిట్టంగా అమలు చేయాలని, జాతరలు, ప్రజా వేడుకల సందర్భంగా తగిన భద్రతా చర్యలు తప్పనిసరిగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. సమాజంలో మహిళల పట్ల గౌరవభావం పెంపొందించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని వారు తెలిపారు.





### ఏజెన్సీ విధానం రద్దుచేసి
# కార్పొరేషన్ ద్వారా వేతనాలివ్వాలి





### వరంగల్‌లో 28న మెడికల్ కాంట్రాక్ట్ కార్మికుల రాష్ట్ర మహాసభ
### యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ :** ఈనెల 28వ తేదీన వరంగల్‌లో నిర్వహించనున్న ప్రభుత్వ ఆసుపత్రుల కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా మెడికల్ కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో పల్లా దేవేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో సంవత్సరాలుగా శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న కార్మికులను ఇప్పటికీ పర్మినెంట్ చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ఉద్యోగ భద్రత లేకుండా అరకొర వేతనాలతో ఏజెన్సీల శ్రమదోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రాణాలను ఫణంగా పెట్టి సేవలందించిన కాంట్రాక్టు కార్మికులకు ప్రభుత్వం భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం అనే సుప్రీం కోర్టు తీర్పు అమలులోకి రాకపోవడం బాధాకరమన్నారు. ఏజెన్సీ విధానం రద్దుచేసి, కార్పొరేషన్ ద్వారా నేరుగా శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న కార్మికులకు జీతభత్యాలు చెల్లించే విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పాత టెండర్లను కొనసాగిస్తూ తక్కువ జీతాలతో పని చేయించడం తక్షణమే ఆపాలని ప్రభుత్వాన్ని కోరారు. వరంగల్‌లో జరిగే భారీ ప్రదర్శన, కార్మిక సభకు మెడికల్ కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎఐటియుసి డివిజన్ కార్యదర్శి విశ్వనాథులు, లెనిన్, యూనియన్ నాయకులు ఎం.యాదగిరి, సిహెచ్.నిర్మల, పి.ఎల్లమ్మ, పద్మ, ఏ.రామేశ్వరమ్మ, అన్నపు లింగస్వామి, సందీప్, మధు, సవిత,కే.నిర్మల,ఉషమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సీతమ్మ మరణం సిపిఐకి తీరని లోటు

### నివాళులర్పించిన బాగం, దండి, మౌలానా, కర్నాటి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల పరిధిలోని భైరవునిపల్లి గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు సతీమణి కనకబండి సీతమ్మ(80) శనివారం అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ప్రవేట్ ఆసుపత్రిలో మృతిచెందారు. ఆదివారం తమ స్వగ్రామం భైరవునిపల్లిలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమీషన్ చైర్మన్ మహమ్మద్ మౌలానా, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భాను ప్రసాద్ తదితరులు సీతమ్మపార్థివదేహానికి ఎర్రజెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా బాగం హేమంతరావు, దండి సురేష్ మాట్లాడుతూ సీతమ్మ పార్టీ కార్యక్రమాల్లో పలు సూచనలు చేసేదని, ఆమె మరణం సిపిఐకి తీరని లోటన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా నాయకులు తాటి వెంకటేశ్వరరావు, గుండపనేని హరినాథ్, గుండపనేని చలపతిరావు, సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, మండల సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, కర్నాటి నళినిరాణి, బాగం నరసింహారావు, పాల్తియ శ్రీనివాసరావు, పాలపాటి అశోక్, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి బాలిన కృష్ణంరాజు, ఆలేటి ఉమామహేశ్‌తో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపుసల సీతారాములు, గొర్రెల మేకల పెంపకదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల మల్లిబాబు, కూరాకుల నాగభూషణం, శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, నల్లని మల్లికార్జునరావు, వల్లాల రాధాకృష్ణ, కె.వి.రెడ్డి, గుడవర్తి నాగేశ్వరరావు, యడ్ల తిరుపతిరావు, పొగర్తి సుధాకర్ ఉన్నారు.



# యూనియన్ల ప్రతిపాదన మేరకే అక్రిడిటేషన్ కమిటీలు

టియుడబ్ల్యుజె (ఐజెయు) వినతికి సానుకూల స్పందన

వెబ్‌సైట్ సమస్యలు పరిష్కరిస్తాం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జర్నలిస్టు యూనియన్ల ప్రతిపాదనల మేరకే అక్రిడిటేషన్ కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం ఖమ్మంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో జర్నలిస్టుల అక్రిడిటేషన్, వెబ్‌సైట్, కేబుల్ ఛానెల్స్, చిన్న పత్రికల సమస్యలపై మంత్రి పొంగులేటికి టియుడబ్ల్యుజె (ఐజెయు) జర్నలిస్టు యూనియన్ నాయకుల బృందం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ సారథ్యంలో వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోల రాంనారాయణ ఈ సందర్భంగా మంత్రికి అన్ని విభాగాల జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. రాష్ట్రంలో 44,709 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇస్తామని చెప్పారని జిఒ ప్రకారం చూస్తే 50 శాతం కార్డులు కూడా రావనే గందరగోళం జర్నలిస్టులలో నెలకొందన్నారు. ఫ్రీలాన్సర్, వెటరన్ జర్నలిస్టులకు పెట్టిన నిబంధనలు ఇబ్బందిగా ఉన్నాయన్నారు. వెబ్‌సైట్ ఫార్మెట్ సులభతరంగా లేదని తెలిపారు. జిల్లా అక్రిడిటేషన్ కమిటీలలో గత సాంప్రదాయం ప్రకారం రిజిస్టర్డ్ యూనియన్ నుంచి లెటర్ పంపితే కమిషన్ కార్యాలయం ఆమోదించి వారిని కమిటీలో సభ్యులుగా తీసుకున్నారని కానీ ఇప్పుడు ఆ విధానం పక్కనపెట్టి కలెక్టర్లకు అధికారం కల్పించారని మంత్రికి వివరించారు. పాత పద్ధతినే కొనసాగించాలని తెలిపారు. జిఒ ప్రకారం పెద్ద పత్రికలు, శాటిలైట్ ఛానెల్స్, డెస్క్ జర్నలిస్టుల కార్డులు తగ్గించడం జరిగిందని దీని వల్ల ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. చిన్న పత్రికలకు కూడా గతంలో మాదిరిగా కార్డులు రావనే ఆందోళన ఉందన్నారు. కేబుల్ ఛానెల్స్ జర్నలిస్టులకు కూడా అన్యాయం జరుగుతుందన్నారు. పలు అంశాలపై సంబంధించి మంత్రి సానుకూలంగా స్పందించారు. యూనియన్ల ప్రతిపాదన మేరకే అక్రిడిటేషన్ కమిటీలు ఏర్పాటు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. వెబ్‌సైట్‌ను కూడా సరళీకరణ చేస్తామని అక్రిడేషన్ల గడువు మరో నెల పొడిగింపు జరుగుతుందన్నారు. అర్హులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు . మంత్రిని కలిసిన వారిలో యూనియన్ రాష్ట్రకమిటీ సభ్యుడు మాటేటి వేణుగోపాల్, మాజీ జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు, యూనియన్ జిల్లా కార్యదర్శి మైసా పాపారావు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు మామిడాల భూపాల్, జర్నలిస్టుల జిల్లా హౌజింగ్ సొసైటీ అధ్యక్షుడు కనకం సైదులు, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మోహినుద్దీన్, జిల్లా కోశాధికారి నాగండ్ల శివానంద, ఖమ్మం నగర అధ్యక్ష, కార్యదర్శులు చెరుకుపల్లి శ్రీనివాస్, జనార్ధన్‌చారి, జిల్లా నాయకులు యేగినాటి మాధవరావు, ఏలూరి వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎఐఎస్ఎఫ్ రాష్ట్రసమితి సభ్యుడిగా గుగులోత్ వంశీ ఎన్నిక

**ప్రజాపక్షం/జూలూరుపాడు :** ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడిగా జూలూరుపాడు మండలం మచినపేట గ్రామానికి చెందిన గుగులోత్ వంశీని ఎన్నుకున్నారు. అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) రాష్ట్ర నాల్గవ మహాసభలు నిజాంబాద్ జిల్లా వేదికగా జరిగాయి. ఈ మహాసభల వేదికగా ఈ ఎన్నిక చోటు చేసుకుంది. నూతనంగా విద్యారంగంలో వస్తున్న మార్పులపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఈ మహాసభ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా రాష్ట్ర సమితి సభ్యుడిగా ఎన్నికైన వంశి మాట్లాడుతూ, ప్రభుత్వానికి విద్యారంగం పట్ల సరైన విధానం లేదని, ప్రభుత్వ విద్యారంగ బలోపేతం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోనేలా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని నింపడం కోసం కృషి చేస్తామని, మతోన్మాద భావాజాలాన్ని విద్యాసంస్థల్లో అరికట్టేందుకు పోరాటాలు నిర్వహిస్తామని చెప్పారు. విద్యారంగంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల విద్య సామాన్యులకు అందని ద్రాక్షలా మిగిలిపోతుందని విద్య వ్యాపారంగా మారి ప్రభుత్వ విద్యారంగాన్ని మరింత బలహీనత చేస్తూ కార్పొరేట్ విద్యాసంస్థలకు దాసోహమవుతున్నారని అన్నారు. భద్రాద్రి జిల్లా అంటేనే కమ్యూనిస్టులకు కంచుకోటని, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో, జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా సూచనలు, సలహాల మేరకు విద్యారంగ సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు నిర్వహిస్తామన్నారు.

## మౌలానా అబుల్ కలాంకు నివాళులు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతిని కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో ఆదివారం నిర్వహించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ 68వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య పోరాటంలో, తొలి విద్యాశాఖ మంత్రిగా ఆయన దేశానికి అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అనుబంధ సంఘాల అధ్యక్షులు సయ్యద్ గౌస్, ముజాహిద్ హుస్సేన్, మొక్కా శేఖర్ గౌడ్, బొడ్డు బొందయ్య, విప్లవ్‌కుమార్, ఎం. గంగరాజు, సూర్యనారాయణ, రామకృష్ణ, జహీర్, గోపాల్, అనిల్‌కుమార్, ప్రవీణ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ప్రవేశానికి నిర్వహించిన పరీక్ష జిల్లాలో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. 2025– 26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదవ తరగతి, ఆరు నుంచి తొమ్మిదవ తరగతి వరకు కామన్ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 17 సెంటర్లలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించారు. ఇట్టి ప్రవేశ పరీక్షకు జిల్లాలో 6,346 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 5,997 మంది విద్యార్థులు హాజరయ్యారు. 349 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 94.50 శాతం నమోదైంది. స్పోర్ట్ ఆఫీసర్ బి. రుతుమణి పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్ష నిర్వహణను పరిశీలించారు.


## సమస్యల పరిష్కారానికి కృషి

చైర్‌పర్సన్ రెహానా



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** సత్తుపల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ రెహానా కమల్ పాషా శనివారం ఉదయం 5 గంటలకు మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకుని, మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచేందుకు అందరూ కలిసి కృషి చేయాలని సూచించారు. కార్మికులు ఎదుర్కొంటున్న ఏవైనా ఇబ్బందులు తన దృష్టికి తీసుకువస్తే వాటిని ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలను ప్రశంసిస్తూ, వారి ఆరోగ్యం, సంక్షేమం మున్సిపాలిటీ అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. అనంతరం కార్మికులకు రాగి జావ, జొన్న జావలను అందించి అల్పాహార ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కార్మికులు చైర్‌పర్సన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## బస్సుషెల్టర్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వినతి



**ప్రజాపక్షం/మణుగూరు :** మణుగూరు ప్రధాన రహదారి అంబేద్కర్ సెంటర్ దగ్గర చాలా కాలంగా బస్ షెల్టర్ లేక వానకు తడుస్తూ ఎండకు ఎండుతూ చలికి గజగజ వణుకుతూ ప్రయాణికుల ఇక్కట్లు అంతా అంతా కాదు. గతంలో నిర్మించిన బస్సు షెల్టర్ రోడ్డు విస్తరణలో తీసివేయడంతో అప్పటినుండి చెట్టు కిందనే బస్ షెల్టర్ గా భావిస్తూ ప్రయాణికుల రాకపోకలు జరుగుతున్నాయి. ఇటీవల స్థానిక మున్సిపల్, పోలీస్ శాఖ మోడల్ బస్ షెల్టర్ నిర్మాణానికి ముందుకు వచ్చిన చాలా కాలంగా కార్యరూపం దాల్చకపోతుంది. దయచేసి సంబంధిత శాఖ వారు కొత్త బస్సు షెల్టర్ నిర్మాణానికి యుద్ధ ప్రతిపాదికన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## వారంలో రెండుగంటలు ప్రజల్లో ఉండాల్సిందే

మున్సిపల్ చైర్‌పర్సన్‌గా అనిత బాధ్యతలు స్వీకరణ

కౌన్సిలర్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దిశా నిర్దేశం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఎన్నికల వరకే రాజకీయం.. గెలిచిన తర్వాత ఏ పార్టీవారైనా ప్రజా ప్రభుత్వం తరఫున పేదవాడికి సేవ చేయాల్సిందేనని రాష్ట్ర రెవిన్యూ,గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం పెద్దతండాలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత బాధ్యతల స్వీకరణలో ముఖ్య అతిథిగా మంత్రి పాల్గొన్నారు. అలాగే 32వార్డుల కౌన్సిలర్లను శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ప్రజలు నమ్మి ఓటేశారని, కేవలం కుర్చీలకే పరిమితం కాకుండా నిత్యం క్షేత్రస్థాయిలో ఉండాలని ఆదేశించారు. ప్రతి కౌన్సిలర్ వారంలో ఐదురోజుల, ఉదయం పూట రెండు గంటలు తప్పనిసరిగా వార్డుల్లో పర్యటించాలన్నారు. ప్రతి పనికి నిధులు అవసరం లేదు, మీరు బాధ్యతగా తిరిగితేనే అధికారులు, సిబ్బంది పనితీరు మెరుగుపడుతుందన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా తీర్చి దిద్దుతానని, తాగునీటి సమస్యలు, మురికి నీరు నిలవకుండా చూడాలన్నారు. నాలాల కబ్జాలను అడ్డుకోవడంపై యుద్ధ ప్రతిపదికన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 15రోజులలో మళ్లీ సమీక్ష నిర్వహిస్తానని, అప్పటికి ప్రతి వార్డు సమస్యపై కౌన్సిలర్లకు పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. అనంతరం సత్యనారాయణపురంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుడి గృహ ప్రవేశ వేడుకకు మంత్రి హాజరయ్యారు. నూతన గృహంలోకి అడుగుపెట్టిన కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఆత్మీయంగా పట్టు వస్త్రాలను కానుకగా అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కాంగ్రెస్, సిపిఐ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ కార్పొరేటర్లకు సన్మానం



**ప్రజాపక్షం/పాల్వంచ :** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పాల్వంచ పరిధి 40, 44 డివిజన్‌లలో కార్పొరేటర్లుగా గెలుపొందిన సిపిఐ పట్టణ కార్యదర్శి అడుసుమిల్లి సాయిబాబ, సిపిఐ జిల్లా కమిటి సభ్యుడు వీసంశెట్టి విశ్వేశ్వరరావులను సిపిఐ పట్టణ మాజీ కార్యదర్శి కొమ్మవరపు దాం, ఎంఆర్‌పిఎస్ దండోరా నాయకులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం చంద్రా రాజేశ్వరరావు భవన్‌లో శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సంధర్భంగా వారికి రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్, శ్రీ వేంకటేశ్వరస్వామి ఫోటోలను బహుకరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, శనిగారపు శ్రీనివాస్, లాల్‌పాషా, మడుపు ఉపేంద్రాచారి, రామడుగు రామాచారి, కాంగ్రెస్ నాయకులు అట్లూరి సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

## టిజి పాలిసెట్ –2026పై సమావేశం



**ప్రజాపక్షం/మణుగూరు :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో 10 వ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై అవగాహన కల్పించుటకు ఆదివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యోగితా రాణా, ఐఎఎస్, టిజి ఎస్‌బిటి ఇటి కమిషనర్ దేవసేన, ఐఎఎస్, కార్యదర్శి పుల్లయ్య ఆదేశాల మేరకు టిజి పాలిసెట్ 2026పై అవగాహన కల్పించారు. రాష్ట్రంలో ప్రవేశపెట్టిన కొత్త డిప్లొమా కోర్సులు మరియు డిప్లొమా పూర్తిచేసిన తర్వాత లభించే ఉద్యోగ అవకాశాలపై ప్రత్యేక వీడియోను ప్రదర్శించారు. గవర్నమెంట్ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ మణుగూరులో ఎలక్ట్రికల్, మెకానికల్, మైనింగ్ బ్రాంచ్‌లతో పాటు కొత్తగా డిప్లొమా ఇన్ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ కోర్సు ప్రారంభించబడింది. ఏజెన్సీ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. ఈ కార్యక్రమం కళాశాల ఒఎస్‌డి/ప్రిన్సిపాల్ బి. నాగముని నాయక్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పి.వి.వి. రమణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఇన్‌చార్జ్ హెడ్‌లు కె. ప్రతాప్,బి. కృష్ణ, కె. ప్రసాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, ఇన్‌చార్జ్ హెడ్‌లు, సిబ్బందిని ఒఎస్‌డి అభినందించారు.

## 'నార్కెట్‌పల్లిలో హత్య.. పాలేరులో శవం'

బొగ్గుల శ్రీనివాస్ హత్య కేసును

ఛేదించిన కూసుమంచి పోలీసులు

ఖమ్మంరూరల్ పోలీస్ స్టేషన్‌లో

వివరాలు వెల్లడించిన ఎసిపి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఈనెల 15వ తేదీన కలకలం రేపిన రచయిత, యూట్యూబర్ బొగ్గుల శ్రీనివాస్ హత్య కేసును కూసుమంచి పోలీసులు ఛేదించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఖమ్మంరూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎసిపి తిరుపతి రెడ్డి విలేకరులకు వెల్లడించారు. ఆర్థిక లావాదేవీల వివాదమే శ్రీనివాస్ దారుణహత్యకు దారి తీసినట్లు పేర్కొన్నారు. శ్రీనివాస్, వేణుమాధవ్‌రెడ్డి ఇద్దరు జూబ్లీ కాలేజీలో చదువుకున్నారు. కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి హాజరైన సందర్భంలో ఒకరికొకరు పరిచయం అయ్యారు. బొగ్గుల శ్రీనివాస్‌కు బొగ్గుల బిబిక్యూ పేరుతో జిఎస్టి లైసెన్స్ ఉంది. వేణుమాధవరెడ్డి మేక ప్రాజెక్ట్స్ పేరుతో ఓ కంపెనీ స్థాపించి సబ్ కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నాడు. ఇందుకు రూ.కోటి పైనే జిఎస్టి జరిమానా చెల్లించాల్సిన కారణంగా ఇరువురి మధ్య తీవ్ర విభేదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో వేణుమాధవ్ రెడ్డి శ్రీనివాస్‌ను హత్య చేయాలని నిశ్చయించుకున్నాడు. ఈ మేరకు అశ్వారావుపేటకు చెందిన పోకల కోటేశ్వరరావు, షేక్ అబ్దుల్ హఫీజ్, మహ్మద్ అజ్మత్‌అలీఖాన్‌తో కలిసి హత్యకు కుట్ర పన్నాడు. ఇందుకు గాను ముఠాకు రూ.5లక్షలు మొత్తాన్ని వేణుమాధవ్‌రెడ్డి సుపారీగా చెల్లించాడు. ముందస్తు ప్రణాళిక ప్రకారం శ్రీనివాస్‌కు జిఎస్టి డబ్బులు చెల్లిస్తానని, ముఠాతో నమ్మించి ఈ నెల 13న విజయవాడకు నిందితులు అతని కారులోనే తీసుకొని వెళ్లారు. ఆ మరుసటి రోజు తెల్లవారుజామున నకిరేకల్, జనగామ వైపునకు వెళ్లే దారిలోని నార్కట్‌పల్లి సమీపంలో కత్తులు, ఐరన్ రాడ్లతో శ్రీనివాస్ తలపై కొట్టి, పొడిచి దారుణంగా హత్య చేశారు. అటు తర్వాత రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు పథకరచన చేశారు. మృతదేహాన్ని కారులో తీసుకెళ్లి పాలేరు రిజర్వాయర్‌లోకి పడేసి, కారు అదుపుతప్పి ప్రమాద ఘటనగా నమ్మించేయత్నం చేశారు. ఈ నేపథ్యంలో ఛాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు నాలుగు టీంలుగా దర్యాప్తును విజయవంతంగా పూర్తి చేశారు. పైన పేర్కొన్న నిందితులను అదుపులోకి తీసుకొని, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

**పోలీసులకు రివార్డు...**

కేసును విజయవంతంగా దర్యాప్తు చేసిన పోలీసులకు ఎసిపి రివార్డును అందించారు. కూసుమంచి సిఐ సంజీవ్, కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం ఎస్‌ఐలు నాగరాజు, సంతోష్, జగదీష్, ప్రొబేషనరీ ఎస్‌ఐ దివ్యను అభినందించారు. అలాగే ఈ కేసులో సహకరించిన కానిస్టేబుళ్లు శ్రీకాంత్, సతీష్, వినయ్, ఉదయ్, పూర్ణచందర్ రావు, శ్రీశైలం, శ్రీలత, సయ్యద్, శోభన్, సీతారాములు, హోంగార్డు రాంబాబులను ప్రశంసించారు.

## స్కౌట్స్ అండ్ గైడ్స్ సామాజిక సేవలు స్ఫూర్తిదాయకం




**ప్రజాపక్షం/మణుగూరు :** స్కౌట్స్ అండ్ గైడ్స్ సామాజిక సేవలు ఎంతో స్ఫూర్తిదాయకం అని ఎస్‌ఒటు జిఎం బి. శ్రీనివాసాచారి అన్నారు. మణుగూరు ఏరియా పీవీ కాలనీ సింగరేణి పాఠశాలలో ఆదివారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సింగరేణి జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో "వరల్డ్ థింకింగ్ డే" కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన వరల్డ్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకుడు రాబర్ట్ బాడెన్‌పావెల్ చిత్రపటానికి పూలమాలలు అర్పించి నివాళులు ఘటించారు. అనంతరం స్కౌట్స్ అండ్ గైడ్స్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్. రమేష్, డిజిఎం (పర్సనల్) పాల్గొని విద్యార్థులకు మార్గనిర్దేశనం చేశారు. ఎఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ వై. రాంగోపాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్. కల్యాణి, గైడ్స్ టీచర్ బి.సరిత విద్యార్థులతో కలిసి సర్వమత ప్రార్థన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మాట్లాడుతూ, యువతలో స్నేహభావం, సేవా దృక్పథం, క్రమశిక్షణ మరియు నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ చేస్తున్న సేవలను అభినందించారు. ఇదే ఏడాది వరల్డ్ థింకింగ్ డే 1926లో ప్రారంభమైనప్పటి నుంచి 100వ సంవత్సరంగా నమోదు కావడం ప్రత్యేక ఘనతనిస్తుంది అని అన్నారు. గత ఒక శతాబ్ద కాలంలో స్కౌటింగ్ గైడింగ్ ఉద్యమం ప్రపంచవ్యాప్తంగా బాల విద్య, నాయకత్వం, సేవాభావం పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషించిందని ఆయన తెలిపారు. అలాగే ప్రపంచవ్యాప్తంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ మధ్య స్నేహబంధం, పరస్పర గౌరవం, సహకారం, ఐక్యతను పెంపొందించడం ద్వారా శాంతి, సామరస్యానికి దోహదం చేయాలని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరేందుకు ప్రోత్సహించాలని కోరారు. ఈ సందర్భంగా సింగరేణి పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్య గీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమం చివరిలో నిర్వహించిన శాంతి యాత్ర ర్యాలీని ముఖ్య అతిథి జెండా ఊపి ప్రారంభించారు. పాఠశాల నుండి కాలనీ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో గౌరవ అతిథులు, ఉపాధ్యాయులు, స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షకులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ వై. రాంగోపాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్. కల్యాణి, స్కౌట్స్ అండ్ గైడ్స్ కెప్టెన్ బి. సరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

## చేనేత అవార్డుకు మార్చి 31 దరఖాస్తు గడువు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మార్చి 31 లోగా కొండా లక్ష్మ ణ్ బాపూజీ రాష్ట్ర అవార్డుకు చేనేత కళాకారులు దరఖాస్తు చేసుకోవాలని చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు ఎం. విజయలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేనేత కళాకారులకు కొండా లక్ష్మ ణ్ బాపూజీ రాష్ట్ర అవార్డునకు ఔత్సాహికుల నుండి దరఖాస్తులు కోరుతుందని ఈ అవార్డులు చేనేత కళాకారులు, చేనేత డిజైనర్లకు వారి వృత్తిలో నైపుణ్యత, ప్రత్యేకతల ఆధారంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. అవార్డు గ్రహీతలకు రూ. 25వేల నగదు బహుమతి, చేనేత శాలువ, మెమోంటో, మెరిట్ సర్టిఫికెట్‌తో సత్కరించనున్నట్లు తెలిపారు. 2025 డిసెంబర్ 31 నాటికి చేనేత కళాకారులకు 30 ఏళ్ల వయస్సు పైబడి చేనేత రంగంలో 10 ఏళ్లకు తగ్గకుండా అనుభవం, చేనేత డిజైనర్లు 25 ఏళ్ల పైబడి వయస్సు, చేనేత డిజైన్స్ రంగంలో ఐదేండ్లకు తగ్గకుండా అనుభవం కలిగి ఉండాలన్నారు. అర్హతలు కలిగిన ఔత్సాహికులు నిర్ణీత దరఖాస్తు ఫారం నింపి 2026 మార్చి 31 లోగా సహాయ సంచాలకులు, చేనేత, జౌళి శాఖ హన్మకొండ కార్యాలయంలో సమర్పించాలన్నారు. తదుపరి వచ్చే దరఖాస్తులు స్వీకరించబడవని, 2026 మే 15 లోపు దరఖాస్తుదారుడి ఉత్పత్తిని తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. దరఖాస్తు ఫారం, ఇతర వివరాల కోసం సహాయ సంచాలకులు చేనేత, జౌళి శాఖ హన్మకొండ కార్యాలయంలో సంప్రదించాలని చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు విజయలక్ష్మి తెలిపారు.

## సమాచార హక్కును దుర్వినియోగం చేస్తున్న అధికారులు




**ప్రజాపక్షం/పాల్వంచ :** మున్సిపల్ రహదారిని ఆక్రమించి అక్రమంగా మేకల షెడ్ నిర్మించారు. దీనితో చుట్టు పక్కల నివసిస్తున్న వారికి దుర్గంధం వెదజల్లుతోందని వెంటనే మేకల షెడ్‌ను తొలగించాలని చేసిన ఫిర్యాదును మున్సిపల్ అధికారులు ఎంత మాంత్ర పట్టించుకోవటం లేదని పిండిపోలు సీతాలక్ష్మి విమర్శించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మార్కెట్ ఏరియా స్వాతీ స్కూల్ రోడ్ ఏరియాలో గత రెండు సంవత్సరాలుగా ఓ వ్యక్తి మున్సిపల్ రోడ్‌ను ఆక్రమించి మేకల షెడ్ ఏర్పాటు చేశారని అన్నారు. మేకల మల, మూత్ర విసర్జనతో కాలుష్యం పెరిగి, దోమలు, ఈగలు వ్యాప్తి చెంది తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని చెప్పారు. దీనితో చుట్టు పక్కల నివాసం ఉండే వారికి ఇబ్బందిగా మారిందన్నారు. దీనిపై పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు తూతూ మంత్రంగా తనిఖీ చేసి చేతులు దులుపుకొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సమాచార హక్కు చట్టాన్ని ఉపయోగించి మేకల షెడ్డుపై తీసుకొన్న చర్యలపై ఫిర్యాదు చేయగా అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదని అధికారులు తెలిపారని ఆరోపించారు. ఇటు ప్రజలను, అటు చట్టాన్ని నీరు గార్చుతున్న మున్సిపల్ అధికారులపై ఉన్నతాధికారులు తగు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

## శిక్షణా తరగతుల్లో కాంగ్రెస్ అధ్యక్షుడు : నూతి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణ తరగతుల్లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ పాల్గొన్నారు. సంఘటన్ శ్రీజన్ అభియాన్‌లో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణ తరగతులు వికారాబాద్ సమీపంలోని అనంతగిరిలో జరుగుతున్నాయి. రెండవ రోజు ఆదివారం శిక్షణా కార్యక్రమంలో తెలంగాణ పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ తో కలిసి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ పాల్గొన్నారు. శిక్షణలో భాగంగా నూతి సత్యనారాయణ గౌడ్ నూలు వడికారు. ఈ శిక్షణా కార్యక్రమంలో కాంగ్రెస్ నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి

**ప్రజాపక్షం/తొర్రూరు :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని కొమ్మనపల్లి తండా గ్రామ సర్పంచ్ భూక్య స్వరూప నరేందర్ అన్నారు. ఆదివారం గ్రామ పంచాయతీ పరిధిలో పది లక్షల నిధులతోసిసి రోడ్డు పనులకు స్థాని కులతో కలిసి సర్పంచ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, టిపిసిసిఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డిల సహకారంతో నిధులు మంజూరు చేయించి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామంలో సమస్యలు లేకుండా అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాద్య మేఘ్యానాయక్, వార్డు సభ్యులు గుగులోతు మంగీలాల్, పాద్య బాలాజీ, గుగులోతు జ్యోతి, స్థానికులు మహేందర్, మంగ్యా, అనిల్, దామ్లా, చందులాల్, బిచ్చ, రమేశ్, లక్ష్మి, తిరుపతి, రవి, యాకూబ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## స్కౌట్స్ అండ్ గైడ్స్ డే వేడుకలు




**ప్రజాపక్షం/భూపాలపల్లి:** భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ దినోత్సవ సందర్భంగా భూపాలపల్లి ఏరియా ఆధ్వర్యంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫౌండర్ రాబర్ట్ స్టీఫన్ స్మిత్ బెడన్ పావెల్ జన్మదినాన్ని పురస్కరించుకొని వరల్డ్ థింకింగ్ డే కార్యక్రమాన్ని ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ బిక్ష మయ్య జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, స్కౌట్స్ అండ్ గైడ్స్ లో చేరడం వలన క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందుతాయని తెలిపారు. భూపాలపల్లి ఏరియాలో స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు, విస్తృతం చేయవలసిన అవసరం ఉందని, స్కూల్ పిల్లలు ఇప్పటి నుండే క్రమశిక్షణ, సేవా భావంతో ఉండడానికి ఈ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శ్రావణ్ కుమార్, క్లర్క్ శివ, స్కౌట్స్ లీడర్స్ వి. శ్రీనివాసరావు, రాజమౌళి, స్వామి, తిరుపతి, సూర్య, రమేష్, స్కౌట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు : కలెక్టర్

**ప్రజాపక్షం/వెల్దుర్తి:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. ఆదివారం కలెక్టర్ వెల్దుర్తి మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. రిజిస్టర్లు పరిశీలించి వైద్య సేవలపై ఆరా తీశారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు చేయించుకునేలా గర్భిణులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. బీపి షుగర్ వ్యాధిగ్రస్తులను గుర్తించి ప్రతి నెలా ఉచితంగా మందులను పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంటాయని వారికి తెలియజేయాలన్నారు. వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం

### రవాణాశాఖ మంత్రి హామీపై ఉద్యమకారుల హర్షం



**ప్రజాపక్షం/మహాదేవపూర్;** ఉద్యమకారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేయడంపై ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేసారు.ఆదివారం మండలకేంద్రంలోని ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు సట్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సట్ల సత్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం త్యాగాలు చేసిన మరువలేనివని వారికిచ్చిన హామీల ప్రకారం 250 గజాల ఇంటి స్థలాలతో పాటు వివిధ డిమాండ్లను అమలు చేయాలని కోరారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిందని ఉద్యమకారుల త్యాగాలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చి హామీలపై తీసుకున్న నిర్ణయం అభినందనీయమని అన్నారు. ఉద్యమకారుల ఫోరం నాయకులు వామన్‌రావు,కలికోట దేవేందర్,అన్కారి ప్రభాకర్,జాడి గట్టయ్య,అక్రమొద్దీన్,వెన్నపెల్లి మహేష్, పెంద్యాల మనోహర్,ప్రవీణ్ కుమార్,పోత రమేష్,తుంగల సమ్మయ్య, కిష్టయ్య పాల్గొన్నారు.

## వత్సవాయి సత్యవతికి మంత్రి సీతక్క నివాళి



**ప్రజాపక్షం/వాజేడు:** ములుగు జిల్లా వాజేడు మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వత్సవాయి జగన్నాథ రాజు తల్లి వత్సవాయి సత్యవతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబాన్ని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్ ఆదివారం పరామర్శించి మృతి చెందిన సత్యవతి చిత్రపటానికి నివాళులు అర్పించారు. అలాగే వాజేడు మండల కేంద్రంలోని నాగారం సర్పంచ్ ఆధ్వర్యంలో వాజేడుకు పుష్కర్ ఘాటు ఏర్పాటు చేయాలని, మండల కేంద్రంలో గోదావరి అతి సమీపంలో శివాలయం, రామాలయం అందుబాటులో ఉండడం వలన భక్తులు అధిక సంఖ్యలో వస్తారని మంత్రి సీతక్కకు తెలపడంతో ఆమె స్పందించారు. అలాగే గోదావరి పరివాహక ప్రాంతంలో గోదావరి పుష్కరాలు నాటికి బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల్లో మెరుగైన వసతులు కల్పించాలని దీనికోసం నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి సీతక్క తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వెంకటాపురం సిఐ ముత్యం రమేష్, వాజేడు ఎస్సై జక్కుల సతీష్ కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దంతులూరి విశ్వనాథ ప్రసాదు, ములుగు కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ బాబు మాజీ సర్పంచ్ తల్లడి ఆదినారాయణ, మాజీ జెడ్పిటిసి, తల్లడి పుష్పలత, కాంగ్రెస్ నాయకులు పోలూరు వేణు, బోదెబోయిన నాని బాబు, సర్పంచులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికే

# "మన వాడకు– మన నాయిని"

**రెండేళ్ల ప్రగతి ఒకవైపు – భవిష్యత్ అభివృద్ధి మరో వైపు**

**పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి**



**ప్రజాపక్షం/హనుమకొండ:** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వేగంగా పరిష్కరించడమే లక్ష్యంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి 'మన వాడకు –మన నాయిని' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఈ రెండు సంవత్సరాల్లో సాధించిన అభివృద్ధిని ప్రజలకు వివరించడంతో పాటు, రానున్న కాలంలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై కార్యాచరణ రూపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామని ఎమ్మెల్యే తెలిపారు.ఆదివారం కాజీపేట 47వ డివిజన్‌లో బల్దియా మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ తో కలిసి విస్తృత పర్యటన నిర్వహించారు. పలు కాలనీలలో పర్యటిస్తూ ప్రజలతో మమేకమై వారి సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు.మొదట బూడిదగడ్డఇఎల్‌సిలో లోకో షెడ్ ప్రాంతాన్ని పరిశీలించారు. పైభాగం నుంచి వచ్చే నీరు డ్రైనేజీ సౌకర్యం సరిగా లేక కిందికి వెళ్లడంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని గుర్తించారు. డ్రైనేజీ వెడల్పు పెంపుతో పాటు కొత్త డ్రైనేజీ నిర్మాణానికి రైల్వే శాఖ అధికారులతో సమన్వయం చేసి అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు.అనంతరం కడిపికొండ రైల్వే బ్రిడ్జి రోడ్డు మరమ్మత్తులు, సమీప చెరువును పరిశీలించారు. బోడగుట్టలో నిర్మాణం పూర్తి చేసిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు. బోడగుట్ట చెరువు పరిసర ప్రాంతాల్లో అంతర్గత రోడ్ల పరిస్థితిని పరిశీలించి, తక్షణమే అంచనాలు తయారు చేసి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.ఇంపీరియల్ కాలనీలో అంతర్గత రోడ్ల నిర్మాణం, సైడ్ డ్రైనేజీ పనులను త్వరితగతిన చేపట్టాలని సూచించారు.ప్రజలకు మౌలిక సదుపాయాలు అందించడంలో ఎటువంటి ఆలస్యం సహించబోమని స్పష్టం చేశారు.తదుపరి ఇంపీరియల్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో డివిజన్‌కు చెందిన బూత్ కమిటీ సభ్యులు, ఏజెంట్లతో సమావేశమై ప్రభుత్వ పథకాల అమలు, ప్రజలతో భాగస్వామ్యం పెంపు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై చర్చించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం, వెంటనే పరిష్కార దిశగా అడుగులు వేయడం మా బాధ్యత. రెండేళ్లలో చేసిన అభివృద్ధి పనులు ఒకవైపు ఉంటే, రానున్న రోజుల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగడం మరో వైపు. 26 డివిజన్‌లలో ఈ కార్యక్రమం నిర్వహించి ప్రతి ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం అని పేర్కొన్నారు.పర్యటనలో తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యపై పత్రాలు స్వీకరించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు,ప్రజలు పాల్గొన్నారు.

## రూ. 4.5 కోట్లతో ఎమ్మెల్యే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 56వ డివిజన్ గోపాలపురం పరిధిలో ప్రగతి నగర్, ఎస్సీ కాలనీ, ఎల్‌ఐసీ కాలనీ, బ్యాంకు కాలని, ఎఫ్ సిఐ కాలని, సాయి కృష్ణ కాలనీ, సదాశివ కాలనీ, మారుతీ కాలనీ, సురేంద్రపురి కాలనీ 1, ఉషోదయ కాలనీ, సాయి నగర్ కాలనీ, సురేంద్రపురి కాలనీ 2, పోలీస్ కాలనీ, సప్తగిరి కాలని, పరిమళ కాలనీలలో సుమారు 4.5 కోట్ల రూపాయల నిధులతో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాల కార్యక్రమాలలో మేయర్ గుండు సుధారాణితో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కెఆర్ నాగరాజు కలిసి పాల్గొన్నారు. తొలుత బైక్ ర్యాలీగా ప్రతి కాలనీకి వెళ్ళగా తమ అభిమాన నాయకుడికి మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు.అనంతరం పరిమళ కాలనీలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో గజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ "ప్రగతి నగర్, ఎల్‌ఐసీ కాలనీ, సాయి నగర్, సురేంద్రపురి, పోలీస్ కాలనీ, ఎస్సీ కాలనీ, బ్యాంకు కాలనీ, ఎఫ్ సీఐ కాలనీ, సాయి కృష్ణ కాలనీ, సదశివ కాలనీ, మారుతీ కాలనీ, సురేంద్రపురి కాలనీ1, ఉషోదయ కాలనీ, సురేంద్రపురి కాలనీ2, సప్తగిరి కాలనీ, పరిమళ కాలనీలలో రోడ్లు ,డ్రైనేజీ సమస్యలు సమస్యలనటిని త్వరితీగ తన ఒక్కొక్కటిగా పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. రోడ్లు డ్రైనేజీల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా రూ. 4.5 కోట్ల నిధులను కేటాయించిందని, ఈ అభివృద్ధి కార్యక్రమాలు పూర్తయిన తర్వాత, కాలనీల ప్రజలకు రవాణా సౌలభ్యం, భద్రత, నీటి నికాసు సమస్యల నుండి ఉపశమనం లభిస్తుందని ఆయన తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను కూడా ప్రారంభించి, ప్రతీ కాలనీ, ప్రతి పౌరుడికి మరింత సౌకర్యం, మంచి జీవన ప్రమాణాలు అందించేలా చర్యలు చేపడతామన్నారు."రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించడం ద్వారా అభివృద్ధి చేసే వ్యక్తికి ప్రజా ప్రభుత్వానికి ప్రతీ ఒక్కరు అండగా నిలవాలి. అభివృద్ధి, మౌలిక సౌకర్యాల పనులు వేగవంతంగా సాగేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి అందరూ అండగా నిలువాలని ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, మహిళలు, యూత్, కాలనీ వాసులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడే శివ భక్త మార్కండేయ దేవాలయం ద్వితీయ మహోత్సవం

### హాజరుకానున్న మంత్రి కొండా సురేఖ

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వరంగల్ నగరంలోని 34 డివిజన్ శివనగర్ లోని శ్రీ శివ భక్త మార్కండేయ దేవాలయం ద్వితీయ వార్షిక మహోత్సవం నేడు 23 సోమవారం నిర్వహిస్తున్నామని ఆలయ అభివృద్ధి కమిటీ పద్మశాలి భవన సమితి అధ్యక్షుడు వడ్నాల మల్లయ్య, కన్వీనర్ వడ్నాల సదానందం, ప్రధాన కార్యదర్శి బుదారపు భాస్కర్ తెలిపారు. ఆదివారం ఉదయం భక్త మార్కండేయ దేవాలయంలో ద్వితీయ వార్షికోత్సవం కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వడ్నాల మల్లయ్య మాట్లాడుతూ సోమవారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవనం, రక్షాబంధనం, 24న దేవత హవనము, బలి ప్రధానం, పూర్ణాహుతి శివపార్వతుల శాంతి కళ్యాణం, మహాశీర్వచనము అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు. ద్వితీయ వార్షికోత్సవ మహోత్సవానికి మంత్రి కొండా సురేఖ మురళీధర్‌రావు, మేయర్ గుండు సుధారాణి హాజరవుతున్నారని తెలిపారు. కరపత్రం ఆవిష్కరణలో పద్మశాలి భవన సమితి కోశాధికారి పాశికంటి రవికుమార్, పద్మశాలి పరపతి సంఘం ఉపాధ్యక్షుడు పాశికంటి రాజేశ్వరరావు, ఆర్గనైజర్ రాపెల్లి చంద్రమౌళి, పరపతి సంఘం సహాయ కార్యదర్శి చిదురాల రాజలింగం, మిట్టపల్లి కోటేశ్వరరావు, బత్తుల సత్యం, పూజారులు ముదిగొండ అభిషేక్ శర్మ, ముక్కు కృష్ణ శర్మ, కస్తూరి శ్రీనివాస్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ భాషల్లో తెలుగు భాష గొప్పది

### ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి





**ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ :** "ప్రపంచ భాషలకన్నా తెలుగు భాష గొప్పది" అని వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల టీచర్ నియోజకవర్గ శాసన మండలి సభ్యుడు పింగిలి శ్రీపాల్ రెడ్డి పేర్కొన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవ సంబరాల సందర్భంగా విశ్వవిద్యాలయ తెలుగు విభాగం, వరంగల్ కాకతీయ పద్య కవితా వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఫిబ్రవరి 22 ఆదివారం నుంచి 24 తేదీల మధ్య నిర్వహిస్తున్న ప్రారంభ కార్యక్రమం ఉదయం విశ్వవిద్యాలయ సెనెట్ హాల్‌లో నిర్వహించిన 3 రోజుల " చేపూరి శ్రీ రామ్ శతావధానం" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై సభను ఉద్దేశించి ప్రసంగించారు.తెలుగు భాషకు మాత్రమే అవధాన ప్రక్రియ వంటి విశిష్ట సాహిత్య సంప్రదాయం ఉన్నదని ఆయన తెలిపారు. తెలుగు భాష స్థాయిని తగ్గించకుండా, దానిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. భాషపై విద్యార్థుల ప్రభావం అధికంగా ఉంటుందని, తెలుగు బోధన ద్వారా మానసిక పరిపక్వత పెంపొందుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి అభిరుచిని గౌరవిస్తూ భాషను జీవంతో ఉంచాలని పిలుపునిచ్చారు.గౌరవ అతిథిగా విచ్చేసిన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం మాట్లాడుతూ అవధాన ప్రక్రియ గతంలో విశేష ప్రాచుర్యం పొందిందని తెలిపారు. కవులకు, కళలకు వరంగల్ కేంద్రంగా నిలిచిందని, పద్య కవిత్వంపై పట్టు అవధానానికి మూలాధారం అని చెప్పారు. స్వర్ణోత్సవ సంవత్సరంలో "శతావధానం" నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.స్టూడెంట్ అఫైర్స్ డీన్ ఆచార్య మామిడాల ఇస్తారి మాట్లాడుతూ తెలుగు భాష వర్ణమాల వైభవాన్ని వివరించారు. పాలక మండలి సభ్యుడు డాక్టర్ చిర్రా రాజు మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు యుగంలో శతావధానం వంటి ఏకాగ్రతను పెంపొందించే కార్యక్రమాలు అత్యంత అవసరమని తెలిపారు. మరుమాముల దత్తాత్రేయ శర్మ శతావధానం వరంగల్‌కు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన సాహిత్య ప్రక్రియ అని కొనియాడారు. నారుమంచి అనంత శర్మ పద్య బాణాలను ఎక్కుపెట్టే కళే అవధానం అని వ్యాఖ్యానించారు. ప్రముఖ సామాజిక, ఆధ్యాత్మిక వాది గట్టు మహేష్ బాబు కాకతీయుల కాలం నాటి శతావధాన సంప్రదాయాన్ని పరిరక్షించాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు.విభాగ అధ్యాపకులు డాక్టర్ కర్రే సదాశివతో పాటు 100 మందికి పైగా పృచ్ఛకులు, సాహిత్యాభిమానులు, విద్యార్థులు,అతిథులు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/సంగెం :** శ్రీ గుండా బ్రహ్మయ్య స్వామి దేవస్థానం నూతన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఆదివారం సంగెం మండలం గవిచర్ల గ్రామంలో గుండా బ్రహ్మయ్య స్వామి దేవస్థానం నూతన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు.అంతకముందు ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..."భక్తి భావంతో నిర్వహించిన ఈ విగ్రహ ప్రతిష్ఠాపన గ్రామ ఐక్యతకు నిదర్శనం అన్నారు. గ్రామ దేవాలయాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు అని,దేవాలయ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు.

## రాష్ట్ర పోలీస్ క్రీడల్లో వరంగల్ కమిషనరేట్ సత్తా



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** సైబరాబాద్ వేదిక నాల్గవ రాష్ట్ర పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో వరంగల్ కమిషనరేట్ పోలీస్ క్రీడాకారులు వివిధ క్రీడల్లో అద్భుతమైన ఆట తీరు ప్రదర్శించి ఈ క్రీడల్లో తమ సత్తాను చాటారు. ఆరురోజుల పాటు జరిగిన ఈ క్రీడలు శనివారం రాత్రి ముగిసాయి. ఈ క్రీడల్లో వరంగల్ కమిషనరేట్ పోలీస్ క్రీడాకారులు మొత్తం 86 పతకాలను సాధించి పతకాల పట్టికలో మూడవ స్థానంలో నిలిచారు. సాధించిన పతకాల్లో 12 స్వర్ణాలు, 25 రజితాలు,49 కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ క్రీడల్లో వరంగల్ కమిషనరేట్ క్రీడాకారులు ప్రధానంగా ఆర్చరీ క్రీడలో అత్యధికంగా ఐదు బంగారు పతకాలతో సహా మొత్తం 13 పతకాలను సాధించి ఆర్చరీ క్రీడలో తిరుగులేని ప్రదర్శన కనబరిచారు. ఇతర క్రీడల విషయంలో ఇదే రీతిలో వరంగల్ క్రీడాకారులు అద్భుత ప్రదర్శన చేసారు. జూడో క్రీడలో వరంగల్ కమిషనరేట్ క్రీడాకారులు నాలుగు రజితపతకాలను సాధించి జూడో చాంపియన్ షిప్ రన్నరప్‌గా ముఖ్య అతిథుల చేతుల మీదుగా ట్రోఫీని అందుకున్నారు. ఇదే రీతిలో బాక్సింగ్, ఆర్మ్స్ రెజ్లింగ్, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్, బ్యాట్మింటెన్, టగ్ ఆఫ్ వార్‌లో,సైకిలింగ్, స్విమ్మింగ్,హాకీ విభాగాల్లో గతంలో కన్నా మెరుగైన ఆట తీరు చూపించారు. ప్రధానంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సైతం కాంస్య పతకాన్ని సాధించడం విశేషం.


## మండల పరిషత్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం

**ప్రజాపక్షం/ములుగు:** గోవిందరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా స్టోర్ రూమ్‌లో మంటలు చెలరేగిన సంఘటన కలకలం రేపింది. సెలవు దినం కావడంతో కార్యాలయం మూసివుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. ఉదయం సుమారు 11గంటల సమయంలో కార్యాలయం పై అంతస్తులోకి కిటికీ గుండా పొగలు, మంటలు బయటకు వస్తున్నట్లు పక్కనే నివసిస్తున్న చలం గమనించారు. వెంటనే కార్యాలయ సిబ్బంది ఇక్బాల్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే పస్రా ఎస్‌ఐ తాజుద్దీన్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఫైర్ ఇంజన్ వచ్చే లోపే అప్రమత్తంగా వ్యవహరించిన ఎస్‌ఐ తాజుద్దీన్ పక్కనే ఉన్న బాలుర హాస్టల్ విద్యార్థులను రప్పించి కార్యాలయ సిబ్బంది, గ్రామస్తుల సహకారంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. వెంటనే చర్యలు తీసుకోకపోతే భారీ ప్రమాదం సంభవించే అవకాశం ఉండేదని స్థానికులు అభిప్రాయపడ్డారు. స్టోర్ రూమ్‌లో పాత ఫైళ్లు, పనికిరాని వస్తువులు ఎక్కువగా ఉండడం గమనార్హం. అయితే కార్యాలయానికి చెందిన ముఖ్యమైన, విలువైన రికార్డులు సురక్షితంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఈ ఘటనకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమా, లేకా మరేదైనా కారణమా అనే విషయంపై విచారణ కొనసాగుతుంది. మంటలను అదుపులోకి తీసుకురావడంలో సహకరించి హాస్టల్ విద్యార్థులను ఎస్‌ఐ తాజుద్దీన్ అభినందించారు. అప్రమత్తత, సమన్వయం ఉంటే ప్రమాదాలను ఎంత పెద్దవైనా నివారించవచ్చునని ఈ ఘటన మరో సారి నిరూపించింది.

## అభివృద్ధే లక్ష్యంగా పాలకవర్గం పరుగులు తీయాలి

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా నూతన పాలకవర్గం పనిచేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ కార్యాలయంలో చైర్మన్‌గా బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్‌గా అంబాల శ్రీనివాస్‌ల పదవి బాధ్యతలు స్వీకరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరయ్యారు. ముందుగా భూపాలపల్లి హనుమాన్ దేవాలయంలో పూజలు చేసి అనంతరం భారీ ర్యాలీగా వచ్చి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అనంతరం మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్ళారు.పదవీ బాధ్యతలు చేపట్టిన చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్ లను ఎమ్మెల్యే అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, భూపాలపల్లి సమగ్ర అభివృద్ధికి నూతన పాలకవర్గం సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ప్రజలు మనకు ఇచ్చిన బాధ్యతలను విస్మరించరాదని, ప్రజలు కోరుకున్న విధంగా జనరంజకమైన పరిపాలన అందించి, ఎలాంటి అవినీతికి తాగు లేకుండా పారదర్శక పాలన అందించాలని అన్నారు. జనవరిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూపాలపల్లి పట్టణ అభివృద్ధికి 60 కోట్ల నిధులు మంజూరు చేయించడం జరిగిందని, నూతన కౌన్సిలర్లు అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఓట్లేసి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఐదు సంవత్సరాలు ప్రజలకు సేవకులుగా పని చేయాలని అన్నారు. నగర సమగ్ర అభివృద్ధికి పాలకవర్గం 30 వార్డులలో గెలిచిన కౌన్సిలర్లు అందరు పార్టీలకు అతీతంగా పని చేయాలని కోరారు. ఎలాంటి అవకతవకలు అవినీతికి తావు లేకుండా ఏ విషయంలోనైనా చైర్మన్, వైస్ చైర్మన్ తప్పు చేస్తే మిమ్ములను నడిపించడానికి పెద్ద కొడుకుగా ఎమ్మెల్యేగా నేనుంటానని ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చే విధంగా కౌన్సిలర్లంతా కలిసికట్టుగా సమన్వయంతో పనిచేసి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి, డిసిసి అధ్యక్షుడు బట్టు కరుణాకర్, అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోటరాజు బాబు, భూపాలపల్లి పట్టణ అధ్యక్షుడు విస్లావత్ దేవన్, సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్, కాంగ్రెస్ పార్టీ నూతన కౌన్సిలర్స్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



‘ ప్రతి ఏడాది ఫిలిం ఫేర్ సినిమా వాళ్లకు ఇచ్చే ప్రతిష్ఠాత్మక అవార్డులను ప్రకటించింది. పుష్ప -2 సినిమాకు గాను ఉత్తమ దర్శకుడిగా అవార్డు వరించింది. పుష్ప -2 సినిమా ఎంతటి ఘన విజయం సాధించిందో అందరికి తెలిసిందే. ఈ నేపథ్యంలో డెభైవ ఫిలిం ఫేర్ సంస్థ ఈమేరకు నిర్ణయం తీసుకుంది. ’

రీల్

# 'భోగి' యాక్షన్ షెడ్యూల్ ప్రారంభం

'నారీ నారీ నడుమ మురారి'తో అలరించిన శర్వానంద్ ఇప్పుడు తొలి సారిగా యాక్షన్ స్పెషలిస్ట్ సంపత్ నందితో కలిసి 'భోగి' అనే భారీ పాన్ ఇండియన్ పీరియడ్ యాక్షన్ డ్రామా చేస్తున్నారు. శ్రీ సత్యసాయి ఆరట్స్ పతాకంపై కెకె రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. టీమ్ ఇప్పటికే ఒక షెడ్యూల్ను పూర్తి చేసింది. అందులో శర్వానంద్ ఇతర నటీనటులతో కొన్ని టాకీ పొరట్స్ చిత్రీకరించారు. ప్రస్తుతం హైదరాబాద్లో కొత్త షెడ్యూల్ ప్రారంభమైంది. ఈ కీలక షెడ్యూల్ కోసం ప్రత్యేకంగా భారీ సెట్ను నిర్మించారు. ఈ షెడ్యూల్లో రెండు భారీ యాక్షన్ ఎపిసోడ్లు ఉండగా, వాటికి ప్రముఖ స్టంట్ మాస్టర్ దిలీప్ సుబ్బరాయన్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. స్ట్రైకింగ్ మోనోక్రోమ్లో చిత్రీకరించిన షూట్ ఫ్రేమ్లో శర్వా రోడ్డుపై నిలబడి, భుజంపై హ్యామర్ను పట్టుకుని కనిపిస్తున్నారు. అతని ముందువైపు దర్శకుడు సంపత్ నంది, స్టంట్ డైరెక్టర్ దిలీప్ సుబ్బరాయన్ కనిపిస్తున్నారు. 1960 నేపథ్యంలో భోగి చిత్రం ఇంటెన్స్ ఎమోషన్స్, రా ఎనర్జీ, హై వోల్టేజ్ డ్రామాతో నిండిన కథగా రూపొందుతోంది. దర్శకుడు సంపత్ నంది పవర్ ఫుల్ కథను సిద్ధం చేశారు. అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి కథానాయికలుగా నటిస్తున్నారు. ఆర్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్ మన్నె ఆధ్వర్యంలో పీరియడ్ డీటైలింగ్, రస్టిక్ ల్యాండ్స్కేప్స్, గ్రౌండెడ్ ఎస్తేటిక్ రూపొందించారు. భోగి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో పాన్ఇండియా స్థాయిలో గ్రాండ్గా విడుదల కానుంది.



## 'మా ఇంటి బంగారం' మే15న రిలీజ్

ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్పై సమంత ప్రధాన పాత్రలో నటిస్తోన్న చిత్రం 'మా ఇంటి బంగారం'. దిగంత్, గుల్షన్ దేవయ్య ఇతర ప్రాతల్లో నటిస్తున్నారు. శ్రీముఖి, గౌతమి, ఆనంద్, లక్ష్మి, శ్రీనివాస్ గవిరెడ్డి, మంజుషా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఓ బేబి వంటి సూపర్ హిట్ మూవీ తర్వాత మరోసారి సమంత, నందిని రెడ్డి కాంబోలో రానున్న ఈ సినిమాను రాజ్ నిడిమోరు రూపొందిస్తున్నారు. తాజాగా ఈ సినిమా మే15న వరల్ వైడ్గా రిలీజ్ చేస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా మా ఇంటి బంగారం సినిమాను యాక్షన్ డ్రామాగా తెరకెక్కిస్తున్నారు. సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. యాక్షన్ డ్రామా మూవీ అందరికీ నచ్చేలా, అన్ని అంశాలతో రూపొందుతోంది. చిత్ర యూనిట్ లేటెస్ట్గా సమంత ఉన్న కొత్త పోస్టర్ను కూడా విడుదల చేసింది, ఇది సినిమాకి ప్రత్యేకమైన విజువల్ లుక్ను తీసుకొచ్చింది. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణన్, సినిమాటోగ్రఫీ: ఓం ప్రకాష్, స్టోరీ, స్క్రీన్ప్లే: రాజ్ నిడిమోరు, వసంత్ మారింగంటి, సీతామీ నన్, ఉన్నా రు.



## రిషబ్ శెట్టి హీరోగా 'జై హనుమాన్' షురూ

పాన్ఇండియన్ బ్లాక్బస్టర్ 'హనుమాన్'ను అందించిన జాతీయ అవార్డు గ్రహీత, చిత్రనిర్మాత ప్రశాంత్ వర్మ ఇప్పుడు సీక్వెల్ 'జై హనుమాన్' కోసం సిద్ధమవుతున్నాడు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుంది, టిసిరీస్ దీనిని సమర్పిస్తుంది. జాతీయ అవార్డు గ్రహీత రిషబ్ శెట్టి ప్రధాన హీరోగా నటిస్తున్నాడు. ఆదివారం విజయనగరంలోని హంపిలోని అంజనాద్రి బెట్టలో సాంప్రదాయ వేడుకలో అధికారికంగా ప్రాంభమైంది. ఇది హనుమంతుడి జన్మస్థలం అని నమ్మే పవిత్ర ప్రదేశం. హనుమాన్ స్టార్ తేజ సజ్జా దర్శకత్వం వహించిన ప్రారంభ సన్నివేశానికి టిసిరీస్ అధినేత భూషణ్ కుమార్ క్లాప్బోర్డ్ కొట్టారు. అనిల్ తడానీ కెమెరాను స్విచ్చాన్ చేశారు. అనిల్ తడానీ, భూషణ్ కుమార్, నవీన్ యెర్నేని , రవిశంకర్లు స్క్రిప్టు దర్శకుడు ప్రశాంత్ వర్మకు అందజేశారు. ఇప్పటికే ప్రీప్రొడక్షన్ పనులు జరుగుతున్నందున ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభమవుతుంది.ముందుగా హనుమంతుడిగా రిషబ్ శెట్టిని అద్భుతమైన ఫస్ట్ లుక్ పోస్టర్ తో ఆవిష్కరించారు, ఇందులో పాత్ర ఆత్మ , దైవత్వాన్ని సంగ్రహించారు. ఈ చిత్రాన్ని నవీన్ యెర్నేని వై రవిశంకర్ నిర్మించారు, దీనిని అత్యున్నత స్థాయి సాంకేతిక ప్రమాణాలతో భారీ బడ్జెట్తో నిర్మిస్తున్నారు. . ఈ చిత్రానికి ఎం.ఎం. కీరవాణి సంగీతం సమకూరుస్తున్నారు. ఎస్. తిరునావుక్కరసు సినిమాటోగ్రాఫర్గా, శ్రీనాగేంద్ర తంగల నిర్మాణ రూపకల్పనను పర్యవేక్షిస్తున్నారు.




## 'కల్ట్ ' చాలా కసితో తీసిన సినిమా
హీరో విశ్వక్సేన్



మాస్ కా దాస్ విశ్వక్సేన్ మరోసారి బౌండరీస్ ని దాటి ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్తో వస్తున్నారు. ఫలక్నుమా దాస్, దాస్ కా ధమ్కీ వంటి చిత్రాలతో హీరో, దర్శకుడు, నిర్మాత, రచయితగా ఆకట్టుకున్న విశ్వక్సేన్ ఇప్పుడు తన స్వీయ రచన, దర్శకత్వంలో కల్ట్ తో రాబోతున్నారు. తారక్ సినిమాస్ బ్యానర్ పై సందీప్ కాకరాల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కథ గోవాకు ఎంజాయ్ చేయడానికి వెళ్లిన ఓ ఫ్రెండ్స్ గ్రూప్ చుట్టూ తిరుగుతుంది. స్టాగ్స్ అనే కారణంతో పబ్లోకి అనుమతి నిరాకరిస్తారు. అదే సమయంలో వారిలో ఒకరు ప్రత్యేకమైన కల్ట్ పాస్లు సంపాదించడంతో ఓ ఎక్స్క్లూజివ్ పార్టీకి వెళ్లే అవకాశం వస్తుంది. మొదట కలలా అనిపించిన ఆ అనుభవం, పార్టీ హోస్ట్ ప్రారంభించే ప్రాణాంతక ఆటతో ఒక్కసారిగా భయంకరమైన నైట్మేర్గా మారుతుంది. ఒక్కొక్కరిని హతమారుస్తూ ముందుకు సాగే ఈ కథలో, గేమ్ మాస్టర్ కథను మరింత మలుపు తిప్పుతాడు. అతను రక్షకుడా? లేక మరింత ప్రమాదకరమైన వ్యక్తా? అనేది ఆసక్తికరం. ఈ చిత్రంలో గాయత్రి భరద్వాజ్, తారక్ పొన్నప్ప, మురళీ శర్మ, శ్రీకాంత్ అయ్యంగర్, కార్తికేయ, అనిరుధ్ భాస్కర్, యజ్ఞ తుర్లపాటి, కబీర్ భారతీయ, విశాక్ నాయర్, చేపూరి వివేక్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. డైలాగ్స్ను తరుణ్ భాస్కర్ రాస్తుండగా, మ్యూజిక్ కంపోజర్ రవి బస్రూర్ మ్యూజిక్ అందించారు. సినిమాటోగ్రాఫర్ అర్విండ్ విశ్వనాథన్, ఎడిటర్ రవి తేజ గిరిజాల పని చేస్తున్నారు.

## 'సరస్వతి' ట్రైలర్ ఎక్స్ట్రార్డినరీ

వెర్సటైల్ పాత్రలతో అలరిస్తున్న వరలక్ష్మి శరత్ కుమార్ స్వీయ దర్శకత్వంలో, తన సోదరి పూజా శరత్ కుమార్ తో కలిసి దోస డైరీస్ బ్యానర్ పై నిర్మిస్తున్న చిత్రం'సరస్వతి'. హైకాన్సెప్ట్ థ్రిల్లర్గా రూపొందుతున్న ఈ చిత్రంలో వరలక్ష్మి శరత్ కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ ప్రేక్షకులలో క్యూరియాసిటీ పెంచింది. మార్చి 6న ఈ సినిమా థియేటర్స్ లో విడుదల కానుంది. డైరెక్టర్ గోపీచంద్ మలినేని సినిమా ట్రైలర్ ని లాంచ్ చేశారు. ఈ సందర్భంగా గోపీచంద్ మలినేని మాట్లాడుతూ వరలక్ష్మీ చాలా ఎమోషనల్ పర్సన్. నేను క్రాక్ చేసినప్పుడు జయమ్మ క్యారెక్టర్ ఎలా ఉంటుందో నాకు మైండ్లో ఉంది. ఆ క్యారెక్టర్ ని వరలక్ష్మి చేసిన తర్వాత అందరూ షాక్ అయిపోయారు. నిర్మాత బన్నీ బాస్ మాట్లాడుతూ వరలక్ష్మి ఈ సినిమాకి తను దర్శకత్వం చేసి, నటిస్తున్నాను, అలాగే నిర్మిస్తున్నని చెప్పినప్పుడు కచ్చితంగా ఒక మంచి కంటెంట్ అయి ఉంటుందని అనుకున్నాను. డైరెక్టర్, హీరోయిన్ వరలక్ష్మి శరత్ కుమార్ మాట్లాడుతూ ఫిమేల్ కంటెంట్ అని మరీ సందేశాత్మకంగా ఉండదు. చాలా థ్రిల్లింగ్ గా ఉంటుంది. బన్నీ వాసు సినిమాని చూసి చాలా అభినందించారు.




## 'హే బల్వంత్'లో హిలేరియస్ ఎంటర్టైన్మెంట్

'హే బలవంత్' సినిమా 20న ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం హిలేరియస్ ఎంటర్టైన్మెంట్ ప్రేక్షకుల అభినందనలతో పాటు, విమర్శకుల ప్రశంసలు అందుకుంటూ బ్లాక్బస్టర్ టాక్తో దూసుకపోతుంది. చిత్రంలో ఓ కీలకపాత్రలో నటించి తన నటనతో థియేటర్లో ఎంటర్టైన్మెంట్ను అందిస్తున్న కమెడియన్ సుదర్శన్ ఆదివారం విలేకరులతో చిట్ చాట్ నిర్వహించారు. **'హే బల్వంత్లో సుదర్శన్ 2.0 అంటున్నారు?:** సినిమాలో అంత మంచి క్యారెక్టర్ చేశాను. సినిమాకు చాలా క్రేజీ రెస్పాన్స్ వస్తోంది. నేను పోషించిన బంక పాత్రను ఆడియన్స్ బాగా ఎంజాయ్ చేస్తున్నారు. హిలేరియస్గా నవ్వుకుంటున్నారు. ఈ సినిమా ఆద్యంతం ఎంటర్టైనర్గా ఉందని మంచి ప్రశంసలు వస్తున్నాయి. ఈ సినిమాలో పోషించిన పాత్రకు మంచి పేరొచ్చింది. అమెరికాకు దారేది అనే షార్ట్ ఫిల్మ్తో నటించాను. దానికి అనుకోకుండా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ షార్ట్ఫిల్మ్తో రన్రాజా రన్ ఆఫర్ వచ్చింది. ఆ తరువాత దోచెయ్, కుమారి 21ఎఫ్, పటాస్, సమాజవరగమన, నారీ నారీ నారి నడుమ మురారి, ఇప్పుడు హే బల్వంత్ సినిమాలు నన్ను ప్రేక్షకులకు చేరువ చేశాయి. ఈ సినిమాలో నటించిన అందరితో నాకు అందరితో మంచి ర్యాపో ఉంది. ప్రతి సీన్కు అందరం మంచి సింక్లో ఉన్నాం. అందరూ క్లోజ్నెస్తో ఫ్లోతో సీన్లు బాగా వచ్చాయి. నేను హీరోగా వెండితెరపై ఇప్పుడే చేయను. అనుకోకుండా సినీ పరిశ్రమకు వచ్చాం. కమెడియన్గా ఇప్పుడిప్పుడు ఎదుగుతున్నాను. ఈ టైమ్లో రిస్క్ తీసుకోలేను. కమెడియన్గా నాకు అందరి హీరోలతో కలిసి సినిమాలు చేయాలని వుంది. నటుడిగా సెటిల్ అయిపోయిన తరువాత హీరోగా ఆలోచిద్దాం. ఒక వేళ హీరోగా చేస్తే చిన్న చిన్న కాన్సెప్ట్తో చేసే ఓటీటీ సినిమాలు చేస్తాను.



# తీరేదెన్నడో...?

(మొదటి పేజీ తరువాయి)

వ్యాప్తంగా 22 మాసాల కాలంలో సుమారు 15వేల మందికి పైగా ఉద్యోగ విరమణ చేశారు. ఇందులో అతి కొద్ది మంది పింఛన్ బకాయిల కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితుల్లో చెల్లించింది. ఉద్యోగ విరమణ తర్వాత వచ్చే మొత్తంలో పిల్లల భవిష్యత్తు, స్థిర నివాసాలు, పెళ్లిళ్ల ఇతరత్రా కార్యక్రమాలను నెరవేర్చుకునేందుకు ప్రణాళికలు తయారు చేసుకున్నారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పింఛన్దారులను చుట్టుముట్టాయి. ఆర్థికంగా వెసులుబాటు లేక పిల్లలను స్థిరపర్చలేక మనో వ్యధకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. ఖమ్మంజిల్లాలో వి. నారాయణరావుకు బకాయిలతో పాటు నెలవారి పింఛన్ కూడా రాక పోవడంతో ప్రాణాలు కోల్పోయాడు. ఇటీవల మాజీ ఎస్ఐ మైసయ్య మృతి అందరిని కలిచివేసింది. ఆర్థిక ఇబ్బందులకు గురై సరైన వైద్యం పొందలేక ప్రాణాలు కోల్పోయారు. ఆయన సతీమణి సైతం తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా పింఛన్దారులకు అన్ని కార్పోరేట్ ఆసుపత్రులలో నగదు రహిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇంత వరకు అమలు చేయలేదు. డిఏ చెల్లింపుల్లో కూడా పింఛన్ దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెలవారీగా బిల్లు చేయాలని ఆదేశాలు జారీ కావడం పింఛన్దారులను తీవ్ర ఇబ్బందులు పెట్టడమేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిఆర్సిపైన పింఛన్దారులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సరైన రీతిలో వ్యవహరించడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ బడ్జెట్ సమావేశాల్లోనైనా పింఛన్ దారుల బకాయిల చెల్లింపుకు సరిపడ నిధులు కేటాయించాలని పింఛన్దారులు డిమాండ్ చేస్తున్నారు.

**నేటి నుంచి రిలే నిరాహార దీక్షలు :**

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో పింఛన్దారుల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం కలెక్టరేట్ ఎదుట గల ధర్నాచౌక్లో రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు ఎస్జిపిఏటి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరిశ పుల్లయ్య, రాయల రవికుమార్లు తెలిపారు. పింఛన్ బకాయిలను తక్షణమే చెల్లించాలని నగదు రహిత వైద్య సేవలను అందించాలని, డిఏ, పిఆర్సి తదితర సమస్యలను పరిష్కరించాలని ఈనెల 23 నుంచి 26 వరకు రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం దశల వారీ ఆందోళనలో భాగంగా రిలే నిరాహార దీక్షలు చేపట్టామని తర్వాత కార్యాచరణ ప్రకటిస్తామని పుల్లయ్య, రవికుమార్లు తెలిపారు.



## తెలంగాణ ఉద్యమస్ఫూర్తిని ముందుకుతీసుకెళ్లాలి

### కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుల శిక్షణ తరగతులలో కోదండరామ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎఐసిసి ఆధ్వర్యంలో అనంతగిరిలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుల (డిసిసి) శిక్షణా తరగతులలో 'తెలంగాణ ఉద్యమం, నేపథ్యం, ఆశయాలు, అమరుల త్యాగాలు, లక్ష్యాలు తదితర అంశాలపైన టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం కోదండరామ్ వివరించారు. తెలంగాణ రాష్ట్ర నిర్మాణానికి దారి తీసిన పోరాట గాథను స్మరించుకుంటూ, ఉద్యమ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యతను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కాగా శిక్షణ తరగతులలో తెలంగాణ ఉద్యమ నేపథ్యం, లక్ష్యాలు తదితర అంశాలపై జిల్లా అధ్యక్షులకు వివరించాలని కోదండరామ్ను ఎఐసిసి కార్యదర్శి, రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ ఆహ్వానించారు.

## గిగ్, ప్లాట్ ఫామ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో.. శంషాబాద్ విమానాశ్రయంలో 'ఉడాన్ యాత్రి కేఫే' ప్రారంభం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'తెలంగాణ గిగ్, ప్లాట్ ఫామ్ వర్కర్స్ యూనియన్ (టిజిపిడబ్ల్యుయు) ఇటీవల శంషాబాద్ విమానాశ్రయంలో ప్రారంభించిన ఉడాన్ యాత్రి కేఫ్పై ప్రయాణికుల అభిప్రాయాలను సేకరించి నివేదికను విడుదల చేసింది. ఈ సర్వేలో మొత్తం 2,800 మంది ప్రయాణికులు పాల్గొన్నారు. సర్వే ఫలితాల ప్రకారం కేవలం 26 శాతం (720 మంది) మాత్రమే ఈ సదుపాయం గురించి తెలుసునని చెప్పగా, 74 శాతం (2,080 మంది) ప్రయాణికులకు ఈ కేఫే గురించి తెలియదని చెప్పారని వెల్లడైంది. ఈ ఫలితాలు ప్రయాణికులకు సమాచారం అందించడంలో యాప్ ఆధారిత డ్రైవర్లు, ట్రాన్స్పోర్ట్ కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని చూపిస్తున్నాయి. అయితే అధికారిక ప్రకటనలు, సైన్బోర్డులు, అవగాహన కార్యక్రమాలు తక్కువగా ఉన్నాయని స్పష్టం అవుతోంది. ప్రస్తుతం ఈ కేఫే చెక్ఇన్ హాల్ దగ్గర ఉండగా, ఎక్కువ మంది ప్రయాణికులు బోర్డింగ్ గేట్ల దగ్గర ఎక్కువ సమయం గడుపుతున్నారని తెలిపారు. చాలామంది ప్రయాణికులు, ఎయిర్పోర్ట్ సిబ్బందికి కూడా ఈ సదుపాయం గురించి తెలియడం లేదు. ప్రకటనలు, డిజిటల్ డిస్ప్లేలతో పాటు అవగాహన కార్యక్రమాలు పెంచాలని ప్రయాణికులు సూచించినట్లు వెల్లడించారు. ఉడాన్ యాత్రి కేఫేపై అవగాహన, అందుబాటు విజిబిలిటీ పెంచితే మరింత మంది ప్రయాణికులు ఈ తక్కువ ధరల సేవలను ఉపయోగించగలరు. ఇది హైదరాబాద్ ఎయిర్పోర్ట్ ప్రయాణికుల అనుభవాన్ని మెరుగుపరుస్తుంది' అని టిజిపిడబ్ల్యుయు వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలాహుద్దీన్ తెలిపారు.

## స్థిరత్వం, చిత్తశుద్ధితోనే న్యాయవృత్తిలో ఉన్నత ప్రగతి

### స్నాతకోత్సవంలో గ్రాడ్యుయేట్లకు సిజెఐ హితవు



**రాయ్పూర్:** సహనం, సహభాగస్వామ్యం, వృత్తిపరమైన చిత్తశుద్ధితో జీవన గమన మార్గాన్ని నిర్మించుకోవాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ న్యాయవిద్యాభ్యాసం చేసే విద్యార్థులకు హితబోధ చేశారు. తరగతిలో ఉంటే తోటి విద్యార్థులను భవిష్యత్ వృత్తి భాగస్వాములుగా, న్యాయస్థానంలో తమ ప్రతివాదులుగా, న్యాయవ్యవస్థలో సహనంతో మెలగే తమ తోటి సభ్యులుగా భావించాలని, ఆ మూలాల ప్రాతిపదికపైనే ప్రతి న్యాయ విద్యార్థి తమ భవిష్యత్ జీవన గమన మార్గాన్ని తీర్చిదిద్దుకోవాలని ఉద్బోధించారు. చాలా తక్కువ సమయంలోనే వృత్తిపరమైన గొప్ప ప్రగతిని లా గ్రాడ్యుయేట్లు ఆశించవద్దని స్పష్టం చేశారు. వృత్తిపరమైన భవితను ఒక భవన నిర్మాణంలా భావించాలన్నారు. ఛత్తీస్గఢ్ రాజధాని రాయ్పూర్లోని హిదయతుల్లా నేషనల్ లా యూనివర్సిటీ తొమ్మిదవ స్నాతకోత్సవసభలో జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ, విద్య పూర్తిచేసుకున్న గ్రాడ్యుయేట్లు తోటి సహభాగస్వాములతో తమ శక్తిసామర్థాలపై ఆధారపడి ఒక అర్థవంతమైన భవిష్యత్ జీవితాన్ని నిర్మించుకోవడానికి దీర్ఘకాలికస్థాయిలో వృత్తిపరంగా అభివృద్ధి సాధించేందుకు అనిశ్చితి,బాధ్యతలమధ్య వృత్తిపరమైన ప్రయాణం ప్రారంభించారన్నారు. గ్రాడ్యుయేట్లు, యూనివర్సిటీ బోధకులు, కుటుంబసభ్యుల సమక్షంలో ప్రధాన న్యాయమూర్తి ప్రసంగించారు. ఆయన తన ప్రసంగంలో వృత్తిపరమైన సంబంధాలను ప్రధానంగా చెప్పారు. న్యాయ విద్య పరీక్షలు, ర్యాకింగ్, మంచి ప్లేస్మెంట్ల ద్వారా తరచు పోటీని ఉద్ఘాటిస్తుందని, న్యాయవృత్తి మాత్రం తనకుతానుగా సహకారం, సభభాగస్వామ్యంపై ఆధారపడి నిలదొక్కుకుంటుందని అన్నారు. న్యాయవ్యవస్థను పలు ఉపనదుల కలయికతో ఏర్పడిన పెద్ద నదితో పోల్చి చెబుతూ, జూనియర్లు, సీనియర్లు, తోటి ఉద్యోగులు,చివరకు ఎదురు నిలబడి వాదించే న్యాయవాదులతో కలిపి చేసే ఒక ఉమ్మడి కృషివల్ల న్యాయపాలన జరుగుతుందన్నారు. తమ తోటి న్యాయ విద్యార్థులు, గ్రాడ్యుయేట్లను తమతో సమానమైన సమతుల్యులుగా భావించి గౌరవించాలని, మన్నన, స్వచ్ఛత,అరమరికలులేని బాహాటత్వంతో ఉండాలని, ఉమ్మడి కృషి ద్వారా న్యాయవ్యవస్థ, న్యాయపాలన జరుగుతుందని విశ్వసించాలన్నారు. తమతో కలసి చదువుకున్న విద్యార్థులను భవిష్యత్ సహభాగస్వాములుగా చూడాలనని, ప్రతివాదులుగా, శక్తిసామర్థ్యాలుగల న్యాయవ్యవస్థ సభ్యులుగా గుర్తించాలని కోరారు. ఈ విధమైన చర్యలవల్ల మన ఔదార్యం, దయాదృష్టి మన వ్యక్తిగత వృత్తి భవితను పటిష్టవంతం చేయడమే కాకుండా న్యాయవృత్తిలో మన శక్తిసామర్థ్యాలను కూడా పెంపొందిస్తాయని చెప్పారు. న్యాయవృత్తి దీర్ఘకాలంపాటు ఆడే ఆటగా పేర్కొన్నారు. వృత్తిని ప్రారంభించినప్పుడు తొలి సంవత్సరాలలో కొంత అనిశ్చితి, ఊగిసలాట వెంటాడతాయని, ప్రత్యేకించి ఈ వృత్తిలో ఇతరులతో పోల్చి చూసుకున్నప్పుడు ఈ పరిస్థితి ఎదురవుతుందని, ఐనప్పటికీ మౌలికంగా మనం అవగాహనతో విద్యాభ్యాసంచేసి పునాదులు పటిష్టం చేసుకున్నప్పుడు న్యాయవ్యవస్థను సక్రమంగా అర్థం చేసుకుని ముందుకు వెళ్ళి వృత్తిని అభివృద్ధి చేసుకుంటామని, న్యాయపరంగా స్థిరంగా మనం నిలదొక్కుకోవాలంటే దీర్ఘకాలిక విజయం సాధించాలంటే మనదగ్గరకు వచ్చే బాధితులపట్ల జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. వృత్తిపరమైన అభివృద్ధి సాధనకు స్థిరత్వం, చురుకుదనం, చిత్తశుద్ధి ఉండాలని తద్వారా అంతిమంగా గౌరవం సంపాదించుకుంటామన్నారు. ఒక భవన నిర్మాణంలో పునాదులు గట్టిగా ఉంటే భవిష్యత్ విజయాలు కూడా బలంగా ఉంటాయన్నారు. వృత్తిపరమైన సహోద్యోగులమధ్య పరస్పర అనుబంధం, సహకారం ఉండాలన్నారు. బాధ్యత, వృత్తిపరమైన చిత్తశుద్ధి, కార్యసిద్ధిని ప్రదర్శిస్తూ జీవితాన్ని సమతుల్యంగా కొనసాగించాలని హితవు చరెప్పారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ ఛత్తీస్గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయిను కూడా కలుసుకున్నారు. ముఖ్యమంత్రి ఆయనకు పుష్పగుచ్ఛం, సంప్రదాయబద్ధమైన పై పంచెను ఇచ్చి సత్కరించారు.

# నాలుగేళ్లుగా యుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

స్లోవేకియా ప్రధానమంత్రి రాబర్ట్ ఫికో హెచ్చరించారు. అదేవిధంగా హంగరీ దేశ ప్రధానమంత్రి విక్టర్ ఓర్బాన్ కూడా జెలెన్స్కీకి ఒక హెచ్చరిక చేశారు. ఉక్రేన్మీదుగా రష్యా నుండి హంగరీకి వచ్చే చమురు సరఫరా పైపులైన్ ద్వారా చమురు ప్రవాహాన్ని పునరుద్ధరించకపోతే యూరోపియన్ యూనియన్ ఇచ్చే 90 బిలియన్ యూరోల రుణాన్ని వీటో చేస్తామని హెచ్చరించారు. దీంతో జెలెన్స్కీ కూడా ఈ రెండు దేశాలపై ఎదురుదాడి చేశారు. హంగరీ, స్లోవేకియా దేశాలు రష్యా అండతో తమను బ్లాక్మెయిల్ చేస్తున్నాయని విమర్శించారు. ఈ శీతాకాలంలో విద్యుత్ వనరులపై దాడులు చేయడం ద్వారా రష్యా తమ ప్రజలను చలికి బలి చేస్తోందని, చలికాలాన్ని ఒక అస్త్రంగా ఉపయోగించుకుని దుర్వినియోగానికి పాల్పడుతోందని జెలెన్స్కీ విమర్శించారు. ఎన్ని చేసినా రష్యా తమను ఓడించలేదని ఆయన అన్నారు. ఐతే ఈ శీతాకాలం ఉక్రేన్ ప్రజలకు అతిపెద్ద సవాలుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2014లో కూడా ఫిబ్రవరి 24న క్రిమియాను రష్యా ఆక్రమించింది. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉక్రేన్లో యుద్ధ పరిష్కారానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవలికాలంలో ఒకవైపు కాల్పుల విరమణ ఒప్పందానికి మధ్యవర్తుల ద్వారా సంప్రదింపుల ప్రక్రియ, మరోవైపు పరస్పర యుద్ధ దాడులు కూడా తీవ్రరూపం దాల్చాయి. జెనీవాలో ఉక్రేన్–అమెరికా–రష్యా మధ్య తాజా విడత చర్చలు ఎలాంటి ఫలితం లేకుండానే ముగిశాయి. జనవరి నెలాఖరునాటికి లెక్కవేస్తే 1,418 రోజులుగా జరిగిన యుద్ధంలో 1,40,000 మంది ఉక్రేన్ సైనికులు మరణించారని, 6,00,000 మంది ఉక్రేన్ సైనికులు గాయపడ్డారని సిఎస్ఐఎస్ అంచనావేసింది. రష్యావైపు 3.25 లక్షలమంది సైనికులు మరణించగా, 10.20 లక్షల మంది గాయపడ్డారని, అంచనావేసింది. రష్యా కూడా ఎనిమిది దశాబ్దాలక్రితం రెండో ప్రపంచయుద్ధంలో నాలుగేళ్ళు పోరాడి నాజీ జర్మనీ సేనలను వెనక్కు తరిమికొట్టింది. అదేవిధంగా రష్యా కూడా ఈ నాలుగేళ్ళ యుద్ధంలో ఉక్రేన్ రాజధాని కీవ్ను స్వాధీనం చేసుకోలేకపోయింది. రెండో ప్రపంయుద్ధం తర్వాత యూరప్లో మళ్ళీ రష్యా–ఉక్రేన్ మధ్య జరుగుతున్న ఈ యుద్ధంలో ఇరువైపులా ఇప్పటివరకూ దాదాపు 20 లక్షల మంది సైనికులు మరణించడం,గాయపడటం, జాడ తెలియకుండాపోవడం జరిగింది. 2014 నుండి ఇప్పటివరకూ క్రిమియా సహా 20 శాతం ఉక్రేన్ భూభాగాన్ని రష్యా ఆక్రమించింది. ఐతే 2022 ఫిబ్రవరి 24వ తేదీ తర్వాత రెండు దేశాలమధ్యా యుద్ధం ఉధృతి తగ్గింది. మందగమనంలో సాగుతోందని నాటో ప్రధాన కార్యదర్శి మార్క్ రట్టే వ్యాఖ్యానించారు. గడచిన రెండు సంవత్సరాలలో రష్యా దళాలు తూర్పు ఉక్రేన్లోని డోనెట్స్క్ ప్రాంతంలోకి 50 కి.మీ లోపలకు దూసుకువచ్చాయి. బలమైన కేంద్రాలను రక్షించుకోవడానికి ఉక్రేన్ తీవ్ర పోరాటం చేస్తోంది. ఈ పరిస్థితుల్లో జెలెన్స్కీ చర్చలు విజయవంతం కావాలని కోరుకుంటున్నారు. మరోవైపు యూరప్దేశాల నుండి ఆయుధాలు సమకూర్చుకుంటున్నారు. ఉక్రేన్కు నాటో సభ్యత్వం ఇవ్వకూడదని, యుద్ధం తర్వాత ఉక్రేన్లో నాటో దళాల ఉనికి ఉండకూడదని రష్యా కోరుతున్నది.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com